శృంగారకావ్యగ్రంథమండలి—౧

# రాధికాసాంత్వనము.

ముద్దుపళని ప్రణీతము.

PUBLISHED BY
K. G. MURTHY,
FOR SRUNGARA KAVYA GRANDHA MANDALI.
1000 COPIES.

సర్వస్వామ్యములును
మచిలీపట్టణము,
శృంగారకావ్యగ్రంథమండలివారివి.

*
* *

మధురసంగీతగీతికాలాపమోహనపారవశ్యము—సరసత్వము... చెలులకే చెల్లుతుంది. ఈ, ఔపచారికదోహదవిధులలో...నవవర్ధితమైన కవితావైభము—పరిమళ మలవడినమేలిమి.

యౌవనోపభోగముల చవులెరిగిన మిటారపువయసుకత్తె కవితామాధుర్యము భోజదేవునే పరవశుణ్ని చేసింది. విద్వత్కుటుంబమును సన్మానించి గౌరవించడంలో...కళామోహిని అయినపదుమ కోడలి పద్యరచనకే అగ్రిమర్యాదజరిగినది.

భోజునిభామరగ్రాహిణిసీత...ఎన్నికకువచ్చిన కవితావిదుషి.

ఆంధ్రిభోజుడు—తుళువ కృష్ణరాయని కూతురు...మోహనాంగి!

ఆ వదాన్యరాజసముతో తీరికలు దిద్దుకున్న మహారాష్ట్రి—నాయకుల వినోదనదస్సులలో అపరభారతులై, కనకాభిషేకపరువము దక్కించుకున్న — శృంగారనాయికలు...వలపుల దొరసానులు... ప్రిబంధరూపబంధనిర్మాణాలు...జాణలు.

ఎటుచూచినా మొదటినుంచీ చక్కనికవిత్వరచనచేయడం—కావ్యరసికులను మెప్పించడం—సీమంతినులసొమ్మని విశదమౌతూన్నది.

మండలముల బారున ఋక్సాముచేసిన ఋషులతోబాటు...సంహితకు రచనామణిదీధితులు అలవరించిన వైదికయోషలకున్నూ—ఏకప్రిధనము ఉన్నది. అంతవరకూ ఎందుకు?—'యఃకౌమారహరః' అన్న ఒక్కపద్యమే—శీలభట్టారికకీర్తిని కావ్య అనుక్రిమంలో వర్ధిల్లజేస్తూన్నది.

ఆలంకారికులు అందరూ మధ్యమరసమని శృంగారమునకు ప్రిధానస్థాయా కల్పించినారు. రతి...అష్టాదశకావ్యవర్ణనలలో—ఉద్రేకస్థాయిని రెట్టించి మంగళపరమావధిని కలిగించే ఉపకరణము.

సిసలైన శృంగారకావ్యమును...ఆద్యంతరతివిహారప్రధానంగా రచించవలెనంటే...యౌవనవతి సకలకలాప్రౌఢ—సర్వాంకషరాసిక్య నిధానము వెలయాలు—ఒక్కతే తగుతుంది.

మగవారికి, చేతకాదని...దోషాపాదనము లేశమున్నా కాదు. కాని ఎంతఊహించి కథాదృశ్యమును చిత్రించినా మగవాడు—దీపము ఉండగా ఇల్లు చక్కబెట్టనీయలేడు—చీకటితప్పకనుక. పింగళిసూరన్న స్వతంత్రించినా ననుకున్నా సుగాత్రిచేత ఎదురుబ్రతిమాలించ డానికి...నాయికానాయకులను—వైదికదంపతులను— ఊరివెలుపలి తోటలో చెట్లచాటున దాచివేయక తప్పిందికాదు.

పోనీ కవి అంతకన్న ఇంకా కొంచెంవిజృంభించినా...నాయి కాసాలభంజిక ఊహాగానలయను ఊగవలసినదేకాని...అకృత్రిమ చైతన్యస్పందితముకాదు. విద్యాదయితుడంతటివాడు...ఆడువారి సుఖానందం అనుగతంగా ప్రత్యక్షీకరించుకునేందుకు ... భార్యను బ్రతిమాలి సెక్సు మార్చుకున్నాడని—కళాపూర్ణుని జననవార్తకు పూర్వరంగం ప్రమాణము.

—కవిసార్వభౌమునితో కన్నెతనపు మురిపెములలో ప్రౌఢరికము చలాయించి దేశములుతిరిగి 'కన్నడరాజ్యరమారమణు' ని రసికజీవనం ధన్యముచేసిన తెలుగువాణికి...తాళికోటలో నిలువనీడ తరిగి పోయింది. అష్టదిగ్గజాధిరూఢోత్సవవైభవము కలలలో మలగి పోయినా...మధుర తంజాపురసామంతనాయకులు కావ్యకన్యకజీవన సంధ్యకు అరిగాపులై నిలిచినారు. వయసుజిగివి పోయినా ఆమె అల వాటుచొప్పున ఎడనెడ వింతకైసేతలు మానినదికాదు !

ఆ తళుకులే...నవ్యసారస్వతానికి, రచనాలాలిత్యానికి, ఊతలై నిలిచిన...కావ్యచిత్రశోభలు.

—భోసల తుళజేంద్రుని కుమారుడు—ప్రతాపసింహుడు. తుళజరాజు వెనుకవారు కృష్ణరాయులు నమ్మిన మరాటాసామంత

వీరులు. ముసల్మాను ఒత్తిడిని లక్ష్యముచేయకుండా వీలుచూసు కుని స్వతంత్ర ఆధిపత్యము సంపాదించుకున్న రాహుూతులు. భాషకు...సంప్రదాయములకు కేవలం పరాయివాళ్లయినా ఏలిక అభిరుచులను మరగినభాగ్యాన తెలుగుకవిత్వాన్ని—కవులను, ఆద రించి గ్రంథరచన ప్రోత్సహించారు. రఘునాథుడు—విజయరాఘ వుడు—అటు, తిరుమలనాయకుడు—చొక్కనాథుడు ..వీరందరూ లేకపోతే తెలుగుతల్లిని ప్రేమతో పూజాస్థానంగా చేసుకోకపోతే... రంగాజీలాటి దివ్యతారలు మెరసిపోకపోతే...ఎంత అంధయుగం— వాఙ్మయచరిత్రలో !...వెలుగు యీనాటికైనా కోలుకోనేదా ?

ప్రతాపసింహుడు—రసికప్రభువు—1749 మొదకొని పద హారు సంవత్సరాలు పరిపాలనచేసినాడు. ఈతని కుమారుడు... పితామహుని పేరిటివాడు...' భరతశాస్త్రనిధి: సంగీతం ఆతనిసొమ్ము: రూపమున మన్మథుడు.'

ఇంకొకరసికుడు—ప్రతాపసింహుడే ఉన్నాడు—అమరేంద్రుని కుమారుడు...

ప్రతాపసింహుడు వైష్ణవుడు. తండ్రినాటినుంచి కుల గురువు—తిరుమల తాతయాచార్యుడు—బ్రహ్మవిద్యానిధి.

◆ ◆ ◆ ◆

చోళసింహాసనాధ్యక్షుడైన ఆ మహారాజు వలపునేస్తము— ముద్దుపళని...

—పళని...దక్షిణదేశంలో వేలాయుధుని పూజాక్షేత్రము. ముద్దు—ముత్తు...తమ ముద్దుచెల్లించునేందుకు ద్రావిడులు— కన్నపాపలకు ఉంచే, నామ—పూర్వపదము. ' చాలచోట్ల బిడ్డలకు దేవస్థలములపేరులే ఉంచుచుండుట వాడుకఉన్నది '—అని...నిత్య సువాసిని బెంగుళూరి నాగ(గాన)రత్నం గ్రంథస్థము చేసినది.

ముద్దుపళని తండ్రి ముత్యాలు. ఈతడు, అనుష్ఠానికవైష్ణవుడైన నాలవజాతిగృహస్థు.—అసలు అవ్వాయ్యకు—ఒకకొడుకు ఒక కూతురూ... ముత్యాలు తంజనాయకి అని. వీళ్ల తల్లి—చెంగాతి...

ఎందుచేతనో చెప్పవీలులేకుండా ఉన్నది: భార్య తనకన్న ముందుగా చనిపోవడంచేత, ఒక్కడూ పిల్లలను సాకలేకపోయినాడో—లేక, చిన్నతనంలో తలిదండ్రులు కరవాటచేత ఆమెపాలబడ్డారో—కాని ... తంజనాయకి అని ఒకవేశ్య — ముత్యాలునూ ఆతని తోబుట్టువునూ పెంచుకున్నది.

...చిన్నతంజనాయకి—కులవృత్తిలోకి దిగిపోయింది. ఆమె కూతురు—రామామణి...తనపేర ఒకఅగ్రహారం నిర్మించి అనేక సత్కార్యాలు...సప్తసంతానములలో వీలైనన్ని ప్రతిష్ఠించి—సంపాదన సద్వినియోగం చేసింది.

—ముత్యాలు...పోటి అనే భార్యతో—నలుగురుకొడుకులు ముగ్గురు కూతుళ్లు...సంసారవృద్ధి చేసుకున్నాడు.

ముద్దుపళని...తొలిచూలు. ఇంకో చెల్లెలు ముద్దులక్ష్మి: చివరపిల్ల పేరు—పద్మావతి. వీళ్లు ఇద్దరూకూడా అక్కతో సమానలైన జాణలే: కాని, ఏమహారాజులు వారిని ఆదరించారో వివరములు తెలియడములేదు....

'ముద్దుపళని'—ఈ నామం మరాటాబాణీలో ఉన్నదని అనుమానించి బ్రౌనుపండితుడు—ముత్యాలువంశం తెలుగునాటది కాదు అని అభిప్రాయపడినాడు. అచ్చతెలుగు కుటుంబము... దేశము అలజడిలో దక్షిణానికి తరలిపోయి ఉండవచ్చును. వైష్ణవ ఆవేశంవల్ల ద్రావిడనామములు అలవాటుచేసికొని ఉండవచ్చును కొంతవరకూ. ముత్యాలు మరియిద్దరు కుమార్తెలకు—లక్ష్మి, పద్మావతి—అని అరవకల్తీలేని సంస్కృతనామకరణమే చేశాడు కాదూ?

...కనుక ముత్యాలు—చిరవాసంచేత సగం ద్రావిడుడైన ఆంధ్రుడేకాని—మహారాష్ట్రుడు ఎలాఅవుతాడు ?

ముద్దుపళని...భరతాభినయంలో ప్రావీణ్యం సంపాదించుకుంది...కులమర్యాదక్రమాన. వయసుకాడైన వైష్ణవదేశికుడు...'తపఃఫలసారుండు'...వీరరాఘవుడు—సాహిత్యనేపథ్యము శృంగారించినాడు. ఇక మహారాజు మనసుకు నచ్చడానికి...ఏమికొదువ?

అయితే: ముద్దుపళని—రంగాజీవలె శాస్త్రకాకలదీరిన పాండిత్యధీరకాదు. గొప్పచక్కదనం, అందుకు వన్నె తెచ్చే భరతవిద్య—వీటికి దీటైన సరసత్వం సాహిత్యం—అన్నిటినీమించిన...మహారాజ భోగానుభవయోగము !...

♦ ♦ ♦ ♦

కృష్ణునికి—సాంత్వనోపాయాలు, పదాఘాతబహూకృతులూ—వింతలుకావు. తిమ్మన్న ప్రసిద్ధ—ఉత్పాద్యవస్తువును...రాయలవారుకూడా, గీర్వాణిలో ముఖరించినారు. ప్రీణనకావ్యములు ముద్దుపళనినాటికి కొత్తలుకావు. కాని, ఆ కథాకలాపమంతా...సత్య మీదుగా నడిచింది.

'రాధికాసాంత్వనము'...ముద్దుపళని రచించే అవసరాన—వీరరాఘవదేశికుడు సలహాయిచ్చి అపుడపుడు సాహాయ్యపడి ఉండవచ్చును. కాని ఆతని పాండిత్యానికీ ప్రతిభకూ—యీప్రబంధములో విశేషముపని తగులలేదు.

రావిపాటి తిప్పన్న సంస్కృత 'ప్రేమాభిరామము' ను...వల్లభరాయుడు అనుసరించినట్లు, ముద్దుపళని సాంత్వనకావ్యమునకు ఏవో ఒరవడులు ఉండిఉండవచ్చును.

♦ ♦ ♦ ♦

...కృష్ణుని, యశోదానందులు గారాబంగా పెంచుకుంటున్నారు వ్రేపల్లెలో...నందునిచెల్లెలు—రాధ. పెంపకములాలనలో

మరులు రేకెత్తించి...'గోపసతులకెల్ల కుసుమశరు' డైన 'రాజగోపాలమూర్తి' ని వశముచేసుకుని హరికి ప్రాణప్రదమై స్వైరవిహారం చేస్తూఉన్నది.

యశోద తోడబుట్టినవాడు కుంభకుడు. ఆతనికూతురు... ఇళను, కృష్ణునికియిచ్చి పెళ్లిచేశారు. పిల్ల మేనత్తవద్ద చనువుచేత వ్రేపల్లెలోనే ఉంటూన్నది. ఆమెపోషణకూడా రాధదే...

—ఈడేరినతరువాత...ఇళకు మాధవునకీ ..ఔపోసనకార్యం జరిగింది. రాధశుశ్రూషలో గడిదేరినఇళ—పసిబాలఅయినా—ప్రౌఢమర్యాదల చవులెరిగిన నాథుణ్ని అనురక్తునిగా చేసుకున్నది.

కొన్నాళ్లకు, భార్యతో కృష్ణుడు అత్తవారింటికి మిథిలకు వెళ్లాడు. రాధ—మొదలు, కృష్ణుడు ఇళతో దాంపత్యంచేస్తూన్న శృంగారభావనే—సవతిమత్సరంపూని — సహించలేకపోయింది ... ఇళమీద ఎంతప్రాణమైనా. ఇక ఆతడు కంటికికూడా దూరమైనప్పుడు ఆమెవేదన...వర్ణించడానికి వీలవుతుందా ?—

విప్రలంభము భరించలేక...చిలుకను రాయబారమంపింది. అది మిథిలకు రెక్కలమీదవెళ్లివచ్చి అక్కడి విలాసాలన్నీ అతిశయంగా వర్ణించేసరికి...రాధ తూలిపోయింది...

ఇంతలో కృష్ణుడికికూడా...రాధను చూడకుండాఉండటం దుర్భరమైతోచి తిరిగివచ్చేస్తాడు. రాధ, ఆతన్నిచూడగానే ఉక్రోషంకొద్దీ మండిపడి తాచులాగా లేస్తుంది: ఇష్టంవచ్చిన మాటలంటుంది: క్షమను అర్థిస్తూ ఆతడు పదములు అంటబోతే—తంతుంది: చివరకు వలవల ఏడుస్తుంది.—ఈమాదిరిగా నాటకమంతా జరిపి... నాథునికౌగిలిలో...ఆకులలో పిందెలాగా...అణగి పరవశిల్లిపోతుంది. అక్కడితో—కథకంచికి ...

ప్రబంధము నాలుగుఆశ్వాసములుగా. పెరగడంకోసం ... ముద్దుపళని, రాధచేత ...చందోప్రాలంభనాదికములు, ఛాందసకార్యములు చేయించింది. అంతమాత్రమే!—ప్రత్యేక కల్పనాలంకృతములు కావు ఆభాగములు: విశేష చమత్కారములున్నా లేవు...

—కాని, రాధను చిత్రించడంలో ముద్దుపళని శిల్పసౌభాగ్యమంతా వినియోగపడింది. రాధ...నందునికన్నా చాలాచిన్నది. గేహే గేహే జంగమా హేమవల్లులు మెరసిపోయిన వ్రేపల్లెవాడలోనే...ఆమెనుమించిన అందాలరాసులు లేనందువల్ల...గోపకిశోరునికి ఆమె అనంగసర్వస్వరూపమవటంలో విశేషం ఏమీలేదు. వివాహిత; కాని, మోట—గొల్లమగనితో కాపురం చేయకపోవడం—నందాదులుహర్షించి ఊరుకున్నారంటే...సామాన్యకుటుంబధోరణిలో కళంకమైనా ... అది వారిరసజ్ఞతనురెట్టిస్తూ, లోకైకశృంగారవీరశేఖరుడైన కృష్ణునికి పెంపుమకులముగా ఉండగలతాహతుకు ప్రతిపత్తి కల్పిస్తూన్నది.

కృష్ణుడు...రాధకు సర్వమున్నూ. కృష్ణుని చిన్నిభార్య కనుక ఇళను ఎంతోకూరిమితో పెంచి...ఆతనికి తగినయిల్లాలుగా తయారు చేసింది తన అనుభవమంతా వినియోగించి. —శృంగారించి గదిలోకిపంపింది. ఇక అక్కడనుంచీ...ఆమె ప్రవృత్తిసాఫుగా మారిపోతుంది. అంతకుముందు, ఇళ తనశిష్యురాలు. నవ్వులాటకు సవతి అని పరిహాసంచేసినా...మనసులో బాధపడవలసిన అవసరం లేకపోయింది—వ్యథ ప్రత్యక్షంగా అనుభూతంకానందువల్ల.

—పడకటింటి గదితలుపు గడియపడగానే...రాధగుండెల్లో రాయిపడ్డది. దంపతులిరువురూ ఏకాంతాన అనుభవించే సుఖమును తలచుకొన్నకొలదీ...మతిపోతూన్నది. తనకులేదని ఒకమూలచింత: తనవాడు—మరొక్కతెతో—ఇళ అయినప్పటికీ—తనకుఖాయములైన భోగములు పొందుతున్నాడని...అంతకుమించినవేదన. తెల్లవార్లూ ఎలావేగించిందో...పొద్దుపొడవకముందే — ఇకనిలువలేక

— వెళ్లితలుపుతట్టి...లోపలికిచొరవచేసుకుని జొరబడి, కసి — పసిగా—తీర్చుకున్నది...

...కుంభకుడు కూతుర్ని అల్లుడినీ తీసుకపోవడానికి వచ్చినప్పుడు రాధనుకూడా సమ్మతిఅడిగినాడు. అత్తా—అల్లుడిపరిచయం అందరూ ఎరుగున్నదేకదూ?...కాని ఆమె ఏలాపంపగలదు?—మరి పంపకనూ విధిలేదు. అందుచేత మనోగతభావములను పైకితొణకనీయకుండా చాలాసరదాగామాటాడి సంతోషముగా సరేనన్నది. ఇక తరువాత ...ఆమె అవస్థ...

—కృష్ణుడు మిథిలనుండి బెదురుతూనేవచ్చాడు...విడిచి వెళ్లినందుకు రాధ ఎంతగా దండిస్తుందోఅని. కాని ఆమె తయారీలో రాటుదేరినవాడే గనుక అనునయించలేకపోతానా అని భరోసా మాత్రం ఉన్నది. అయినా ఏమవుతుందోననేభయం ఆదుర్దా, లేకపోలేదు.

కంటబడగానే...ఎన్నినిష్ఠురములాడింది!...ఎన్నిరకాల దెప్పిపొడిచింది!...ఎంతకోపము తెప్పించుకుని బుసలుకొట్టింది! అయినప్పటికీ, లయవిడవకుండా—మూర్ఛనలో తొట్రిలు గమకించే మహాగాయకుడి గీతాలాపనలాగు, అంతకసురుతున్నా...వెల్లివిరిసిన అనురాగం, అపేక్ష — అంతర్వాహినిగా ద్యోతకమౌతూనే ఉన్నవి. నాథుని అలయించి—అలరించడం...కులపాలికల సామాన్యశృంగారధర్మమైనా ఇన్నిపోకడలు—ఎత్తులు, వాళ్లకు చేతనవుతవా?—తుల్యానుభవయోగ్యతఉన్న సరసనాయకితప్ప...మరొకరు కథా రసపోషణము—ఇంతప్రౌఢిమతో చేయనేర్పరులయేవారా?

◆ ◆ ◆ ◆

ముద్దుపళని వారాంగన అని...సనాతనులు ఆమెను తత్కర్తృకములనూ...అకారణవైరంతో కృత్రిమంగా ఈర్ష్యించవచ్చును.

కాని, ముద్దుపళని—మహారాజరసికసమ్మానిత కాకపోయినట్లయితే... తెలుగులో—'రాధికాసాంత్వనము' వెలువడేదికాదు...

శృంగారవర్ణనము గర్హ్యమనే వైదికులకు...జవాబు అనవసరము. అనభిజ్ఞులకు విద్యాదానంచేయడం వ్యర్థము. హేయ జుగుప్సా కలుషితముకాని శృంగారస్థాయిలేనిది...ప్రకృతి—స్థితికే—మోసం.

'రాధికాసాంత్వనము' నిస్సంశయముగా సత్ప్రబంధము. నాయికలేని బ్రహ్మచారికూటము గనుక—విశాఖదత్తునికృతి అసత్కావ్యములజాబితాలో చేర్చినారు పూర్వలాక్షణికులు అని...మల్లినాథుని స్వారస్యసిద్ధాంతము...

గొప్పకవిత్వధోరణులులేవు కానిచదివినకొలదీ చవులూరించి ఆలోచనలలోముంచి ఆనందపారవశ్యము ఆవహింపజేసే రసవత్ కావ్యచిత్రము...'రాధికాసాంత్వనము'.

◆ ◆ ◆ ◆

రాధఎవరు? చైతన్యసంప్రదాయవైష్ణవసిద్ధాంతముల వివరణానికి, వేదాంతానికీ ఏమికాని...నందగోపుడికి రాధ అనేచెల్లెలు ఉన్నదని ఆమెకు మేనల్లునితో తగులాటమైనదనీ మొదట ఎవరుకల్పించారో?—జయదేవుడు...యీకథను నమ్మినాడు. సంసారాన్నీ, చేసుకొన్న మొగుణ్ణీ త్రోసివేవి...కృష్ణుని పెనవైచుకొనిపోయిన ఈ రాధకు...శృంగారసంచారంలో మన గణనప్రకారం — అది భగవద్విషయమైనా—వ్యభిచారదోషముఉన్నది. మరి ఆ కందులోనూ ఏదో స్వారస్యం ఉండటముచేతనేకాదు...ఇంతవరకూ ప్రతిహతంకాకుండా దేశమంతా ప్రాకిపోయింది? తెలుగులో—రాధామాధవుల శృంగారలీలలకు ప్రతిభాసిత ఉపోద్ఘాతము—సరసభావుకులకు ఏకైక అవలంబనము. 'కరివేల్పుశతకము'—ఎవరికావ్యాత్మ—ఆరచనలో

పునీతమైనదో నిశ్చయించ వీలూ ఆధారములూ లేవుకాని... ఇంత వరకూ రంగాజీ—ముద్దుపళనీ, పృథక్త్వయా ఆ—ప్రతిష్ఠను—పంచుకుంటున్నారు...

ఇంకొకరాధ ఉన్నది... వృషభాను నందిని. ఆమె కన్యా: స్వీయ: కృష్ణుని ధర్మపత్ని. రూపగోస్వామి—'విదగ్ధమాధవము' లోనూ, మధురాదాసు—'వృషభానుజ' లోనూ ఈ రాధవివాహ గాధను రూపకవస్తువుగా తీసు కున్నారు. పరిణయ పరిణతికి—యోగిని నాయికానాయకులకు రాయభారములు నడిపింది. అంతేకాని, వృష భానుజ—రాధ—పరకీయ్య కాదు....

ఏది ఎలాఉన్నప్పటికీ మన్మథమన్మథునికి—సరిపోలిననాయిక రాధ. ఆమెపరకీయ అయినందువల్లనే దాంపత్యశృంగారము అప్రాకృతధోరణిలో పల్లవించి... వివిధ—రత్యాలంబనభావశబలితమైనది.

రాధప్రేమవాహినిని... తెలుంగుకావ్యకేదారప్రాంతముల పరవళ్లు పోలించిన ముద్దుపళని... ఉత్తమా—ధన్య...

VMBhushan

# ప్రస్తావన

సీ. శ్రీపరిపూర్ణ మా ప్రేక్షణైవాడలో
నందగోపాలునిమందిరమున
నవతీర్ణుడై మేనయత్త యౌ రాధికా
విధుముఖి చేఁ బ్రేమఁ బెంపుఁ గనుచుఁ
దన మేనమామకూఁతు నిళాలతాంగిని
బెండ్లాడి యామెతో వేడ్కనుండఁ
దనవియోగముచేతఁ దాళఁ జాలక చాలఁ
జింతిల్లుచుండుటఁ జిల్కవలన

తే. విని మిథిలనుండి యింటికి వేగ వచ్చి
చతురగతులను రాధికాసాంత్వనమ్ముఁ
జేసి దక్షిణనేతగా వాసిఁ గన్న
చిన్నికృష్ణుని మనసులో నెన్నుచుందు.

నేను చిన్ననాటనుండియు సంగీతవిద్యతోపాటుగా సాహిత్యవిద్యయందుఁగూడఁ గొంచెము గొప్పపరిశ్రమచేయుచు మా దేశభాష యగు కన్నడములోను దెలుఁగులోను బెక్కు గ్రంథములు చదివితిని. తరువాత బెంగుళూరినుండి యీ చెన్న పట్టణమునకు వచ్చినది మొదలుగా నడవములోఁ గూడ ననేక గ్రంథములఁ జదువుచుంటిని. అయినను నాకాంధ్రభాషా గ్రంథములయందుఁ గలయభిరుచి పై భాషలలో నంతగా లేకపోయినది

ఇట్లుండఁగా "వేలాంవెట్టి" అనుసామెతగాఁ జాలదినములనుండి తెలుఁగుబాసలోఁ గవిత్వము చెప్పవలయు నను కుతూహలము కూడఁ గలిగి పట్టుదలతో మరల భారతాదిగ నాంధ్రగ్రంథములు చదివితిని. పదపడి బ్రహ్మశ్రీ శతావధానులు తిరుపతి వేంకటేశ్వరకవులు విరచించిన శ్రవణానందము మొదలగు గ్రంథములు చదువుచుండఁగ వారి "పాణిగృహీత" యను ప్రబంధములోని

తే. రాధికాసాంత్వనమ్మును రచనఁ జేసి
పేరు గనుముద్దుపళని తెల్వియును విజయ
నగరభూపాలుఁ డుంచిననాఁటిచాటు
పద్యములు గాంచి యాకీర్తి పడయ నెంచి.

అను పద్యమును జూచి రాధికాసాంత్వనమును గడుఁగుతూహలముతోఁ గొని చదువఁగా నందు ముద్రాసమయమునఁ దటస్థించిన తప్పు లెన్నియో కన్పట్టినవి, అయ్యయ్యో! ఇయ్యది మంచి ప్రతి దొరకకపోయినదే యని విచారించుచుండఁగా దైవవశమ్మున నామిత్రు లొకరు చాలకాలము క్రిందట వ్రాసిన వ్యాఖ్యాన సహిత మైనయొక వ్రాఁత ప్రతిని నాకుఁ బంపించిరి. అదియు నచ్చు ప్రతియు సరి చూడఁగాఁ జాలవ్యత్యాసము గనుపించినది. మంగళాచరణము మొదలు షష్ఠ్యంతములవఱకును గల పీఠిక లేకపోవుటయే కాక మధ్యమధ్యను గొన్ని పద్యములుకూడ లేవు. మఱికొన్ని చోట్ల పద్యములచరణములే విడువఁబడియున్నవి. ఇట్టిముద్దుపళని యట్టురాధికాసాంత్వనమును రచించినది

## ముద్దుపళని.

ఈమెను గూర్చి మ॥రా॥శ్రీ కందుకూరి వీరేశలింగముపంతుల వారు తమయాంధ్రకవుల చరిత్రములో వ్రాయించినపద్యములు కొన్ని యవసరమునుబట్టి యిం దుదాహరించుచున్నాను. "ముద్దుపళని పద్యకావ్యములుచేసిన స్త్రీలలో నొకతె. ఈముద్దు పళని వేశ్యాంగన. ఇది రాధికాసాంత్వన మను నాలుగాశ్వాస ములశృంగార ప్రబంధమును రచించెను. దీనితల్లి పేరు ముత్యాలు. అది తంజావూరు సంస్థాన ప్రభు వయిన ప్రతాపసింహుని యుంపుడుకత్తె యయినట్లు...గద్యములో వ్రాయఁబడినదానిని బట్టి యూహింపఁ దగియున్నది. దీనికే ఇళాదేవీయ మనునా మాంతరము గలదు" అని యున్నది. ఇందు "తల్లి పేరు ముత్యా లనియు, గద్యములో వ్రాయఁబడినదానినిబట్టి యూహింపఁదగి యున్నది" అనియు వ్రాయుటచే శ్రీపంతులవారుకూడఁ బీఠికను జూచినట్టు గన్పట్టదు. పీఠికలోఁ గవయిత్రి వంశవర్ణనము గలదు. ముత్యా లనునతఁడు పళనికిఁ దండ్రి. "ముద్దు" అనునది యుప నామము. పళని యనఁగా దక్షిణదేశములోని సుబ్రహ్మణ్య స్వామి వేంచేసియున్న దివ్యస్థలమునకుఁ బేరు. చాలచోట్ల బిడ్డలకు దేవస్థలములపేరులే యుంచుచుండుట వాడుక యున్నది. ఈ ప్రబంధములో యశోదకు మేనగోడలును శ్రీకృష్ణునికి భార్య యు నగు నిళాదేవిచరిత్ర ముండుటచే దీని కిళాదేవీయ మను నామాంతరము వచ్చినది.

"ఇది సంగీతసాహిత్యభరతశాస్త్రములలోఁ బ్రవీణురాలైనట్టు తానే చెప్పుకొన్నది. దీని కవిత్వము నాతికఠినమై మృదువుగా నుండినందుకు సందేహము లేదు. దీనికి మంచి సంస్కృతాంధ్ర

సాహిత్యమును గలదు. అందందుఁ దప్పు లున్నవి కాని యట్టి తప్పులు పురుషులకవిత్వమునందు సయితు మనేకగ్రంథములలోఁ గానంబడుచున్నవి" అని శ్రీపంతులవారే యొప్పుకొనిరి. బాగుగా నాలోచించినచో శబ్దమునుబట్టియో అర్థమునుబట్టియో భావములనుబట్టియో రసమునుబట్టియో ఔచితిని బట్టియో యెటు లయిననేమి తప్పులేకుండ భారతము మొదలుగా నేగ్రంథమును లేదు. ఇట్లుండఁగా స్త్రీలు వ్రాసినగ్రంథములలోఁ దప్పు లుండుట యొకతప్పు కాదు. "అయినను గ్రంథములోనిభాగము లనేకములు స్త్రీలు వినఁదగినవియు, స్త్రీనోటినుండి రాఁదగినవియుఁ గాక దూష్యములై యున్నవి" అని శ్రీపంతులవారు వ్రాసిరే కాని తారాశశాంకవిజయము, హంసవింశతి, వైజయంతీ విలాసము మొదలగు గ్రంథములలోనివానికన్న నెక్కువగా నిందు దూష్యము లున్నవా? అదిగాక స్త్రీలు పురుషులవలన వినఁగూడక పోవచ్చునుగాని తమలోఁ దాము చదువుకొనుటకు బాధక మే మున్నది? ఇంతకును నిది భగవచ్చరిత్రము, తారా శశాంకవిజయాదులవలె స్త్రీలకుఁ జెడుబుద్ధులు గఱపువిషయ మేదియును నిందు లేదే. "ఇది జారత్వమే కులవృత్తిగాఁ గల వేశ్య యగుటచే స్త్రీజనస్వాభావిక మైనసిగ్గును విడిచి శృంగార రస మనుపేర సంభోగాదివర్ణనములను బుస్తకమునిండ మిక్కిలి పచ్చిగాఁ జేసినది" అని వ్రాసిరి. అగ్నిసాక్షికముగా నొకమగనిం గట్టుకొని రెండవమగనితోఁ బోవుట జారత్వ మనిపించుకొనును గాని వేశ్య జారిణి యనిపించుకోదు. బ్రహ్మసృష్టినాఁటినుండియు వచ్చుచున్న మాజాతికిఁ గులవృత్తి యెట్టిదో ఆసంగతియంతయు

వాత్స్యాయన కామసూత్రములఁ జూచువారికి యథార్థము గోచరించును.

సిగ్గనునది స్త్రీజనమునకే కాని పురుషులకుమాత్రము స్వాభావికము కాదు కాఁబోలును. ఇక్కవయిత్రి వేశ్యగనుక సిగ్గుమాలి సంభోగాదివర్ణనములు పచ్చిగా వ్రాసిన వ్రాయవచ్చును. కాని శిష్టు లనిపించుకొన్న పురుషు లట్లు వ్రాయఁగూడదుగద? అట్టి మహానుభావులుమాత్రము తమతమగ్రంథములలో నింతకన్న నెక్కువపచ్చిగా వర్ణనలు చేయలేదుకాఁబోలును. వేయేల? శ్రీపంతులువారే తమకవులచరిత్రలో "వేశ్యాసంపర్కమువలన నెట్టిదృఢమనస్కులకును ననర్థములు వచ్చునని చూపుటకయి యింతవఱకుఁ గల్పింపఁబడినకథ నీతిబోధకముగానే యున్నది కాని తరువాతికథమాత్రము నీతిబాహ్యముగా నున్నది" అనియు, "ఇటువంటి సిద్ధాంతములే మనదేశములో నీతికిని మతమునకును గూడ నమితమైన చెఱుపును గలుగఁజేయుచున్నవి. నీతిని విడిచినమత మెప్పుడును దేవునికిఁ బ్రీతికరము కానేరదు" అనియు నిందించి తరువాతఁ దమస్వహస్తముతో సరిచూచి యచ్చొత్తింప నిచ్చిన వైజయంతీవిలాసములోని పచ్చవిల్తుని పెచ్చుకపట్టుకన్నను, వీరే స్వయముగ రచించిన * రసికజనమనోరంజనములోని బూతులకన్నను నిందుఁ బచ్చిబూతులు కన్పట్టుచున్నవా?

ఈగ్రంథము రస మెక్కుచుండుటచేతను, ఇది రచించినది స్త్రీయేగాక మాజాతిలోఁబుట్టినదగుటచేతను దీనిని

* వీ రధికారమం దుండుటచే మదరాసు విశ్వవిద్యాలయములో దీనిని వీరు పఠనీయగ్రంథముగా నిర్ణయించుకొనిరి.

మంచిప్రతిగా ముద్రింపవలయు ననుతలంపుతో వ్రాఁతప్రతిని ముద్రితపుస్తకమును సరిచూచి నామనసున కింపైనపాఠము నుంచి యొకప్రతి పనిఁబూని వ్రాసితిని. ఇటీవల బ్రహ్మశ్రీ వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారు ప్రాచీనప్రబంధములను మంచిస్థితిలోనికిఁ దెచ్చుచుండుటచే దీనినిగూడ వారే యచ్చొత్తించినచోఁ జాల బాగుగ నుండు నని యెంచి యీ ప్రతి యనేక వందనములతో వారియొద్దకుఁ బంపించితిని. ఇది వ్రాసినదియు సవరించినదియు స్త్రీయే యగుటచేతను గలిగినతప్పుల నొప్పులుగా గమనింతు రని స్త్రీలయందు గౌరవము గలవారిని బ్రార్థించుచున్నాను.

| | |
|---|---|
| సౌమ్యసంవత్సరపు<br>మహాశివరాత్రి.<br>చెన్నపట్టణము 9-3-1910 | ఇట్లు,<br>సహృదయవిధేయురాలు,<br>బెంగుళూరు-నాగరత్నము. |

శ్రీరస్తు.

(ఇళాదేవీయ మనునామాంతరముగల)

# రాధికాసాంత్వనము.

## ప్రథమాశ్వాసము

శ్రీ లం జెలంగురాధికను
జెల్వారో నిన్నిల రూపురేఖలం
బోలుదు రేపడంతు లన
మోహపుటాలిని నిప్ప డెన్నెదో
హాళిని నన్నుఁ గూర్చి యని
యల్గినయచ్చెలిఁ గౌఁగిలించుగో
పాలునిఁ జిన్నికృష్ణునిఁ గృ
పాళునిఁ గొల్తు నభీష్టసిద్ధికై.

సీ. రహిఁ ముద్దుటడుగులు ♦ రాజీవములఁ గేరఁ
బ్రపదముల్ తాఁబేటి♦వగలఁ బోర
సరసోరుకాండముల్ ♦ సౌకర్య మేపార
లేఁగౌను సింగంపు♦లీలఁ జీరఁ
జనువళుల్ త్రివిక్రమి♦సౌజన్యమునఁ దేఱ
భుజములా రామతా♦స్ఫూర్తి మీఱ
రమణీయముఖకాంతి ♦ రామచంద్రునిఁ జేరఁ
జిరునవ్వు బలుతెల్వి♦గరిమఁ గోరఁ

తే. గీ. గన్నుఁగవ శ్రుతిలంఘి యై♦కలిమి గులుకఁ
దనరుమధురాధరము కల్కి♦తనముచిల్కఁ
జెలఁగుశుకవాణి రుక్మిణీ♦జలజపాణి
భావభవుమాత సంపద ♦ లీవుఁ గాత. 2

చ. నెఱిగమనంబు వేణియును ♦ నిక్కుచనుంగవ మీఁదిపాదముల్
కరులును శేషభోగియు న♦గంబులు నాదిమకూర్మరాజ మై
వఱలఁగఁ బొల్చుగంధవతి♦భామ మనోహరరూపసత్త్వతన్
నరకుని గాంచి పెంచుగతి ♦ నన్ గృప నెప్పుడుఁ బ్రోచుఁ గావుతన్. 3

ఆ. వె. శ్రీనివాసుఁ డైన♦ శేషుని భజియించి
ఘనశరీరుఁ డైన♦గరుడుఁ బొగడి
యఘవిదారి యైన♦హరిచమూపతి నెంచి
పరమసూరిజనులఁ ♦ బ్రస్తుతింతు. 4

మ. శ్రుతి వాల్మీకిపరాశరప్రియసుత♦శ్రీకాళిదాసాదిసం
స్కృతవిద్వత్కవితాజ్ఞులం బొగడి భ♦క్తిన్ నన్నయార్యుండు స
న్మతి యాతిక్కన సోమభాస్కరులు శ్రీ♦నాథుండు భీముండు నాఁ
గృతు లాంధ్రకవీంద్రులం దలఁతు యు♦క్తిన్ మత్కృతిప్రౌఢికిన్ 5

తే. గీ. పొత్తమున నుండుశల్యంబు ♦ లెత్తి వైచి
శాస్త్రయుక్తిని గొని భేష♦జంబు సేయఁ

గఁ దగునాక్షేపజీవక♦కవులఁ దీర్పఁ
జనదు కృతుల నమంగళ♦జనులు వారు. 6

చ. చెలువుగఁ బూర్వసత్కవులు ♦ చేసినకబ్బము లెన్నొ యుండఁగాఁ
జెలిమిని నీకృతిక్ గణన ♦ సేతురె సత్కవు లందు రేమొకో
భళి కయికొందు రెట్లనినఁ ♦ బద్మముఁపుఁదేనియ నానుతుమ్మెదల్
పులిసి హసించకే యితర♦పుష్పమరందము లోలిఁ గ్రోలవే. 7

వ. అని యిష్టదేవతానమస్కారంబును, గవిసత్కారంబును, కుకవితిరస్కారంబునుం గావించి యెద్దియేనియు నొక్కశృంగారప్రబంధంబు నిబంధింపం దలంచి హరివాసరంబున శ్రీహరిం బ్రార్థించి మన్నిశాంతంబున నిదురింపుచున్న నన్నిశాంతంబున. 8

సీ. కటిఁ జుట్టి కట్టిన♦కనకాంబరముతోడ
మెఱుఁగుచామనిచాయ♦మేనితోడ
నాసికతుదఁ గల్గు♦నవమౌక్తికముతోడ
జిగిలికస్తురిబొట్టు♦మొగముతోడఁ
గరుణారసముఁ జిల్కు♦కన్నుఁదమ్ములతోడ
నెమ్మిరెక్కతురాయి♦సిటుతోడ
గుదిగొని వెన్నాడు♦కుసుమపుంజముతోడఁ
జంద్రసూర్యాదిభూ♦షాళితోడఁ

తే. గీ. బ్రతి యెఱుంగని దివ్యరూ♦పంబుతోడ
సొగసు గనుపించు మవ్వంపు♦సొంపుతోడ
రాధికామణికై దండ♦రమణఁ బూని
చిన్నికృష్ణుండు కలను బ్ర♦సన్నుఁ డయ్యె. 9

తే. గీ. ఇట్లు గనుపట్టునతని నే ♦ నెలమిఁ గాంచి
లేచి సాష్టాంగవందనం ♦ బాచరింప
శౌరి నను జూచి మేఘగం♦భీరరవము
దనరఁగాఁ బల్కెఁ గరుణామృ♦తంబు లొల్క. 10

తే. గీ. చిన్నికృష్ణుండ నే నాదు♦చిత్తమునకు
సమ్మతం బైన రాధికా♦సాంత్వనంబు
తగ నొనర్పు మదీయాంకి♦తముగ నీవు
లలితగుణపేటి శ్రీముద్దు♦పళనిబోటి. 11

వ. అని యానతిచ్చి యంతర్హానుం డగుటయు నేను నిదుర మేల్కాంచి యీశుభస్వప్నం బెవ్వరితోడ విన్నవించెద నని యూహించి యుభయవేదాంతప్రతిష్ఠాపనాచార్యుండును, నిరుపమౌదార్యగాంభీర్యధుర్యుండును, బాషండషండగిరితండమహాఖండలుండును, బాలితభక్తమండలుండును, దిరుమలతాతాచార్యవర్యకులకలశపారావారతారాధారుండును, మదీయపూర్వజన్మతపఃఫలసారుండును, సుగుణాభిరాముండును నగువీరరాఘవదేశికసార్వభౌమునిసన్నిధానంబున కరిగి సాష్టాంగదండప్రణామంబు లాచరించి తత్కటాక్షంబునుం గాంచి యీశుభస్వప్నంబు విన్నవించినఁ దత్సన్నిధానంబునం గలసకలకళావల్లభు లగువిద్వజ్జనంబులు నన్నవలోకించి సాక్షాచ్ఛ్రీమన్నారాయణావతారుం డగువీరరాఘవధీరుచరణారవిందంబు లాశ్రయించినదాన వగుటంజేసి దేవదేవుం డగుశ్రీకృష్ణదేవుండు సాక్షాత్కరించె దీన నీకు నధికశ్రేయఃప్రాప్తి యగు నదియునుం గాక. 12

సీ. ఏరాజు కువలయం♦బెల్ల రంజిలఁ జేసి
జైవాతృకాఖ్య ని♦చ్చలుఁ దలిర్చు
నేలోకబాంధవుం♦డిలఁ దమంబు లడంచి
చక్రప్రమోదంబు♦ సంఘటించు
నేఘనుండు శరంబు♦లేవేళఁ గురియించి
పరవాహినుల నెల్ల♦ భంగపఱచు
నేయాశుఁ డార్యావ♦నాయత్తమతిఁ గాంచి
కీర్తింప సర్వజ్ఞ♦మూర్తి యౌను

తే. గీ. వాఁడు నృపమాత్రుఁడే రఘు♦నాథదయాప్ర
వాహవర్ధితభోసలా♦న్వయపయోధి

సోమతోళజేంద్రవరతనూ♦జుండు శ్రీప్ర
తాపసింహక్షమాపాల♦తల్లజుండు. 13

సీ. తనయార్యనుతమహా♦దార్యవిస్ఫురణంబు
లేఖద్రుఁ బండ్లిగి♦లింపఁ జేయఁ
దనరామభక్తిప్ర♦ధానమానసశుద్ధి
నారదు వెలవెలఁ ♦ బాఱఁ జేయఁ
దనసర్వవిద్యావ♦ధానమేధాస్ఫూర్తి
పన్నగేంద్రునితలల్ ♦ వంపఁ జేయఁ
దనయభేద్యగభీర♦తానారతఖ్యాతి
యంబోధి భంగపా ♦ టందఁ జేయ

తే. గీ. నమర శీతాద్రిసేతుమ♦ధ్యావనీత
లాంతరనిరంతరయశోవి♦లాసభాస
మానభోసలతోళజరా♦ణ్మణిసుతప్ర
తాపసింహేంద్రమాళి ప్ర♦తాపహేళి. 14

తే. గీ. ఆమహారాజుకృపఁ జెంది♦నట్టినీకు
నిట్టిభాగ్యంబు లద్భుతం ♦ బేమి తెల్ప
సార మగునీదువిస్తార♦చర్య లెల్ల
వినుము వినుపింతు మని యిట్టు♦లనిరి కరుణ. 15

సీ. శ్రీరమణీకుచ♦శిఖరాగ్రముల నేవి
చిగురుజొంపంబు లై ♦ జిగి చెలంగు
స్మరరిపుబ్రహ్మాది♦మకుటంబులం దేవి
పద్మరాగంబు లై ♦ ప్రభ లొసంగు
మౌనిరాణ్మానస♦మానసంబుల నేవి
కమలవనంబు లై ♦ ఘన మెసంగుఁ
జిరతరశ్రుతివధూ♦సీమంతముల నేవి
యరిదికుంకుమపట్టు ♦ లై వెలుంగు

తే. గీ. నట్టిసర్వజ్ఞమాళిశృం♦గాగ్రనటన
పటుతరక్రమత్రిజగతీ♦పావనప్ర
తీతచారిత్రసురధునీ♦తిలకజన్మ
పదము లనుపమశ్రీవిష్ణు♦పదము లమరు. 16

తే. గీ. ఆమహీనాథుపదపద్మ♦మందుఁ బుట్టి
సురుచిరఖ్యాతిఁ గని నీతి ♦ శూద్రజాతి
దాన నయ్యావయసెలంగె♦దానకర్ణుఁ
డితఁడెయంచని జనులెన్నఁ♦జతురుఁడగుచు. 17

తే. గీ. ఆతఁ డెంతయుఁ గాంచెఁ జెం♦గాతివలన
నతుల యగుముద్దుతంజనా♦యకిని బ్రేమ
నాడి బొంకనివాని ము♦త్యాలుఘనుని
తంజనాయకి వారలఁ ♦ దత్తు గొనియె. 18

కం. అల తంజనాయకీమణి
కలిమియుఁ జెలిమియు గణింపఁ♦గాఁ దర మగునే
తెలివో గెలివో వలపుల
చెలువన్ గెలువన్ దలంచుఁ ♦ జెలువముచేతన్. 19

సీ. వీణ వాయించెనా ♦ వివిధచిత్రాద్భుత
ప్రతిమ లెల్లను తలల్ ♦ పరఁగ నూఁచు
శీవి నటించెనా ♦ దేవలోకపురంభ
కొంచక యాడల ♦ వంచుకొనును
గానంబు వినుపింపఁ ♦ బూనెనా యామహా
గిరిరాజ మైనను ♦ గరఁగిపోవు
సభల మాటాడెనా ♦ చల్లఁగాఁ బన్నీరు
చిలికినశేవను ♦ జెలువు మీఱు

తే. గీ. నని దొరాదొర లెన్నఁగాఁ ♦ ఘనత కెక్కె
ప్రౌఢచేడెలలో నీడు ♦ జోడు లేక

తతసుగుణపేటి దివ్యసౌం♦దర్యవాటి
యతనుమదఘోటి తంజనా♦యకివధూటి. 20

కం. ఆరాజవదన ప్రోవఁగ
నారీమణి ముద్దుతంజ♦నాయకి ముత్యాల్
ధీరుఁడుఁ జెలఁగిరి కుంతియు
నారయ వసుదేవునటుల ♦ ననుకూలముగాన్ 21

కం. అలముద్దుతంజనాయకి
నలు వందెను గలిమిఁ దంజ♦నాయకి యనఁగా
వలపులదొర యైనను గని
వలపులు గొనునట్టిమేని♦వలపులు చెలఁగన్. 22

సీ. ఈవిచేతనె కాదు ♦ ఠీవిచేతను గూడ
శశిరేఖ నెంతయుఁ ♦ జక్కడంచుఁ
జూపుచేతనె కాదు ♦ రూపుచేతను గూడ
హరిణీవిలాసంబు ♦ నొఘుళించు
గోరుచేతనె కాదు ♦ సౌరుచేతను గూడ
దారావినోదంబు ♦ నాఱడించుఁ
దళుకుచేతనె కాదు ♦ కులుకుచేతను గూడ
హేమాతిశయమును ♦ హీన మెంచు

తే. గీ. నని కవుల్ మెచ్చఁ దనరె నొ♦య్యార మెచ్చ
నన్నిటను జాణ సకలవి♦ద్యాప్రవీణ
మేటిమరుదంతి యింతుల♦మేలుబంతి
హరిగుణ ముద్దుతంజనా♦యకీమిటారి. 23

కం. ఆముద్దుతంజనాయకి
ప్రేమను గొని కనియెఁ దీవె ♦ విరిఁ బడసె నన్
భూమీశు లెంచఁ దగునఖ
రామాద్భుతసుగుణమణిని ♦ రామామణినిన్. 24

సీ. ఏరామ కట్టించి ♦ యిడె నగ్రహారంబు
పుడమి రామాంబాఖ్య♦పుర మనంగ
నమర నేధన్య ది♦వ్యాలయం బొనరించి
తిరము గాఁగ శివప్ర♦తిష్ఠఁ జేసె
నెంచి యేపుణ్య పెం♦ట్టించె నందనవని
కొఱ లేనివిరు లెత్తి ♦ కొమరు మిగుల
నేమాన్య జీవనం ♦ బెసఁగఁ దటాకంబు
ఘటియించె సేతుమా♦ర్గంబునందు

తే. గీ. మేటి యెవ్వతె గండర♦కోటలోన
మఱియు నిత్యాన్నదానాది♦మహిమ లంది
పార్వతీశులనిత్యోత్స♦వము లొనర్చె
నట్టిరామామణివధూటి ♦ నలవె పొగడ. 25

సీ. ముదమొప్పఁ దనగోము♦మోము గాంచినవాఁడె
తేజ మొందినరాజ♦రాజు గాఁగఁ
బ్రీతి లేనితనకటి♦ప్రీతిమఁ జెందినవాఁడె
తెఱఁ గొందుభూతలా♦ధిపుఁడు గాఁగ
గోమ రొప్పఁ దనగబ్బి♦గుబ్బ లంటినవాఁడె
నిరుపమదుర్గాధి♦నేత గాఁగ
నలువు మీఱినతన♦నాభి చేకొనువాఁడె
వైభవోన్నతచక్రి♦వర్తి గాఁగఁ

తే. గీ. జెలఁగుకలిమియుఁ జెలిమియుఁ ♦ దెలివి గలిగి
కళయుఁ జెలువము తళుకును ♦ బెళుకు నసుకు
చెలువు గులికెడువలపుల♦సొలపు మిగుల
మిగులు రామావధూటి యర్హ♦సుగుణపేటి. 26

సీ. నారదుం డలవిష్ణు♦నామకీర్తనభక్తి
నీరదుం డౌదార్య♦సారయుక్తి

రాముఁ డద్భుతదయా♦రసనిరంతరబుద్ధి
సోముఁ డంచితకళా♦సుప్రసిద్ధి
రారాజు భీమవి♦క్రమనికారస్ఫూర్తి
భోజరాజు కళాప్ర♦భూతకీర్తి
జిష్ణుఁడు వైభవ♦శ్రీవిలాసఖ్యాతిఁ
గృష్ణుఁడు భరతశా♦స్త్రీయజాతి

తే. గీ. ననఁగ నను వొందు బ్రహ్మవి♦ద్యాప్రవీణ
సరసతిరుమలతాతయా♦చార్యపాద
తోయరుహమత్తచంచరీ♦కాయతాత్మ
పాలితాశ్రితజనుఁడు ము♦త్యాలుఘనుఁడు. 27

తే. గీ. అట్టి ముత్యాలుఘనుఁడు తాఁ♦జెట్టఁ బట్టెఁ
దనకు ననుకూల యగునట్టి♦ధర్మపత్ని
యా నటంచును మానితా♦నూనసుగుణ
పేటి మేటివధూటి శ్రీ♦పోటిబోటి. 28

సీ. శ్రీలక్షణమున ల♦క్ష్మిని సాటి యన వచ్చుఁ
జంచల యై ధాత్రి ♦ మించదేని
వైభవంబున శచీ♦వనిత నీడన వచ్చుఁ
బలుగాకిపుత్త్రిలఁ ♦ బడయదేని
భూతిపెంపున శైల♦పుత్త్రి జోడన వచ్చు
విభుమేను సగము గా♦వింపదేని
నిశ్చలక్షమ ధారు♦ణిని సరి యన వచ్చుఁ
బతులను బెక్కండ్రఁ ♦ బడయదేని

తే. గీ. యనఁగ ననుపమసకలగు♦ణాభిరామ
యగుచు బాంధవజనకోటి♦యభినుతింప
సొంపు మీఱఁగఁ బెం పెక్క ♦ సంపదాఢ్య
హరిగృహవాటి శ్రీపోటి ♦ యన్వధూటి. 29

సీ. సాహిత్యవిద్యావి♦శారద శారద
యై ముద్దుపళని నా ♦ నమరునిన్ను
గురుతరం బై తగు♦గుణగణప్రౌఢిమ
లాయుతుం డై నవే♦లాయుధాఖ్య
భరతభావాభావ♦భావజగురుఁడు నాఁ
గోమరుఁ జెందెడుముద్దు♦కోమరువరుని
రూపవిభ్రమకళా♦రూఢి నెంతయు రతీ
దేవి యనాముద్దుల♦క్ష్మి నవధూటి

తే. గీ. బుద్ధి నల్లారు ము ద్దైన♦ముద్దయార్యుఁ
డీటు లేనట్టిపద్మావ♦తీ లలామఁ
దెలివి మీఱురామస్వామి ♦ నెలమిఁ గాంచె
మేటిముత్యాలు పోటివ♦ధూటివలన. 30

కం. వెలసితివి వారిలోన
నెలిచుక్కలలోనఁ జెలఁగు♦నెలరేక యనన్
లలితకళావిభవంబులు
వల నొప్పఁగ మేటిముద్దు♦పళనివధూటీ. 31

సీ. ఏనాతి నీరీతి ♦ నెంతో భక్తి చెలంగ
వ్రాయించె జయధాటి ♦ రామకోటి
ఏనారి నీదారి ♦ నెలమి విద్వచ్ఛ్రేణిఁ
దనియించె నెర మెచ్చి ♦ ధనము లిచ్చి
ఏకల్కి నీపోల్కి ♦ నిలఁ గీర్తిఁ గైకొనెఁ
గబ్బముల్ చేనంది ♦ ఘనతఁ జెంది
ఏబాల నీలీల ♦ నిటు దొరాదొరలచేఁ
బొగ డొందె గడిదేటి ♦ పొలుపు మీఱి

తే. గీ. తలఁప నేధీర నీమేరఁ ♦ దాతయార్యు
పాదముల వ్రాలె మది నెంచి ♦ ప్రస్తుతించి

కలరె నీసాటి ముత్యాలు♦కన్న మేటి
ప్రబలగుణ మేటి శ్రీముద్దు♦పళనిబోటి. 32

సీ. చెన్నొందురంభ గా♦కున్నచోను బ్రతాప
సింహేంద్రు పెంపును ♦ జెంద నేల
ప్రతి లేనియలకల్ప♦లతిక గా కున్నచో
లలి ముద్దులక్ష్మితోఁ ♦ బుట్ట నేల
తగుదివ్యసుగుణర♦త్నంబు కా కున్నచో
ముత్యాలలోనుండి ♦ పొదల నేల
యిల సుగంధప్రద ♦ మిదియె కా కున్నచో
శ్రీనివాసప్రాప్తిఁ ♦ జెలఁగ నేల
తే. గీ. వీఁక గలచంద్రరేఖయె ♦ కాక యున్న
లలితసకలకళాప్రౌఢి ♦ వెలయ నేల
యని పొగడ మేటి యై మీఱె♦నతనుఘోటి
భవ్యవాగ్ఘాటి శ్రీముద్దు♦పళనిబోటి. 33

ఉ. పున్నమచందమామ కెనఁ♦బోలుముఖంబు ముఖానురూప మౌ
తిన్ననిపల్కు పల్కులను ♦ దేఱిన సద్దయ సద్దయారసో
త్పన్నపుఁజూపు చూపున భ్రు♦వం బగునీవియు సొమ్ము లౌచు మే
న న్నలు వొంద నొప్ప నర♦నాథులు మెచ్చఁగ ముద్దులక్ష్మియున్.

కం. పద్మారిఁ గేరుమోమును
బద్మాస్త్రుఁడు గోరుగోము ♦ బలువాల్గన్నుల్
పద్మాళి దూఱు ననఁ దగి
పద్మావతిరీతిఁ దనరుఁ ♦ బద్మావతియున్. 35

సీ. ఘటియింప నేర్తువు ♦ కవనజాతు లెఱింగి
పలుకులకల్కి వె♦ల్వలనఁ బాఱ
నీయఁగా నేరుతు ♦ విలఁ గోరినవరాలు
నగరాజుసుకుమారి ♦ సగము గాఁగ

చెల్లింప నేర్తువు ♦ చెప్పినరీతిగాఁ
గని ద్రౌపదీసతి ♦ కాన కేగ
నటియింప నేర్తువు ♦ నవరసంబుల నంటి
తగురంభ యనిమిష♦త్వము వహింప

తే. గీ. నీదె మతి యుక్తి పరికింప ♦ నీదె శక్తి
నీదె నెరపద్దు నరయఁగా ♦ నీదె ముద్దు
సరసముగఁ జేసి రాధికా♦సాంత్వనమ్ము
భక్తి హరి కిమ్ము శ్రీముద్దు♦పళనిబోటి. 36

వ. అని నియోగించిన నేనును బ్రబంధనిబంధనోద్యుక్త నై. 37

—♦ ష ష్ఠ్యం త ము లు . ♦—

కం. శ్రీకృష్ణదేవునకుఁ గరు
ణాకరచారిత్రవిలస♦దనుభావునకున్
గోకులజప్రియభావున
కాకృతిజితశంబరారి♦హంభావునకున్. 38

కం. కౌస్తుభయుతవిస్తృతవ
క్షస్తలునకు భక్తలోక♦సంరక్షణతా
నిస్తులునకు శ్రుతిమస్తక
వాస్తునకు సమస్తవిబుధ♦పరవస్తునకున్. 39

కం. శౌరికి జనవాంఛితసహ
కారికిఁ బాండవకులోప♦కారికి నచలో
ద్ధారికిఁ గలికలుషౌఘవి
దారికి దనుజేంద్రమదమ♦తంగజహారికిన్. 40

కం. అర్జునమదనాభ్యాసున
కర్జునకరకాంతిమంద♦హాసున కతిభ
క్త్యార్జునకృతసహవాసున
కరుణవాసునకు ద్వారకా♦వాసునకున్. 41

కం. కరుణావర్ధిష్ణునకుఁ
బరమమునిప్రకరహృదయ♦వర్తిష్ణునకుఁ
గురుకులగిరిజిష్ణునకుఁ
జరగుణయుతవిష్ణునకును ♦ శ్రీకృష్ణునకున్. 42

వ. అంకితంబుగా నాయొనర్పం బూనినరాధికాసాంత్వనం బను శృంగార ప్రబంధంబునకుఁ గథాక్రమం బెట్టి దనిన. 43

కం. శ్రీవనితావరశుభశ్రీయ
శోవారిధిపూర్ణచంద్రు ♦ శుకయోగీంద్రుఁ
భావించి చూచి జనక
క్ష్మావరుఁ డి ట్లనియె భక్తి♦సంభ్రమపరుఁ డై. 44

సీ. మునినాథ [1]మును నేను ♦ బొందుగా హరికథ
ల్వీనులవిందుగా ♦ వింటి నందు
నందుతోఁ బుట్టు గో♦విందుని కర్త యై
వరగుణాకర యన ♦ వఱలురాధ
తా నెత్తి పెంచఁగాఁ ♦ దగునిళాసతిమీఁద
వడి నేల బలుకారు♦ బారుచేసి
గోపాలదేవుపైఁ ♦ గోపించె నపు డెట్లు
దక్షిణనాయకా♦ధ్యక్షుఁ డైన

తే. గీ. దేవకీసూనుఁ డానారి♦తీరు దీఱఁ
దీరుగా నేలె నవి యింపు♦దేఱునటుల
నాన తీవయ్య బహుసావ♦ధానమతిని
విని కృతార్థుఁడ నయ్యెద ♦ విమలహృదయ. 45

కం. అన విని శుకయోగీంద్రుఁడు
వనజాక్షునిదివ్యపాద♦వనరుహయుగళిఁ
దనివారఁ దలఁచి యి ట్లనెఁ
గనులం దానందబాష్ప♦కణములు దొలుకన్. 46

1. విన్నపం♦బొక్కటి హరికథ [మూలము.]

సీ. ఏవంకఁ జూచిన ♦ నేణీవిలోచనా
రతికూజితార్భటీ♦రావచయము
లేచాయఁ జూచిన ♦ నిందుబింబాననా
వల్లకీవాదన♦వైభవంబు
లేతావు చూచిన ♦ నిభరాజగామినీ
[1]సంగీతసాహితీ♦సంభ్రమంబు
లేదిక్కు చూచిన ♦ నింద్రనీలాలకా
భరతశాస్త్రోక్తభా♦వాభినయము
తే. గీ. లెందుఁ జూచిన గోపికా♦బృందగీత
మదనగోపాలసత్కథా♦ మహిమ లలర
నంగభవమల్లరంగమై ♦ రంగుమీఱు
బహుతరస్త్రీలతోడ వ్రే♦పల్లెవాడ. 47

తే. గీ. అందుఁ జెన్నొందునందుని♦మందిరమున
వాసమై యుండుఁగౌస్తుభో♦ద్భాసితుండు
దానవవిదారి [2]యిష్టహృ♦త్తాపహారి
భవ్యగుణపాళి మదనగో♦పాలమౌళి. 48

సీ. కువలయామోదంబు ♦గొనవచ్చుసత్కీర్తి
నిశాకాంతుఁ డగుట సం♦దియము గలదె
కమలాభిరుచిహేతు♦కంబైనతేజంబు
దిననాథుఁ డగుట సం♦దియము గలదె
దానవారిసమృద్ధి ♦ దనరించునస్త్రంబు
దేవేంద్రుఁ డగుట సం♦దియము గలదె
హంసాహితశ్రీల ♦ నలరారునెమ్మేను
నీలాబ్ద మగుట సం♦దియము గలదె.
తే. గీ. యినకరదళోపలాలన♦గనుపదంబు
లంబుజాతంబు లన సంది♦యంబు గలదె

1. సంగీతసాహిత్య [మూ.] 2. దుష్టచిత్తాపహారి [మూ.]

యని తనుగురించి బుధజను ♦ లభినుతింప
ఠీవిఁ దళుకొత్తు శ్రీకృష్ణ♦దేవుఁ డనఁగ 49

సీ. సవరంపుపరువంపు♦సవరంపురుచి నింపు
నెరిసొంపు గలజంపు♦కురులతోడ
నలువొందునెలలందుఁ♦గళలెందుఁ[1]దగఁజిందు
తొగవిందుజిగిఁజెందు♦మొగముతోడ
నునుదమ్ములను దిమ్మ♦లను నిమ్మలనయమ్మ
గనునొమ్మసిరిగ్రమ్మ♦కనులతోడ
[2]నొగిఁ బ్రబ్బుబిగిరబ్బ♦నగుమబ్బు బిగి నుబ్బ
లనుద్రొబ్బుగననబ్బు♦తనువుతోడఁ
తే. గీ. [3]దనర వ్రేపల్లెలోఁ గల♦తలిరుఁబోండ్లు
హరికపటచర్యలకు మోహి♦తాత్మ లైరి
యెప్పుడును జేరి మెప్పించు♦చొప్పుఁ జూచి
మరులుపూనరె సతు లైన ♦ మాను లైన 50

సీ. గురుకుచకుంభము ♦ లుబ్బుధరము ల్గాకున్న
గోపాలకరఘాతిఁ ♦ గొనఁగ నేల
కలికివాల్గన్నులు ♦ కలువలు గాకున్న
హరి[4]చూపుకాంతిచే ♦ నలర నేల
తుల మించుమైదీఁగె♦యలమించు గాకున్నఁ
గృష్ణాంబుధరముతో ♦ నెనయ నేల
శ్రీపాదపద్మము ♦ ల్చిగురులు గాకున్న
మాధవుచేఁ జెల్వ ♦ మంద నేల

1. వగఁజెందు [మూ] 2. కలి మెప్పుడును గప్పు ♦ చెలిమెప్పుఁ గొనుచొప్పు కర మొప్పు నెఱివిప్పు టురముతోడ. [మూ] 3. మారుమాఱని మారుము ♦ మ్రాకు మారి, మాటు లేకయె మీఱు మై♦తీరుతోడఁ, దేజరిల్లెడు గోపాల♦దేవుఁ జూచి, మరులు పూనరె సతు లైన ♦ మాను లైన [మూ.] 4 చూచు కాంక్షచేఁ. [మూ.]

తే. గీ. యనుచు బుధకోటి పొగడఁగాఁ దనరు[1]కోటి
యన్ను వులమిన్న నందుని కన్నఁ జిన్న
వారిధరవేణి రాధికా కీరవాణి
ప్రబలుచు జెలంగ హరిప్రాణ పద మనంగ. 51

వ. అదియునుం గాక. 52

సీ. నెరికొప్పుమినుకొప్పు నిడుద పెన్నెరులతోఁ
నునుజూపు లీనెడు కనులతోడఁ
గళలు దేఱుచు మీఱు కలికి నెమ్మోముతోఁ
విడికెంపు గనుపింపు పెదవితోడ
గెఱిగట్టుకొని పుట్టు నెఱపూపచనులతోఁ
గడుసన్నగిలుచున్న కౌనుతోడ
జిగి హెచ్చుచును వచ్చు చికిలిలేఁదొడలతోఁ
జడతలొల్కుచుఁ గుల్కు నడలతోడ

తే. గీ. రమణఁ బొల్గాఱుచెక్కుటద్దములతోడ
మేల్మి గనుపట్టుచిన్నారి మేనితోడఁ
దేజరిల్లును బేరిళా దేవి యనఁగ
రాజగోపాలుపట్టంపు రాణి యగుచు 53

ఆ. వె. ఆమెఁ గూడి దాన వాళికిఁ గాలుఁడు
గోపసతుల కెల్లఁ గుసుమశరుఁడు
జలజజాదిసురల కలపరబ్రహ్మంబు
తల్లిదండ్రులకును దనయుఁ డగుచు. 54

సీ. మోహించి యొకచోట ముగ్ధభామామణు
లుత్సుకుఁ జూపులఁ గల్వదండ లొసఁగ
మన్నించి యొకచోట మధ్యాణుమధ్యలు
దెలినవ్వులను సుమాంజలులు [2]నెరప

1. బోటు లందుఁదలమిన్న. [మూ.] 2. మడువ. [మూ.]

భావించి ఘొకప్రక్కఁ ♦ బ్రౌఢచంద్రాసన
ల్ఘనకుచలికుచము ♦ ల్గాన్కఁ లీయ
లాలించి రొకయిక్కఁ ♦ లోలలోలాక్షులు
లలి మానధనములు ♦ లంచ మంప

తే. గీ. నందఱకు నన్నివగల నా♦నంద మిచ్చి
చల్ల సేయఁగ నింటింటఁ ♦ జంద్రుఁ డగుచు
మందలో నుండు మన్మథ♦మన్మథుండు
ప్రాభవస్ఫూర్తి రాజగో♦పాలమూర్తి. 55

తే. గీ. విడక దాదు లఱుగులకు ♦ మఱుఁగు లొత్తఁ
గనుయశోదయు గారాబ♦మునను జూడ
గరిమ నందుఁడు గన్నులఁ ♦ గప్పుకొనఁగ
రాధ పోషింపఁదగు నిళా♦రాజవదన. 56

సీ. శౌరిని గని రాధ ♦ చనుగుత్తు లివిగో కొ
మ్మన లేవె తన కింత ♦ యను నిళయును
మురవైరిఁ గని రాధ ♦ మోవిపం డిదుగో కొ
మ్మన లేదె తన కింత ♦ యను నిళయును
వరుని గన్గొని రాధ ♦ నెరిపింఛ మిదిగో కొ
మ్మనలేదె తన కింత ♦ యను నిళయును
బద్మాక్షుఁ గని రాధ ♦ పలుకెంపులివిగో కొ
మ్మన లేవె తన కింత ♦ యను నిళయును
తే. గీ. హరిని గని రాధ యలయాట ♦ లాఱుదాము
పఱుకటింటికి ర మ్మని♦తొడరి పిల్వ
నాడ నేఁగూడ వచ్చెద ♦ ననునిళయును
నవ్వి రాధికామాధవుల్ ♦ రవ్వ సేయ. 57

సీ. మురువుగా దాఁగిలి ♦ మూఁత లాడెడువేళ
యదురాయలకుఁ బల్మ ♦ రెదురుపడును

రీతిగా గుజగుజ♦ లేరు లాడెడువేళ
మదనగోపాలుని ♦ గదిసి నిలుచుఁ
గొమరుగా వెన్నెల♦కుప్ప లాడెడువేళ
మురవైరిచేఁ గను ♦ ల్మూయ నిచ్చు
గుములుగా గుజ్జన♦గూడు లాడెడువేళఁ
గంసవిద్వేషిచెం♦గట వసించు

తే. గీ. నెట్టులైనను దేవకీ♦పట్టికరము
గరము తను సోఁకఁగాఁ గని♦కరముచేత
సుదతియలనాఁడె సైగఁగాఁ♦జూచుఁ బోడ
లమ్మ చెల్ల యిదెంతచి♦త్రాంగి యనఁగ. 58

సీ. పాడించు నొకవేళ ♦ బహుదేశ్య రాగము
ల్వాగించు నొకవేళ ♦ జంత్రవాద్య
మొత్తఁగించు నొకవేళ ♦ భరతశాస్త్రప్రౌఢిఁ
బట్టించు నొకవేళ ♦ భావరసము
నెగడించు నొకవేళ ♦ నెరికావ్యసంగతు
ల్గనుపించు నొకవేళఁ ♦ గవనరీతి
బోధించు నొకవేళఁ ♦ బూవిల్తుశాస్త్రంబుఁ
జదివించు నొకవేళ ♦ శయ్య లోలి

తే. గీ. నూత్ని పోయు మఱొకవేళ ♦ నారజంబు
వచ్చె ననిపించు నొకవేళ ♦ వాద్యవిధము
నెపుడు చూతునో యిదె శౌరి ♦ నెనయ ననుచు
దయ నపుడు పొంగి యిళకు రా♦ధాలతాంగి. 59

కం. నలు గలఁదు జలక మార్చును
జలువలు గట్టించు షడ్ర♦సాన్నము లుంచుఁ
దెలనాకుమడుపు లిచ్చును
గలికీ ర మ్మనుచుఁ దీసి ♦ కౌఁగిటఁ జేర్చున్. 60

సీ. ఒమ్ముగా దిమ్ముఁలై ♦ రొమ్ము రావలె నంచుఁ
గులదేవతల నెల్లఁ ♦ గోరి కొలుచు
నిమురలై మెఱుఁగెక్కి ♦ నెరికురుల్ పెరుఁగంగ
దిన మొకతైలంబు ♦ దెచ్చి యంటుఁ
గలికికన్నెరికంబు ♦ దొలఁగఁ జెంచుల కెంతొ
యిచ్చి తీసినమందు ♦ లిచ్చు నిచ్చు
[1]నెప్పు డీడేరునో ♦ యీముద్దరా లని
యుపవాస మొకవేళ ♦ నుండనియుదు

తే. గీ. వగలు గైసేసి చెలి యుంచు ♦ సొగసుఁ జూచి
దృష్టిపై దృష్టి తీసుక ♦ తెలవ నాదు
సవతి వౌదువె యని చెక్కుఁ ♦ జఱచి మోము
మోమునఁ గదించి నూఱాఱు ♦ ముద్దు లిడును. 61

కం. సతి నిట్లు రాధికామణి
సతతము గసుగందనీక ♦ చనువున మనిచెన్
రతిమగనితోఁటలోపల
లతకూనను బెంచినటుల ♦ లలితము గాఁగన్. 62

తే. గీ. కొమ్మ కటు యౌవ్వనవసంత ♦ గుణ మెసంగఁ
దొలుతఁ గనుపట్టుబాల్యజా ♦ తులు దొలంగెఁ
గరముచివురులు తొవ రెక్కెఁ ♦ గడమతావు
లొఱపు మీఱెను గోకిల ♦ స్వరము లొదవె. 63

సీ. అధరబింబంబున ♦ కరుదెంచుచిలుకల
పలుకులో యన ముద్దు ♦ పలుకు లమరె
ముఖచంద్రమండలం ♦ బును గ్రహింపఁగ వచ్చు
పెనురాహువో యన ♦ వేణి యమరె
నలు వొందునాభిపు ♦ న్నాగంబునకుఁ బొఱు
నళులబా రనఁగ నూఁ ♦ గారు దనరెఁ

1 నెపు డీడుమఱునో. [మూ.]

బదపద్మయుగళంబు ♦ గదిసి పోకున్న రా
యంచ యంచన మంద♦యాన మెసఁగె

తే. గీ. మీరుబహుళవశ్రీ ల్చెంది♦నారు గనుక
విన్నవించెద నని తళ్కు♦బెళ్కు లమరఁ
జేరెనో తెల్ప ననఁ గను ♦ ల్చెవులఁజేరె
రమణి కటు చాలయౌవనా♦రంభవేళ. 64

తే. గీ. [1]గుబ్బగుబ్బలులను ద్రొబ్బి ♦ నిబ్బరముగ
గుబ్బెతకు [2]గబ్బిసిబ్బెంపు♦గుబ్బ లుబ్బె
సరసయౌవనమానస♦సరసిలోనఁ
పొడముబంగరునునుదమ్మి♦మొగ్గ లనఁగ. 65

తే. గీ. అరయఁ దనజోడుబయలాయె♦ననెడువంత
చిత్తముననాటనాఁటఁ♦జిక్కెఁగౌను
మానహానికి సైతురే ♦ మహిని దలఁప
బట్ట గట్టినబలుగుణ♦వంతు లెల్ల. 66

సీ. వెన్నునిముఖచంద్ర♦బింబంబు కళదేఱఁ
దరుణిలోచనకుము♦దంబు లలరె
శౌరికిఁ జికురాంధ♦కారము ల్పెరుఁగంగ
ముకురాస్యనఖరతా♦రకలు వెలసె
వనజాక్షువక్షఃక♦వాటంబు జిగి మీఱ
బిబ్బోకవతిచను♦గుబ్బ లుబ్బె
స్వామికి భుజకల్ప♦శాఖలు బలియంగ
నతనాభికిని బాహు♦లతిక లెనసె

తే. గీ. హరికి యౌవనవాసంత ♦ మతిశయిల్ల
నాతికిని బికకలకంఠ♦నాద మొదవె
భళిర యిటువంటి యీసతీ♦పతులజాతి
రీతు లమ్మయ్య యని రతి♦ప్రియుఁడు వొగడ. 67

1. గబ్బిగుబ్బ. [మూ.] 2. బాలగను గబ్బి. [మూ.]

ఆ. వె. చికిలిసానఁ దీర్చు • జీవరత్నమురీతిఁ
బరువ మైనకుసుమ • వల్లిపగిది
మెఱుఁగు చేసినట్టి • మేల్మిబొమ్మవితాన
రమణి దనరె జవ్వ • నమున నపుడు. 68

తే. గీ. శుభదినంబున సప్తమ • శుద్ధి గలిగి
చెలఁగువేళను గురుమాంపు • చీరతోడ
సరసరుచిరాన్నభోజనో • త్తరమునందు
నీ డెఱుంగనిచేడియ • యీడుమీఱె. 69

సీ. మనయశోదను జీరి • మనయిళ పుష్పించె
నని చెప్పి బహుమతు • లందరమ్మ
తెలియఁగా రోహిణీ • దేవిని రప్పించి
యాచిన్నెలో కావొ • యరయరమ్మ
చుట్టపక్కాలకు • శుభపత్రికలు వ్రాసి
పంప మామకు శ్రుత • పఱచరమ్మ
దినశుద్ధి లగ్నంబు • గని సాంగ్యములు దెల్ప
వేగ గర్గుని బిలి • పించరమ్మ
తే. గీ. కలికిలతకూన పుష్పిణి • గాఁ జెలంగె
నెవరు గన్నారు మాధవు • నెనసి నేమొ
మందు లీవలె సాంబ్రాణి • మధురమధువు
మంచిఖర్జూరములను దె • ప్పించరమ్మ 70

కం. అనువనితల గుసగుసలను
విని కనులను జలము లొలుకఁ • బెనుసిగ్గు[1]పడఁగ
వనజాక్షిని గని రాధిక
చినిచిన్నెలకన్నె నెన్ని • చేసెద రనుచున్. 71

సీ. అంటు గల్గినవారి • నంటుకో నియ్యమించి
పడఁతిని మగరాల • పలక నుంచి

1. గొనవ. [మూ.]

విప్రసువాసినీ♦వితతిచేఁ బాడించి
నసమేనఁ గుంకుమ♦నలుగు లుంచి
చలువఁగొజ్జఁగినీట ♦ జలకంబు లాడించి
తడి యొత్తి కురులార్చి ♦ జడ ఘటించి
పస మించు కెంబట్టు♦పావడ బిగియించి
రంగుచెంగావికో♦క [1]గదించి

తే. గీ. రవికె దొడిగించి సొమ్ము ల♦లంకరించి
జాజు లెనయించి కల్పముల్ ♦ సంఘటించి
యరుఁగుపై నుంచి పాలు పం♦డ్లలవరించి
కోరిల నిప్పించి చిమ్మిలి♦గొట్టఁ బంచి. 72

తే. గీ. భేరి మొదలగువాద్యము ♦ లొప్పఁ [2]రుకొనఁగ
వరుస నెనయించి చెలికాడఁ♦బ్రాలుగట్టి
కుంకుమరసంబు కస్తూరి ♦ కుసుమములును
బంధుమిత్రాప్తతతి కిచ్చి ♦ పంచి రాధ. 73

తే. గీ. చాన ని ట్లరపడకింటి ♦ లోని కనిచి
మొల్లపూఁబాన్పుపై నత్త♦మిల్ల నునిచి
దగ్గఱను నింబదళము బె♦త్తంబు నుసిచి
[3]యుగ్మలుల నందు జాగరం♦బుండఁ బనిచి. 74

తే. గీ. మాంత్రికులఁ బిల్చి యిలుచుట్టు ♦ మంత్రయంత్ర
తంత్రములఁగూర్చి నల్దెసల్ ♦తప్పిదారి
భూతముల నెందుఁ జొరనీక♦భూతిఁ జల్లి
కలికిఁ గాపాడెఁ గను రెప్ప♦గాచినటుల. 75

తే. గీ వేడ్కఁ గావించి మరునాఁడు ♦ పిట్టఁబెట్టి
కలశముల నెత్తి సీమసీ♦మలకుఁ దనియఁ
బంచి పంచమదినమునఁ♦బసపు నూనె
యందఱికిఁ బోసి చెలిని బెం♦డ్లరుఁగు నుంచి. 76

1 ధరించి [మూ.] 2. కలగ. [మూ.] 3. ముద్దియల. [మూ.] 4 బండ్లపైఁ బెట్టి సీమసీ♦మలును దనియ. [మూ.]

తే. గీ. తరుణు లప్పుడు సంపెంగ♦తైల మంటి
మించుఁబోఁడిని దాన మా♦డించి రెలమిఁ
దమ్మిగుమ్మితిదొరచేతి♦తలిరుటాకు
చికిలిబాకును దేజుమాల్ ♦ చేసినటుల. 77

సీ. పరిమళంబులు ముట్టి♦కురు లార్చి నొకభామ
చక్కఁగా జడ వేసె ♦ నొక్కలేమ
కస్తూరితిలకంబు ♦ ఘటియించె నొకజంత
బుక్కాము మైఁజిల్కె ♦ నొక్కకాంత
కెంబట్టుపావడ ♦ గీలించె నొకబోటి
యొగి రైక ముడి వెట్టె ♦ నొక్కజోటి
హాంగోక మొలఁగట్టె ♦ నొకమదావళయాన
యొదవించె మణిభూష ♦ లొక్కచాన

తే. గీ. తరుణి యొక్కతె నిల్వుట♦ద్దంబుఁ జూపె
[1]రమణియొక్కతె మేన గం♦దము నలందెఁ
[2]బడఁతి యొక్కతె యగురుధూ♦పంబు వైచెఁ
జేడియకు నిట్లు రాధ కై♦సేయువేళ. 78

తే. గీ. తెఱవ యీరీతి నిండుము♦స్తీబుతోడ
నుల్లసిల్లెను మల్లెపూఁ♦జల్లు లలర
నవ్వగలచివ్వలకుఁ గాలు♦ద్రవ్వుకొనుచు
మరునిపడివాగ్పై గోవ ♦ మట్ట మనఁగ. 79

కం. అంతటఁ గాంత లిళాసతి
వింతఁగఁ గై సేసి తెచ్చి ♦ వెల గలమగరా
సంతనల మంతు కెక్కిన
దంతపుపనిచవికెలోన ♦ దయ దనివారన్. 80

1. సకియ యొక్కతె యరవిరి♦సరులు దునిమె. [మూ.]
2. ముదిత యొక్కతె పేఁటిమి♦ముసు గోసంగె. [మూ.]

తే. గీ. మేల్మిపచ్చలగద్దియ ♦ మీఁద నుంచి
చేరి యనసూయ మొదలగు ♦ పేరఁటాండ్రు
మన యిళామాధవులకు శో ♦ భన మటంచుఁ
జల్లఁగాఁ బాడి సుంకులు ♦ చల్లి రపుడు. 81

సీ. చెక్కుటద్దములపైఁ ♦ జెమటబిందువు లూరఁ
గస్తూరితిలకంబు ♦ కరఁగి జాఱ
కరకంకణంబులు ♦ ఘల్లుఘ ల్లని మ్రోయ
నలువంకఁ జూపువె ♦ న్నెలలు గాయ
స్తనభార మోర్వక ♦ తనుమధ్య మసియాడ
నింపుమోహంబుతో ♦ నీవి వీడ
గబ్బిసిబ్బెపుటుబ్బు ♦ గుబ్బచన్గవ పొంగ
బాహుమూలోజ్జ్వల ♦ ప్రభ లెసంగ
తే. గీ. గటితలంబునఁ గీల్జడ ♦ నటన మాడ
[1]గగనమున కేగునిట్టూర్పు ♦ గాడ్పుతోడఁ
దాళగతు లొప్ప సంపెంగ ♦ తైల మంటెఁ
దమక మెదనాటి హరికి రా ♦ ధావధూటి. 82

తే. గీ. చెలులచే యూనుకొని లేచి ♦ కలికి యిడిన
పాదుకలు మెట్టి రాజస ♦ ప్రౌఢి నేగి
మేటిమగరాలముక్కాలి ♦ పీటమీఁద
శౌరి కూర్చుండె మజ్జన ♦ సదనమునను. 83

కం. లికుచకుచ శౌరి కస్తురి
లికుచరసం బిడియె నఖర ♦ రేఖలచే నొ
క్కొకటిగఁ జిక్కెడలింపుచుఁ
బ్రకటితఘననీల కేశ ♦ పాశంబందున్. 84

కం. కుంకుమ నలుగిడె నొకచెలి
పంకజదళనేత్రిమేన ♦ భావములోనన్

1. ఘనతరం బైన. [మూ.]

డెం కగుననురాగరసం
బింకఁగ వెలిఁ దీసి విభున ♦ కిప్పించె ననన్. 85

కం. గంధామలకము వెట్టెను
గంధేభసమానయాన ♦ గనుకనిఁ గరముం
గంధతను లంది యియ్యఁగ
గంధవతీధవున కపుడు ♦ గరిమ దలిర్పన్. 86

తే. గీ. పసిఁడిగిండులచే ముంచి ♦ పడఁతు లియ్య
జలక మార్చెను జెలువ గో ♦ జ్జంగినీట
రమణునకు రాధ మదనసా ♦ మ్రాజ్యమునకుఁ
జెలగి పట్టాభిషేకంబుఁ ♦ జేసె ననఁగ. 87

సీ. కురు లార్చె నొకలేమ ♦ సురటి నొక్కతె వీవ
పరిమళాగురులధూ ♦ పములనొసఁగి
సిగ వైచె నొకభామ ♦ నిగరాలతాయెతు
లీలించి జంటరు ♦ మాలు గట్టె
విరు లుంచె నొకరామ ♦ విదళించి పన్నీటఁ
బద నిచ్చె గోవజ ♦ వ్వాజిఁ జమిరి
పట మిచ్చె నొకచాన ♦ యటు విప్పి నలుగంగ
నీక తావులు గట్టె ♦ నెగయఁ బట్టె
తే. గీ. తిలకవతిమోర్తు కస్తూరి ♦ తిలక మునిచె
గంధగజయాన యొక్కతె ♦ గంధ మలఁదెఁ
దడవుగా నోర్తురత్నాల ♦ తొడవు లిడియె
శౌరికిని జాల నయ్యలం ♦ కారవేళ. 88

కం. ఎనిమిదిదిక్కులరాజుల
ఘనకీర్తులు వచ్చి యతనిఁ ♦ గవిసె ననంగా
నునుముత్తెపుఁజొకట్టులు
వినుతాంగి యిడంగ శౌరి ♦ వీనుల మెఱసెన్. 89

తే. గీ. కళలు పదియాఱు నేఁ గంటి ♦ ఘనునిమోము
గనియె నరువదినాలుగు♦కళ లటంచుఁ
[1]గలఁగి కమలారి హరిపదా♦క్రాంతుఁ డయ్యె
ననఁగ మగరాలపెండియం ♦ బునిచె నొకతె. 90

కం. మగువ యిడ హరియురంబునఁ
దగిరోఁ జిగిచిలుకతాళి ♦ ధర నాతనిబల్
సొగసు గని చిత్తజన్ముఁడు
దెగి పాఱఁగఁ బట్టు వడిన♦తేజి యనంగన్. 91

కం. మగరాలపతక మొకచెలి
దగిలింపఁగ శౌరియెదను ♦ దగె నాలోనఁ
[2]వగ నీనుతొగలరాయఁడు
సొగ సగుతల్లిలఁ దొంగి ♦ చూచె ననంగన్. 92

తే. గీ. కూర్మి నిఁక ని ట్లిళాదేవి♦గోరు లుంచు
ననెడువగ గోళ్ళకుతికంటు♦నునిచె నొకతె
యందులకు రాధ కెంపుల♦నందగించు
నిట్టు లనఁ గౌస్తుభము శౌరి♦కిడియె నొకతె. 93

తే. గీ. రమణి గీలించుతారహా♦రము మురారి
యురమున వెలింగె నెదలోన ♦ మెఱయుచున్న
తనవరుని బంపి మఱి యిళా♦తరుణి నెనయు
మనుచుఁ దారక లటువలెఁ ♦ గొనె ననంగ. 94

తే. గీ. చాన గీలించునీలకం♦జాతసరము
మెఱసెఁ జిన్నికృష్ణునివిప్పు♦టురమునందు
మారు లేనితన్మోహనా♦కారమునకుఁ
జంచలాక్షులు దృష్టి తాఁ♦కించి రనఁగ. 95

తే. గీ. పడఁతి గట్టినకాంచనాం♦బరము దనరె
నంబుజాక్షునిస్వచ్ఛదే♦హంబుమీఁద

1. యిళికి [మూ.] 2. దగ నీతోఁగలిసెద నని. [మూ].

సతనియెద నిండి తగునాద ♦ యారసంబు
పైని దాని ట్టులను గాన ♦ వచ్చె ననఁగ. 96

కం. తొగమగనిబావ నిట్టుల
వగగాఁ గై సేసి తెచ్చి ♦ పనిహర్వ్యలహా
న్మగరాలచవికెలోపలఁ
దగుపచ్చలపీట నునిచి ♦ తరుణులు వేడ్కన్. 97

తే. గీ. చని యిళాదేవిఁ గని లగ్న ♦ సమయమాయె
రమ్ము మాయమ్మ యని క్రమ్మి ♦ కొమ్మలెల్ల
బలిమిఁ గొని పిల్వ రాధిక ♦ భయముచేతఁ
దగ్గి దిగ్గున లేచి నుఱ్ఱ ♦ సిగ్గు మాని. 98

చ. వలపులచంద్రకావిజిగి ♦ పావడరంగు లెసంగఁ బైఁ శిణీ
జిలిబిలిచీరకుచ్చెళులు ♦ చిందులు ద్రొక్కఁగ జంటిరైకలో
పలిచనుగుబ్బ లుబ్బఁగను ♦ బంగరుటందెలుఘల్లుఘ ల్లనన్
జలజదళాక్షి వచ్చె రభ ♦ సంబున నయ్యదురాజునొద్దకున్. 99

తే. గీ. అపుడు సుముహూర్త మనుచు గ ♦ ర్గాదిమునులు
శోభనముఁ జేసి రానిత్య ♦ శోభనులకు
వాద్యములు మ్రోయ నిఖిలది ♦ క్పతులు పొగడ
నాప్తబంధుసుహృత్కోటి ♦ తృప్తిఁ బొంద. 100

కం. అవ్వేళను హరియు నిళా
యావ్రతరత్నంబు బాంధ ♦ వావలితోడన్
బువ్వము దిని రారుచులకు
నువ్విళ్ళూరుచును మెప్పు ♦ లొసఁగుచు నంతన్. 101

కం. నందుం డందఱిఁ బరమా
నందంబును నొందఁ జేసె ♦ సద్యోమర్యా
దం దగుసూనృతభాషా
సందోహముచేఁ బటాది ♦ సత్కారములన్. 102

తే. గీ, అంత సంతోషసంభరి ♦ తాంతరంగు
డగుచుఁ దాంబూలఫలదాన ♦ మాచరించి
యతివయును దాను శ్రీరాన్న ♦ మారగించి
యువతి యిడురత్నపాదుకా ♦ యుగళి తొడిగి. 103

చ. చలువ లెసంగుచప్పరపు ♦ జంత్రపుబొమ్మలు పావురంబులుఁ
గిలకలమంచము న్విరులు ♦ నించినసెజ్జయుఁ గీచుబుజ్జియుఁ
దలగడదిండ్లు దోమతెర ♦ తళ్కునడోలిక నిల్వుటద్దముల్
గలపడకింటి కేగి యటఁ ♦ గంజవిలోచనుఁ డుండె నత్తఱిన్. 104

సీ. వలిపెచెంగావిపా ♦ వడకొసల్ బిగియించి
కుంకుమపువ్వంచు ♦ కోక గట్టి
కలపంబు నెమ్మేనఁ ♦ గలయంగ మేదించి
హవణిల్లుముత్యాల ♦ రవికె దొడిగి
గేదంగిరేకుల ♦ గీల్ జడ ఘటియించి
చంద్రసూర్యాదిభూ ♦ షణము లుంచి
పొలుపుసంచపురేకు ♦ బుక్కాము మైఁ జల్లి
కస్తూరితిలకంబు ♦ సిస్తుపఱచి
తే. గీ. గోవజవ్వాజి మెడను గీ ♦ ల్కొల్పి జఘన
మునకు నగురుసాంబ్రాణికొం ♦ బొగలు పట్టి
కనులఁ గాటుకరేకలు ♦ కదియఁ దీర్చి
రాధికామణి యిళకు న ♦ లంకరించి. 105

కం. నిద్దపుటద్దముఁ జూపిన
ముద్దియ తగె నద్దిమధ్య ♦ మున బింబిత మై
ముద్దులు గులికెడుకలుముల
ముద్దులగుమ్మయున భువన ♦ మోహిని యగుచున్. 106

సీ. ఎటు తాళ నున్నదో ♦ యీకొమ్మ కెమ్మోవి
కైటభారాతిప ♦ ల్గాటులకును

ఎటు లోర్వ నున్నవో ♦ యీ కన్నెచన్నులు
గోపసింహుని గోటి♦గుమ్ములకును
ఎటు లాన నున్నవో ♦ యీతన్వి లేఁదొడల్
చాణూరహరుమారు♦సాదనలకు
ఎటు లాగ నున్నదో ♦ యీనాతితనుమేను
దంతిమర్దనుకౌఁగి♦లింతలకును

తే. గీ. నంచుఁ దను గేలి యొనరించు♦మించుఁబోండ్లఁ
గాంచి తలవంచి సిగ్గుచేఁ♦గలఁకఁబాఱు
వారిజాననవీనుల♦వద్దఁ జేరి
బుద్ధిగా నిట్టు లను రాధ ♦ బుజ్జగించి. 107

సీ. చెలువుండు కౌఁగిటఁ ♦ జేర్చినయపు డీవు
గుబ్బల మెలమెల్లఁ ♦ గ్రుమ్మవమ్మ
విభుఁడు చెక్కిలి ముద్దు♦ వెట్టినయపు డీవు
నలరుమో వొక్కింత ♦ యానవమ్మ
సామి పైకొని రతి ♦ సల్పినయపు డీవు
నించుక యెదురొత్తు ♦ లియ్యవమ్మ
ప్రాణేశుఁ డలకేళి ♦ బడలినయపు డీవు
పురుషాయితము వేగఁ ♦ బూనవమ్మ

తే. గీ. అతఁడు నవరసరసికశి♦ఖావతంసుఁ
డధికసుకుమారమూర్తి పే ♦ వతని నెటుల
వలచి వలపించుకొనియెదో ♦ పలికినాను
నాన గొనఁబోకు నామీఁది♦యాన నీకు. 108

కం. అని మనసిజుగమనమ్ములు
విను మని యుపదేశ మిచ్చి ♦ నే లెమ్మదిగో
యెనసెను శుభలగ్నము ప్రియు
నెనయఁగ వలె వేళ తప్పు♦నియ్యక యనుచున్. 109

కం. మత్తగంధసింధురంబును
గరముం గదలించి తెచ్చు ♦ కరణిని దెఱవన్
వరుకడకు బలిమిజాలుములు
మెఱయఁగఁ గొని తెచ్చి పలికె ♦ మెల్లన హరితోన్.

సీ. పదపద్మముల నొప్పు ♦ బంగారుగొలుసులు
మేలు గుల్కెడునిగ ♦ ళాలు గాఁగఁ
గటితటి నటియించు ♦ గంటలమొలనూలు
పాలాదిగంటల ♦ చాలు గాఁగ
నల్లచీమలబారు ♦ నా మూరునూఁగారు
మేర మీఱినమద ♦ ధార గాఁగ
గబ్బిసిబ్బెపుటుబ్బు ♦ గుబ్బగుబ్బలు లెంతొ
మంతుగన్ వింతకు ♦ మ్భములు గాఁగ
తే. గీ. గందవడిలోనదుమ్మాడి ♦ మందగతుల
వచ్చె నెరితావి కళులచా ♦ ల్వాల గొనంగఁ
జిన్నిమరుదంతి నిన్నొక ♦ సన్నఁ జూడ
సరస నెక్కెడు మీఁదిపై ♦ సరము లేగ. 111

సీ. ఈగోటిమీటుల ♦ కీకుచగిరులట్లు
పొంగి తాళవు దీని ♦ మొగ్గచన్ను
లీపంటిగంటుల ♦ కీమోవిపగడంబు
వగను దాళదు దీని ♦ చిగురుఁబెదవి
ఈమారుసాధన ♦ కీయూరుకాండంబు
లటులతాళవు దీని ♦ యనఁటితొడలు
ఈకౌఁగిలింతల ♦ కీతనుకనకంబు
వలెను దాళదు దీని ♦ మొలకమేను

తే. గీ. నీకు సరి యగునటు లెల్ల ♦ నేను గాను
పొల మెఱుంగని దిది వట్టి ♦ ముగ్ధ గాని

తెలిసి యెటు లేలెదో నీకుఁ ♦ దెలుప వలెనె
దేవ దక్షిణనాయకా♦ధిపుఁడ వీవు. 112

సీ. కొనగోళ్లఁ గొని మోవి♦చెనకి చూతువు గాని
యదరంటఁగా నొక్కి♦యానఁబోకు
ముద్దుచెక్కులఁ జిన్ని♦ముద్దు లుంతువు గాని
జిగిగోటికత్తులఁ ♦ జీరఁ బోకు
మొనవేళ్ళఁ జనుమొనల్ ♦ పుణుకు దింతియ కాని
వగవగ బిగిపట్టు♦పట్టఁ బోకు
రతికేళి మెల్ల మె♦ల్లన సల్పుదువు గాని
దురుసుపై సరములు ♦ నెరపఁ బోకు
తే. గీ. వెట్టి నై తెల్పెదను గాని ♦ వెలఁది నీవు
వలపులను మించి గడిదేరి ♦ వద్దఁ జేరి
మారుసాములఁ జలపోరి ♦ పోరువేళ
నాదుగురికట్లు నిలుచునా ♦ నలిననయన. 113

తే. గీ. అంచు హరిచేతి కిళ నొప్ప♦గించి రాధ
వత్తు నేఁ గూడ నని చెలి ♦ పైఁటఁ బట్ట
వేగ వచ్చెద నని విడి♦పించుకొనుచుఁ
జనియె మది ఖేదమోదముల్ ♦ పెనగొనంగ. 114

వ. ఇట్లమ్మందయాన యమందయానంబునఁ బఋకయిలు వెల్వడి రత్నముద్రికాలంకృతం బైనకెంగేల నొక్కబాలికామణిం జెయ్యానుకొని యవ్వాసుదేవు నెడఁబాసిపోవం జాలనిచిత్తంబుతోన తత్తరపడి యమ్మత్త కాశినులం గని తలు పోర సేయుండనునెపమున తిరిగి తిరిగి చూచుచు గాజసం బవలంబించి యెవ్వరితోడం బలుకక డగ్గుత్తియ నడంపుచుఁ గేళి పూగుత్తు లాఘ్రాణించుపోలిక బిట్టునిట్టూర్పులు నిగుడింపుచుఁ జెందొగల విందుఁ గనుచందంబున వదనారవిందం బెత్తి కందోయిం గ్రందుకొనుబాష్ప బిందుబృందంబులఁ జిప్పిలనీక రెప్పల నార్చుచు హరివిరహభరంబునం దాఁకి

జారినకరకంకణంబులం గని చేయెత్తి కప్పుకొప్పు దిద్దుకొనుచొప్పునఁ గప్పుచుఁ గుచలికుచంబులం దగదగ మని తగులుకొనుచిగురువిలుగలతులువసెగలఁ దగిలి చిటిలి పెటిలి పడుతారహారంబులం బయలుపడనీక పయ్యెదచెఱంగున మఱుంగు సేయుచు నిజమందిరంబుఁ బ్రవేశించి యం దొక్కచో కాటంపుసులుపుపట్టుమేలుకట్టులం గనుపట్టుకట్టాణిముత్తియంపుజల్లులతో నల్లిబిల్లిగా నల్లుకొనుబొండుమల్లియలపూదండలం దగిలి రొదలు సేయుతుమ్మెదలగరులనిగనిగలకుం బదు లసఁగఁ దగిలి మగరాలసోరనగండ్లనుండి వెలికి నిగుడునగురుసాంబ్రాణిపొగల మగుడం ద్రోయుచుఁ డెరగంటిమచ్చకంటులనెరినెరుల వరలువిరులచేరులనెత్తావుల నత్తమిల్లి మత్తిల్లి వచ్చుకమ్మతెమ్మెరలవగ మిగులుమగరాలసౌధంబున నెంతయు వింతవింతపనిసంతనలమంతు కెక్కుజీవదంతపుఁజప్పరకోళ్ళమంచంబుపై రవిబింబంబుడంబు విడంబించుకెంబట్టుపరుపునరాజినశిఖారేఖల సెకమీఱుసూరెపుటంబుతలగడఁజేరి యొక్కపల్లవపాణి పదపద్మంబులు పట్టుచుండఁ బవ్వళించి యాత్మగతంబున.

ఆ. వె. సొమ్ము లియ్య వచ్చు ♦ సొమ్మంద మియ వచ్చు
నియ్యరానిప్రాణ ♦ మియ్య వచ్చుఁ
దనదువిభుని వేరు ♦ తరుణిచేతికి నిచ్చి
తాళ వశమె యెట్టి ♦ దానికైన. 116

సీ. నాతి యింతకు మున్నె ♦ నాసామిమధురాధ
రామృతమ్మును జూఱ ♦ లాడ కున్నె
యతివ యింతకు మున్నె ♦ హరివిప్పుటురముపై
గుబ్బలకసి దీఱఁ ♦ గ్రుమ్మ కున్నె
రమణి యింతకు మున్నె ♦ రమణుకౌఁగిటఁ జేరి
పారావతధ్వనుల్ ♦ పలుక కున్నె
చాన యింతకు మున్నె ♦ శౌరి పైకొన వెను
దియ్యక యెదురొత్తె ♦ లియ్య కున్నె
తే. గీ. మున్నె యది జాణ సిగ్గుచే ♦ నున్నఁ గాని
విభుఁడు వగఁ జేసి తనుబ్రీడ ♦ వీడఁజేసి

చేరఁగాఁ దీసి యందందుఁ ♦ జేయివేసి
కొమ్మ నిటమున్న తా దిద్దు♦కొనక యున్నె. 117

కం. అని చింతింపుచు నచ్చటఁ
గనువిలుతునిబారి కలికి ♦ కను మూయక లో
వనరుచు నుండెను రాధిక
వనరుహదళనయనుఁ డచట ♦ వనితామణితోన్. 118

కం. చెలియా వింటివె రాధా
జలజేక్షణమాట లెల్లఁ ♦ జక్కఁగ ననినన్
గలకంఠీమణి సిగ్గునఁ
దల వంచుకొనంగఁ జూచి ♦ దయ దై వారన్. 119

సీ. చిన్ననాఁటనె చెల్మిఁ ♦ జేసితి మెడ లేక
మన కేటిసిగ్గులే ♦ మధురవాణి
నేఁ బల్కఁగా లేదె ♦ నినుఁ జూచి ననుఁజూచి
యీవేళ మాటాడ ♦ విందువదన
కూడి యున్నా ళ్ళాట♦లాడమో యెటుపోయె
దాయాట లీయాట ♦ లంబుజాక్షి
పోనిపోనీ నేను ♦ బూరుగూరివాఁడనా
నీకు మేనరికంబు ♦ నీలవేణి

తే. గీ. యళుకు లేటికె ననుఁ జూచి♦కులుకులాడి
మోముఁ జూడవె మో మెత్తి♦మోహనాంగి
ముద్దుగా ముద్దు లియ్యవె ♦ ముద్దుగుమ్మ
మాటు కేగకె నాయాన ♦ మందయాన. 120

కం. మనరాధ దెలిపె నేటికి
ననువుగ నాల్మగనియాట ♦ లాడక యున్నన్
మనసిజభూతము వెలుపుం
గనిపించు నటంచు వేగఁ ♦ గదియుద మబలా. 121

కం. చన దిటు లూరక యుండఁగఁ
గనువినుదయ్యంబు గదుమఁ♦గా వచ్చినయా
వెనుక నెటు దాగువారము
మనసిగ్గులు దాని నెదిరి ♦ మార్కొన వనుచున్. 122

చ. గమగమతావులం గులుకు♦కప్పురబాగము లిచ్చి వేడ్కతో
సమముగఁ గ్రొత్తముత్తియపు♦సన్నపుసున్నముఁ బెట్టి చొక్కపుం
దమలపుటాకుఁ జుట్టి వని♦తామణిచేతి కొసంగఁ బోవుచోఁ
గొమిరె నయంబుతోఁ గొనిన ♦ గోపకులాభరణుండు ప్రేమతోన్. 123

సీ. ఉసికొల్పి వంచించి ♦ దుసుకులచనుదోయి
చేనంట నమ్మ నొ♦చ్చినె యనును
మొనసి యేమరఁ జేసి ♦ మోవాన గమకింప
వడి నుల్కి కరపల్ల♦వములఁ గప్పు
నల్లందులకుఁ జొచ్చి ♦ యటు నీవి వదలింప
మిట్టిమీనై [1]బెట్టు ♦ కొట్టుకాఁను
విభుఁ డందుఁ జెనకె తా ♦ వికవికనవ్వుచో
నటు గిరుక్కన మళ్ళి ♦ యలుక నించు
తే. గీ. తను గురించినఁ గని తన♦కనులు మూయుఁ
గవకవల్ నించుచో వ్రేళ్ళ ♦ చెవులఁ జొనుపు
కొను నిళామానినియు ముగ్ధ♦తనముఁ బూని
రాజగోపాలసంగమా♦రంభ వేళ. 124

వ. అంత. 125

ఉ. ముద్దులబెట్టు కొంత జిగి♦మోముగదింపుల వింత మోహపుఁ
సుద్దులచే రవంత తెలి♦చూపుల నంత విరాళిచేతలం
బద్దుల సుంత పావురపు♦పల్కులు పల్కి కలంతసిగ్గు పో
దిద్దు మురారి నారి నటు ♦ తెప్పునఁ బైకొని మోవి యానుచున్ 126

1. యట్టై [మూ.]

మ. అలరు ల్వాడ రుమాల వీడ నెదపై ♦ హారాళు లల్లాడఁ ద
ళ్కులచౌక ట్లసియాడఁ బావురపుఁబ♦ల్కుల్ పల్కుచున్ గుల్కుచున్
బలుజోకొట్టుచు మబ్బుదట్టుచును బై♦పై నిక్కుచున్ సొక్కుచున్
గళ లెల్ల న్గరఁగించి [1]యేలె సొగయం ♦ గంజాస్త్రికయ్యంబునన్. 127

చ. గొనకొనుసిగ్గు మోహమును ♦ గూడఁగ నొక్కటి కొక్క టెక్కుడై
పెనఁగొను కేలు మోముపయిఁ ♦ బెట్టుక మెల్లన వ్రేళ్ళసందులన్
గనుఁగవ రెప్ప లార్పక యెం♦గాదిగఁ గన్గొనె శౌరివక్త్రమున్
మనసిజకేళికై పుణికి ♦ మానక మానిని యప్పు డెంతయున్. 128

చ. ఉలుకును గొట్టుకాడు నగు ♦ నూర్పు లడంపుచు నూర కుంచు లోఁ
గలఁగును బల్కఁబోవుఁ దట♦కాపడుఁ గన్గొనుఁ గన్మొగుడ్చు మైఁ
బులకలు దార్చు గ్రుక్కు లిడు ♦ బొమ్మలమై మరచున్ సుఖోన్నతిం
దలకొని పారవశ్యమునఁ ♦ దామరసాక్షి య దేమి చెప్పుదున్. 129

సీ. మో మొకించుక యెత్తి ♦ మోవి యానఁగ నొత్తి
యది యిది చాలించి ♦ యట్టె యుండుఁ
కౌఁగిలింపఁగఁ జూచి ♦ కరపద్మములఁజాచి
యందు కిందుకుఁ బోక ♦ యట్టె యుండుఁ
జనులఁ గ్రుమ్మఁగఁ గోరి ♦ సరస మెల్లనఁజేరి
యవల కీవల కేగ ♦ కట్టె యుండుఁ
బౌరుషరతి కెచ్చి ♦ పైకొన గమకించి
యటు నిటులను జేయ ♦ కట్టె యుండు.
తే. గీ. ముద్దు లిడ వచ్చి యందందుఁ ♦ బ్రొద్దు పుచ్చుఁ
బలుకఁగా మీఱు నెలు గెత్తి ♦ కలఁకఁబాఱు
విడె మొసఁగఁ బోవు సగమాకు ♦ మడిచి మానుఁ
దీరి తీరనిసిగ్గునఁ ♦ దెఱవ యపుడు. 130

వ. ఇట్లనేకవిధంబుల నిశామాధవులు భంగరానంగసంగరక్రీడా
పరవశు లై యున్న యెడ. 13

1. యేలుకొనియెం. [మూ.]

చ. భువిఁ బధికాళి యాత్రలకుఁ ♦ బోవఁగ నైష్ఠికవిప్రసంఘముల్
జవమున లేచి తానములు ♦ సల్ప రతాంతగసుప్తదంపతుల్
గవిసి రమింప వేళ యిది ♦ గాదె యటంచుఁ ద్రిభంగుల న్నెరా
హావణికె నుగ్గడించెఁ జర♦ణాయుధబోధకయూధ ముద్ధతిన్. 132

ఉ. అంతట దిగ్గునన్ బరుపు ♦ నంటక లేచి పయంట దిద్దుచున్
వంతను గొంత దాచి బల♦వంతపుహాయి రవంత పూని చె
ల్మింతులు చెంతలం బిలువ ♦ కేగిన దేమొ యటంచు నల్క రాఁ
గంతునితండ్రిని న్గదియఁ♦గాఁ జని రాధిక తల్పుతట్టినన్. 133

తే గీ. [1]చేరి యందాఁక వారు చౌ♦శీతిబంధ
[2]గతులఁ బెనఁగి చాలక పునా♦రతులఁగలసి
బడలికలు దీఱ నొక్కింత ♦ పవ్వళించి
మదవతీకృష్ణు లప్పుడు ♦ నిదురలేచి. 134

సీ. మిసిమిచెక్కులఁ దమ్మ♦రసము నాథుఁడు పెంపఁ
బికవాణిమోవి కా♦టుకను బెంపఁ
జెదరిన ముంగురుల్ ♦ శ్రీనివాసుఁడు దిద్దఁ
గొంత జారినతిల♦కంబు దిద్ద
నలగోరువంకల ♦ నతఁడు కుంకుమ నించ
గలికి పల్గంటికిఁ ♦ గప్పుర ముంచఁ
గప్పుపెన్నెరికొప్పు ♦ కాంతుఁ డల్లనఁ బాపఁ
జెలియ హారావళుల్ ♦ చిక్కుఁ బాపఁ

తే. గీ. జుట్టి సగమూకు నోటికి ♦ సుదతి యొసఁగ
మఱలిమురవైరి కొఱికిన♦మడుపులొసఁగ
నట్టియెడ రాధకరకంక♦ణాళి ఘల్లు
రనఁగ విని నుల్లములు ఝల్లు ♦ మనఁగ నులికి. 135

1. చేరి యందాఁకఁ బెనఁగు చౌ♦శీతిబంధ. [మూ].

2. రతులుచాలక మఱి పునా♦రతులఁగలసి. [మూ.]

తే. గీ. కలికి వే లేచి గడె దీసి ♦ తలుపు దెఱవ
శౌరి రమ్మన రాధిక ♦ చేరఁ బోవు
నంతకును మున్నె హరిచెవి♦చెంతఁ జేరి
చెలువు చిలుకఁగ నసె నాతి♦చేతిచిలుక. 136

సీ. నాతికిఁగ్రొప్పున ♦ నల్లకల్వలు గావు
విరవాదిశరము లో♦సరసిజాక్ష
నెలఁతనాసికయందు ♦ నీలంపుమణి గాదు
ముక్కరముత్యంబు ♦ మురవిఘాల
వనితపాలిండ్లపై ♦ వలచుకస్తురి గాదు
మలయజపంకంబు ♦ మదనజనక
తరుణినెమ్మేనఁ గ♦దంబపుప్పొడి గాదు
వెలిదమ్మిపుప్పొడి ♦ విమలచరిత
తే. గీ. మరునిశరవహ్ని దరికొని ♦ మదిని బొదలి
వెలికి విసరంగ దాని లో♦పల నడంచి
యిదిగొ వచ్చెను బరితాప ♦ మడఁప ఘనుఁడ
వీ వటంచును రాధ యి♦డెంతధీర. 137

చ. జలరుహపత్రనేత్ర విను ♦ చందనగంధివిరాళి యెంతొ మై
నిలఁ గలసొమ్ము లంగజుని♦యింగలమందుఁ గరంగి పూదెలై
మిలమిల డొల్లి రాఁ జెలులు ♦ మిణ్గురుబూచు లటంచుఁ బట్టి చే
తులు సెగ లంటి పొక్క వెత♦తో విదలింతురు మిట్టమీఁను లై. 138

తే. గీ. లేమకును నీవు పొత్తున ♦ లేనియట్టి
వాసరము లెల్ల శ్రీహరి♦వాసరములు
మానినికి నీవు ప్రక్కను ♦ లేనియట్టి
రాతి రెల్లను మఱి శివ♦రాత్రి యరయ. 139

కం. కన లేదో విన లేదో
కనులార స్వీనులారఁ ♦ గాంతులు కాంతల్

ఘనవిరహాగ్నిని స్రుక్కఁగఁ
గన విన లే దిట్టివలపు ♦ కంజదళాక్షా. 140

కం. అనిపలుకు చిలుకపలుకులు
విను వనజదళాక్షుఁ జేరి ♦ వేడ్కను రాధా
ఘనవేణి యిళను జూపుచుఁ
దనదగుప్రేమాతిశయము ♦ దనరఁగ నగుచున్. 141

సీ. చిగురాకుజిగి నూకు♦చెలియకెమ్మోవికా
గజిబిజిమొనపంటి♦గంటు లెల్ల
ననచెండులను జెండు♦నాతిలేఁజనులకా
కలికిగోటిపిరంగి♦నలుకు లెల్ల
నునునాచులను నేచు♦వనితపెన్నెరులకా
కక్కసం బగుపెక్కు♦చిక్కు లెల్ల
మరువంపుగురి దింపు♦మగువనెమ్మేనికా
విడువనిమరుసాము♦బడలి కెల్ల

తే. గీ. నకట మగలకుఁ దమయక్క ♦ రైనఁజాలు
నబలలా గెంచి లాలించ ♦ రనుచు నిళకు
వగచుగతి రాధ తనలోని♦వంతఁ దెలియఁ
జేసె శౌరికి నన్యాప♦దేశముగను. 142

చ. అది విని శౌరి రాధకర ♦ మల్లనఁ బట్టి బిరాన చేసరాల్
గుదురుగఁ గంకణంబులును ♦ గూడఁగ ఘల్లుమటంచు మ్రోయఁగాఁ
గదియఁగఁ దీసిన న్గలికి ♦ కాంతునిపేరెద వ్రాలె నంతలో
గుదిగొనుసిగ్గుచే నిళయు ♦ గొబ్బునఁ జాటున కేగె నవ్వుచున్. 143

తే. గీ. మాయురే బొబ్బ హాయిరే ♦ మజ్ఝ భళిరె
కలిసి విరిశయ్య మత్తేభ♦ములవితాన
నీడు లే దని వలపుల♦జోడు పొగడ
నపుడు వారిద్ద రాకయ్య ♦ మందుకొనిరి. 144

వ. ఇట్లు విడఁబడి. 145

సీ. కొసరుపల్కులఁ గ్రమ్మి ♦ గోటికత్తులఁ జిమ్మి
కాసెలోఁ జెయి వేసి ♦ కదియఁదీసి
కన్నాత లాలించి ♦ కౌఁగిటఁ గదియించి
సరిబిత్తలల నెత్తి ♦ చనులనొత్తి
యల్లందులకుఁ జొచ్చి ♦ కల్లమ్ములకు వచ్చి
మెఱుఁగుచెక్కిలి గొట్టి ♦ కురులు పట్టి
తొడకంబముల నాని ♦ తోపునాకుల నూని
సందుచేసుక నొక్కి ♦ ముందు కెక్కి

తే. గీ. యదలుపులు [1]కీలుగొట్లు నెయ్యంపుతిట్లు
గళరవంబులు దుడుకులు ♦ చెలఁగ రాధ
మాధవుండును గడిదేరి ♦ మారుసాము
హాయిగాఁ జేసి సరిగెల్వ ♦ లంది రపుడు. 146

వ. అంత రాధాకృష్ణులు పరస్పరము సంభాషించి రది యెట్లనిన.

సీ. మగడ యాపని దీఱె ♦ మఱియొక యాటాడి
నాకును గట్టిగా ♦ న్యాయ మొసఁగి
పొలఁతి నీపెందొడ♦పుణ్యంబు నా కందె
లేఁతచిన్నది పట్టి♦రోఁత నాకు
నీకు దానికి నింత♦నేస్తమాయెను గృష్ణ
పొంతగా నినుఁ గూడి ♦ యింత బాగ
చెలియ నిమ్మళముగఁ ♦ జేసితివో లేక
యది చేసెనో నన్ను ♦ నడుగ వలదు

తే. గీ. బాగుబా గన గట్టిగాఁ ♦ బని యొసంగ
నియ్యరా కృష్ణ నాకును ♦ నిమ్ముగాను
శివి వయసున గుణమున ♦ నీవె పెద్ద
రయము రయమునఁ గావింపు ♦ రతిని రాధ. 148

1. పొగడికలు. [మూ.]

సీ. అధరామృతంబు నీ ♦ వానితివో కృష్ణ
యది లేఁజిగురువగ ♦ రంతె రాధ
కఠినస్తనము లెదఁ ♦ గలఁచితివో కృష్ణ
యవి లేఁతలికుచంబు ♦ లంతె రాధ
లలితోరు లూరుల ♦ మెలఁచితివో కృష్ణ
యవియనంటులత్వక్కు ♦ లంతె రాధ
లీలాంగములు కౌఁగి♦లించితివో కృష్ణ
యవి ననలతకూన ♦ లంతె రాధ

తే. గీ. చతురసమరతిసుఖ మొన♦ర్చితివొ కృష్ణ
నవసమాగమమున సౌఖ్య ♦ మవునె రాధ
యుపరతుల నిన్నుఁ గూడెనే♦మోయి కృష్ణ
యాచమత్కృతి ముగ్ధ కె♦ట్లబ్బు రాధ. 149

వ. ఆసమయమునందు. 150

సీ. కాలివాల్పిట్టల ♦ కలకలంబులు మీఱెఁ
బగడకన్గలయొజ్జ ♦ బయలుదేఱె
నెలరాజు పశ్చిమా♦చలరాజముం జేరె
బలుచంద్రకాంతపు ♦ శిలలు పేరెఁ
దారకాగణముల♦తళుకు తెల్లడ జాఱె
దీపంబు లెల్లను ♦ తెల్లఁబాఱె
నతనుఁడు రేయెల్ల ♦ ననిఁ జేసి వేసారె
ధర వియోగులపరి♦తాప మాఱెఁ

తే. గీ. దమ్ము లలరారెఁ గలువల♦తావు దీఱెఁ
గోకములు తేఱెను జకోర♦కులము తారె
నినుడు గడిదేఱె నిరులు మో♦యిండ్లఁ దూఱెఁ
దెలివి చేకూఱె భల్లునఁ♦ దెల్లవాఱె. 151

మ. యమునాతీరవిహార హారసదృశో◆ద్యత్కీర్తి సంభార భా
రమణీయాకృతిమార మారసికతా◆ప్రావీణ్యసంసార సా
రమరందోక్తి విచార చారణనుత◆ప్రఖ్యాతవిస్తార తా
రమహీభృత్సమధీర ధీరమునివా◆రాధార రాధారతా. 152

కం. ధీరాళిమతోద్ధారా
ధారావర కృత్తమత్త ◆ దానవవారా
వారాశినిభగభీరా
భీరాహిత్యామరాద్రి ◆ విశ్రుతధీరా. 152

మాలిని. కలికలుషవిఫాలా ◆ కాంచనోద్భాసిచేలా
గళధృతవనమాలా ◆ కాంతరాధావిలోలా
బలభిదుపలనీలా ◆ పాండవత్రాణశీలా
తిలకితగుణజాలా ◆ దేవకీదేవిబాలా. 154

గద్యము. ఇది శ్రీచిన్నికృష్ణకరుణాకటాక్షవీక్షణాక్షణప్రవర్ధమానానూన
శృంగారరసప్రధాన సంగీతసాహిత్యభరతశాస్త్రాదివిద్యాపారంగత
శ్రీమత్తిరుమలతాతయాచార్య పాదారవిందమిళిందాయ
మానమానసచోళసింహాసనాధ్యక్షప్రతాపసింహ
మహారాజ బహూకృతానేకచామీకరాం
బరాభరణ ముత్యాలుగర్భశుక్తి ముక్తా
యమాన ముద్దుపళని ప్రణీతంబైన
రాధికాసాంత్వనం బనుశృంగార
ప్రబంధంబునందుఁ బ్రథమా
శ్వాసము.

శ్రీరస్తు.

(ఇళాదేవీయ మనునామాంతరముగల)

# రాధికాసాంత్వనము.

## ద్వితీయాశ్వాసము.

రాధామధురాధర
సారామృతపానచతుర • సద్గుణహారా
పారావారవిహారా
భారతసఖ చిన్నికృష్ణ • పాలితకృష్ణా. 1

తే. గీ. అవధరింపుము దేవది•వ్యానుభావ
వ్యాసమునిసూతి జనకభూ•విభుని జూచి
చొక్కటపుజీనిచక్కెర•యుక్కెరలను
నెక్కుడై మించు నుడిచవు•లెక్కఁ బలికె. 2

కం. అటు లారాధిక గోపీ
విటు నటు రతికేళి నేలి • విడువంగ నిలా
కుటిలాలకఁ జేరి తనదు
కుటిలత్వ మెఱుంగనీక • కూరిమి చెలఁగన్. 3

తే. గీ. నిను మిగుల గాసి యిడె నని ♦ నే మురారి
నెనసి పైకొని దండింప ♦ నీవు నిదియె
సందుచేసుక యెచటికి ♦ జరిగి తనుచు
నిళను జేపట్టుకొని రాధ ♦ యింటి కేగె. 4

వ. అప్పుడు. 5

సీ. మహితగండస్థలీ♦మకరికాపత్రికల్
మొసలివాహోగుల♦పసలు దెలుప
మెఱుఁగుచన్నొసఁ గ్రమ్మి ♦ మెఱయుతమ్మరసంబు
పటుతరకౌస్తుభ♦ప్రభ ఘటిల్లఁ
దలిరువాతెర నొప్ప ♦ బలుకెంపు లలవేణు
వివరంపునొక్కుల♦విధ మెసంగ
నలిగి వెన్నునఁ గుల్కు♦తెలిముత్తియపుజడ
పన్నగతల్పంబు♦చెన్ను దనర
తే. గీ. హారగతి మణిశ్రీవత్స♦సారకాంతి
దశదిశల్ నిండ రాధికా♦తరుణితోడ
శౌరిసారూప్య మంది యిల్ ♦ చేర వచ్చు
నిళను గన్గొని యలివేణు ♦ లిట్టు లనిరి. 6

సీ. మనసికాటున కెందు ♦ మందు లే దందురు
మంచిది ఘనసార ♦ ముంచరమ్మ
చిఱుగోటిపోటులు ♦ సెలవారు నందురు
పునుగుకుంకుమ గూర్చి ♦ పూయరమ్మ
తొడసాముచేఁ గండ ♦ లెడ గట్టు నందురు
చలువగొజ్జఁగినీట ♦ జవరరమ్మ
వలపుచెమ్మట లింకఁ ♦ జలి పట్టు నందురు
కలపంబు నెనయించి ♦ యలదరమ్మ
తే. గీ. కమ్మవిలుకానియేనుఁగు♦గున్న బడలెఁ
దళుకుఁజెక్కుల సొంకవ♦త్తైల ముంచి

యలరుమందులపొడిఁ బూసి ♦ యలుపుదీఱ
మేటితాంబూలకవళంబు ♦ మేపరమ్మ 7

కం. అని మిగులవగలఁ బల్కుచు
ఘనతరసురతాంతతాంత ♦ కాంతామణికిన్
మనసిజశాస్త్రక్రమమునఁ
దనువలయిక దీర్చి రంతఁ ♦ దద్దయు వేడ్కన్. 8

చ. అలరులమోవికాటు పస ♦ పంటినదుప్పటినీటు చెక్కులన్
విలసిలుతమ్మముద్దు జిగి ♦ వెన్నునఁ గీల్జడదద్దు కన్నులన్
నెలకొనునిద్రసొక్కు మెఱ ♦ నెక్కొనుగాజులనొక్కు లెంతయున్
వెలయఁగఁ గేళిమందిరము ♦ వెల్వడె మన్మథమన్మథుం డొగిన్ 9

తే. గీ. ఇటుల వెలువడి మజ్జన ♦ గృహముఁ జేరి
చలువగొజ్జంగినీటిచే ♦ జలక మాడి
వలువలుధరించి కలపముల్ ♦ గలయఁబూసి
యతివ వడ్డింప దివ్యాన్న ♦ మారగించి. 10

చ. పడఁతి యొకర్తు కెంపురవ ♦ పావలు వెట్ట లతాంగి యొర్తు పా
వడఁ గొని వీవ నొక్కమద ♦ వారణగామిని తావికప్రపున్
విడె మొసఁగన్ మఱొక్కనవ ♦ నీరదవేణి కళాచిఁ బూనఁగా
నడిదము కేడెముం గొనుచు ♦ నంగన యొక్కతె వెంటఁ గొల్వఁగన్.

సీ. మగరాలకంబాల ♦ నొగి యంత్రపాంచాలి
కలు మీటువీణెల ♦ గులుకు రాగ
ముల సొక్కి తల లూఁచు ♦ జిలుగుబంగరునీటు
వ్రాఁతచిత్తరుబొమ్మ ♦ లను గురించి
దొరలెడుచిలుకల ♦ గోరవంకలనునవ్వ
నిలువిరినగవులో ♦ యివి యనఁదగు
ముత్తియంబులతీఁగె ♦ ముడికట్టుపనులహొం.
బట్టుమేల్కట్టుల ♦ వజ్రలు విరుల

సరులమూఁగెడు తేంట్ల♦గరులమొయి ళ్ళని
యాడునాఁడు నెమళ్ళ♦యడుగుటం దె

తే. గీ. లందుఁదగురోదరతినాద ♦ మనుచు నెపుడు
నిలువుటద్దాలపడకిళ్ళ ♦ నలరుగూండ్ల
రమణఁ బలికెడుపారావ♦తముల నెసఁగు
రాధికామణిమణిసౌధ♦రాజముననుు. 12

తే. గీ. చేరి [1]యట వింతపనులచేఁ ♦ జెలువు గులుకు
చలువచప్పరకోళ్ళమ♦చంబుమీఁది
యంచరెక్కలసెజ్జపై ♦ నలరుముత్తి
యంపులోదునఁ దగఁ జేరి ♦ హాసు మీఱి. 13

తే. గీ. అండ నటు నిల్చియిళ ముత్తి♦యంపుసున్న
మిడినతమలపుటాకుల♦మడుపు లియ్యఁ
గదిసి రాధిక తనచనుఁ♦గవకుఁ బులక
లమరఁ జాచినపాదప♦ద్మముల నొత్త. 14

సీ. తంబుర మీటి గీ♦తంబు పాడుచు నొక్క
మధురోష్ఠి సరిగమ♦పధని యనఁగ
జగ్గుచౌకల్లను ♦ నుగ్గడింపుచు నొక్క
చక్కరబొమ్మ త♦ద్ధిక్కు మనఁగ
గుజరాతిజక్కిణీ♦కోపు లాడుచు నొక్క
భామిని జీవుస♦ల్లా మనంగ
బిరుదుకై వారము ♦ లేర్మి సేయుచు నొక్క
సరసిజానన జయ♦జయ యనంగఁ

తే. గీ. జంద్రబింబాస్య యొకతె హో♦చ్చరిక దెలుపఁ
జెలియు యొక్కతె సందడి ♦ దొలఁగఁ జేయ
నందజుకు నన్ని వగల నా♦నంద మిడుచు
నిండుకొలు వుండె యదువంశ♦మండనుండు. 15

1. పనులచేఁ. [మూ.]

చ. అప్పుడు పయఃపయోధిమణి♦యల్లునిఁ బిల్వఁగ నెమ్మిఁ గోరి స
ద్విపులకులప్రదీపకుఁడు ♦ విశ్రుతకీర్తి యశోదతోడఁబు
ట్టపరిమితప్రభావజన♦కాధిపుమన్ననఁ గొన్నకుంభకుం
డుపగతహర్షుఁడై వరుస ♦ లొప్పఁగ వచ్చెను నందుచెంతకున్. 16

కం. వచ్చినమఱఁదిని గని ముద
మెచ్చఁగ వడి లేచి కౌఁగి ♦ లిచ్చి సమానం
బచ్చుపడఁ బసిఁడిగద్దియ
నిచ్చి రహిన్నందుఁ డతని ♦ నీక్షించి దయన్. 17

ఉ. వచ్చినకార్య మే మనుచుఁ ♦ బల్కిన నాతఁడు కూఁతు నల్లునిన్
మచ్చికఁ బంపఁగా వలయు ♦ మా సదనంబున కన్న, రాధతోఁ
జెచ్చెర నెచ్చరించి యటు ♦ చేయుదు నం చని నందుఁ డాడఁగా,
నచ్చెలియింటికిం జనె ని♦ళాబ్జదళాక్షినిఁ గన్నతండ్రియున్. 18

వ. ఇట్లు చనునెడ నాళీజనంబులవలనఁ దదాగమనం బాలకించి యవ్విరించిగురుం డుదంచితముదం బెదం గదుర నెదుర్కొని ప్రణమిల్లి యవ్వల్లవతల్లజునిదీవనలం జెందిన వేడుకఁ దోడుకొని తెచ్చి హెచ్చుపచ్చరాగద్దియ నుంచిన నతం డందు వసించి రాధావధూరత్నంబుతోనం గురియించి యిళామాధవులఁదోడ్కొని మానివాసంబునకు నీవు రావలయు నన నావనజానన యయ్యా నన్నడుగం బని యేమి యయ్యిళయు నేనును మీ కొక్కరూప కాదె నన్నిలువ వలయునే వలసినప్పుడు వచ్చెద నిప్పుడివ్వధూవరులఁ బిలుచుకొని చనుం డని పనిచిన వారలం దోడ్కొని నిజమనోరథంబీడేర రథం బారోహించి యాభీరవీరు లపారాయుధపాణులై బలసి నలువంకలంగొలువ నమితానందంబును జెంది నందుమఱంది నిజమందిరంబునకుం జని సుఖంబుండె నంత నిచ్చట. 19

సీ. పద్మాక్షుఁడును దాను ♦ బవళించుపడకయి
ల్గని కను ల్కటికచీఁ♦కటులు గ్రమ్మ
నెడలేక మురవైరి ♦ నెనయుముచ్చట లెంచి
పగిలి గుండియ వకా♦వకలు గాఁగ

శ్రీకృష్ణుచేఁ గొను♦చిలుకపల్కులు విని
గుమ్ముగు మ్మని చెవుల్ ♦ దిమ్మగొనఁగ
హరిభోగ్యవస్తువు ♦ లందందసోఁకిన
నెమ్మేను ఝుమ్మని ♦ సొమ్మసిల్ల
తే. గీ. నిప్పుద్రొక్కినకీతిని ♦ నిలువ దేచట
గాము సోఁకినమాదిరిఁ ♦ గలువరించు
విరిగి తల మిన్ను పడినట్లు ♦ విన్నవోవు
భావజునిధాటి కలికి రా♦ధావధూటి. 20

సీ. వెన్నెలచిచ్చులు ♦ వెదఁజల్లు రేరాజు
కిరణంపుగుంపుల ♦ సొరిగి సొరిగి
యమధనుష్టంకార ♦ మన మీఱుతేఁటిఝుం
కారంబులకుఁ జాలఁ ♦ దారి తారి
రాహుఫూత్కారంబు♦లను మించి చనుదెంచు
మలయానిలునిధాటి ♦ కళికి యళికి
యురుమనిపిడుగు లై ♦ యొడలు చిల్లులు వోవఁ
బహుమరుకోలల ♦ బడలి బడలి
తే. గీ. వదరుచిలుకలకూఁతకు ♦ బెదరి బెదరి
పలుకుబకదారిపిట్టల ♦ కులికి యులికి
తల్లడిల్లుచు వడిఁ బడ♦కిల్లు జేరి
మరులుకొని చాన తనదునె♦మ్మనములోన. 21

వ. ఇట్లని వితర్కించె. 22

సీ. కలుగునా కన్నుల♦కఱ వెల్లఁ దీఱంగఁ
గమలాక్షునెమ్మోము ♦ గనుఁగొనంగ
వేవేగ నబ్బునా ♦ వీనులవిందుగా
దనుజారివేణునా♦దము వినంగ
నలవడునా చేతు ♦ లతిపుణ్య మందంగ
వాసుదేవాంఘ్రి సే♦వలఁ బెనంగ

దొరకునా నెమ్మనసు ♦ పరవశ మందంగ
వటపత్రశాయికౌఁ♦గిట మెలంగ

తే. గీ. నొదవునా గోపగోపికా♦సదయు నెనసి
యురుతరానందజలరాశి ♦ నోలలాడఁ
బ్రబల మగుమద్దశాపరం♦పర లవెట్లు
గాఁగ నున్నవొ యే నైతె ♦ కాన నకట. 23

తే. గీ. రాసిఁ జేసినశృంగార♦రస మనంగఁ
జక్షులకుఁ దోఁచుకరుణాతి♦శయ మనంగ
నొకటి యైనట్టిమన్మథా♦యుత మనంగఁ
బొలుచుగోపాలరూపంబుఁ♦బొగడవశమె. 24

కం. తమ్ములు శౌరిశ్రీపా
దమ్ములు మోదమ్ము లొదవుఁ ♦ దమ్ముల నెల్లన్
దమ్ము లనం దప మళినా
దమ్ములు వేదమ్ములు నిన♦దమ్ములు సలుపున్. 25

ఆ. వె. పుంగవములమీఁదఁ ♦ బులులును బులులపైఁ
గరులుఁ గరులపైని ♦ హరులు గవియు
నందగోపసుతుని ♦ నడ కొకించుక సాటి
తాము తాము తాము ♦ తా మటంచు. 26

తే. గీ. దానవారాతినఖధాళ♦ధళ్యములును
బ్రపదరోచులు పదరుచుల్ ♦ పరిఢవిల్లె
నతనియడుగుల నొకటిగా ♦ నతిశయిల్లు
జాహ్నవీయమునాసర♦స్వతు లనంగ. 27

తే. గీ. తీర్థపాదునిశ్రీపాద ♦ తీర్థమందుఁ
గలకమఠనక్రములు దేలి ♦ వెలికి వచ్చె
జోడుజోడుగ నన నీడు ♦ జోడు లేక
యతనిమీఁగాళ్లఁ జెలువొడ ♦ లనువుమీఱు. 28

చ. సిరియును భూమినీళలును ♦ జెల్వగువల్లవపల్లవాధరల్
నిరతము లాలనల్ సలుప ♦ నిగ్గులు గుల్కెడుశౌరిజంఘులన్
గరకరిఁ జూచి మారజయ♦కాహళు లూఁదఁబడంగ నే మగున్
మొఱ లిడు టింతె కాని సరి♦పోలునె పోలిన బోటుఁ జెందవే. 29

కం. నాగారిగళముపైఁ దగు
నాగమదధ్వంసితొడలు ♦ నాగకరంబుల్
నాఁ గనుకని నగరే యెల
నాగలతో ధీరు లైన♦నాగరజనముల్. 30

ఆ. వె. కౌస్తుభంబుతోడఁ ♦ గనుపట్టు ఫణిరాజ
శాయిగళము శంఖ ♦ మాయె ననుచుఁ
గనకపటముతోడఁ ♦ దనరుగోపాలక
స్వామికటియుగంబు ♦ చక్ర మయ్యె. 31

తే. గీ. జానులను జేరుబాహుల♦సరవిఁజూచి
కనులు చెవులకు వివరింపఁ ♦ గదియువింత
పోలుపు వినఁగోరి తల లెత్తె♦భుజము లటులఁ
గాన లే నైతి ననువంతఁ♦గొనుచిక్కె. 32

తే. గీ. ముజ్జగంబులు వెన్నుని♦బొజ్జనున్న
తెఱఁగువివరించుదారి నాఁ ♦ త్రివళు లమరుఁ
గదిసి వళిభంగములఁ దేలు♦కమల మనఁగ
నలువగుము లీనుకృష్ణుని♦నాభి దనరు. 33

ఆ. వె. శ్రీయుతంబు గాఁగఁ ♦ జిలువరాపడగయు
గందపట్టె లుండు♦కతనఁ దలుపు
హరియురంబునెదిరి♦శిరము వే ప్రక్క లై
మూలయింటిలోన ♦ మూఁతఁబడియె. 34

కం. కనుపసికాపువడంతుల
చనుజక్కవ లలరఁ జేయు♦శౌరినఖంబుల్

చను నే నెలరేఖలు నా
ననుపమములు తత్సమంబు ♦ లవియే జగతిన్. 35

చ. ఖరమురకంసహంసనర♦కాదిసురారులప్రాణవాయువుల్
పొరిగొని దివ్యరత్నమయ♦ముద్రిక లొప్పెడిసోగవ్రేళ్లతో
హరిభుజకాండముల్ చెలువ ♦ మందు శిరోమణు లంద మందఁగా
మురు వగుపంచభోగయుత♦భోగుల సీఁగను శ్రీ లొసంగుచున్. 36

చ. శర ణనువారికి న్మృదువు ♦ శత్రులకు న్గఠినత్వ మిచ్చుఁ ద
మ్మెఱుఁగనివీనిపల్లవము ♦ లే మెన యంచుఁ దలంచె నంచుఁగా
మురు వగుదేవశాఖిని స♦మూలముగాఁ బెకలించి తెచ్చి యా
మురరిపుకేలుదోయి యిడె ♦ ము న్నొకభామపెరంటిచెట్టుగన్. 37

ఉ. కోరినఁ గల్పశాఖ యొక♦కొన్నిఫలంబుల నిచ్చు నల్పముల్
కోరిక పార నిత్యఫల♦కోటుల నిచ్చు మురారిబాహువుల్
సారెకు వాని వీని కెటు ♦ సాటి యనం దగు దీటు లేమిచే
వారక పోల్తు రీకవులు ♦ వానికి వీనికిఁ దాఱుమాఱుగన్. 38

చ. అరయఁగ శంఖచక్రముల ♦ నంది సుగంధములం భరించి ప
ల్మరు విను చిక్కినట్టిమహి♦మన్ ఘనసింధురసేవ్యమాన మై
ధరణిధరత్వ మంది గిరి ♦ తద్భుజయుగ్మముమీఁద నెంతయున్
సరిపడఁ బోరి యెత్తు వడె ♦ చాలక యా మురవైరిచేతనే. 39

చ. సరసులు మెచ్చఁగాఁ దనరు♦శంఖ మనంతము పద్మయుగ్మమున్
నరహరికంఠమధ్యనయ♦నంబులకున్ వెలగా వటన్నచో
నరయఁగఁ బోకలా పిడికి♦లా యొకచేర లటంచు నెంచఁగన్
హరిహరి వారిమూఢమతి ♦ కాదియు నంతము గల్గఁ నేర్చునే. 40

తే. గీ. మారు డధరామృతం బెందు ♦ జాఱనీక
కోరి పెట్టినసీలంపు♦కోర యనఁగ
గొల్లచెలియలసొమ్ముగాఁ♦గొనుచుఁ దనరు
మదనజనకుని చుబుకంబు♦మధుర మొదవు. 41

తే. గీ. కావి గా దది విడికెంపు♦దీవి గాని
దీవి గా దది యమృతంపు♦బావి గాని
బావి గా దది కపురంపు♦తావి గాని
తావి గా దది శౌరికె♦మ్మోవి గాని. 42

కం. తేటలుగా జిగిముత్యపు
పేటలుగాఁ బంచదార♦పేటులుగాఁ బూఁ
దోఁటలుగా రాచిలుకల
మాటలుగాఁ గంసవైరి♦మాటలు దనరున్. 43

తే. గీ. శౌరిముఖచంద్రునకు సహా♦జంబులగుచుఁ
దగియె నధరామృతస్ఫూర్తి♦మృగమదాంక
మతులితకటాక్షశీతల♦మైనకళలు
నవ్వువెన్నెల కువలయా♦నందగరిమ. 44

ఉ. మల్లెలు మొల్లమొగ్గలును♦మంకెనపువ్వు సువర్ణకోశముల్
దెల్లనినవ్వు పల్వరుస♦తియ్యనివాతెర నిక్కుముక్కునై
యల్లుకొన న్ముఖాబ్జమున♦నాతఁడు మాధవుఁడౌ టెఱింగి మే
ల్చెల్లవె వీనికి న్బుధులు♦చెప్పెడియాసుమనోభిధానముల్. 45

చ. మురహరునాస నూఁదఁబడి♦పోయినసీలపువేణునాదముల్
సరి గన లేక చేఁబడిన♦చంపకకాండవిలాససంపదల్
నెరి గని కాదె పక్షిపతి♦నేర్పున ముక్కడఁ జేసి తగ్గి త
చ్చరణము లంది క్రిందుపడె♦సమ్మతి నెప్పుడు వీఁపుఁ జూపుచున్.

కం. సరి లేనిశౌరినాసిక
స్మరవనవంశంబు గాదె♦మఱి దానితుదల్
వరముక్తాఫల మేటికి
వెర వగుతిలపుష్పతుహిన♦బిందువురీతిన్. 47

కం. అద్దిర నిద్దపుటద్దము
లద్దనుజవిదారిచెక్కు♦లటు గా కున్నన్

Vignana Kendram

సుద్దపుటద్భుతరసమున
కొద్దిక నై చూచువారి ♦ నోగి లోఁ గొనునే. 48

చ. జలజము కల్వ లొక్కెడను ♦ శౌరివిశాలవిలోచనంబులం
దుల గనఁ గోరి హంసతతి♦తో జలమందుఁ దపంబు సల్పఁగాఁ
గలిగెను దోసము న్వగలుఁ ♦ గ్రమ్మఱ నాకనుదోయి నెంచఁగా
జెలఁగెఁ బికస్వరం బమర ♦ శ్రీధరణీకరభూషణంబు లై. 49

కం. మురహరుని వంకబొమ్మలు
మరువిండ్లే కాక యున్న ♦ మగువలమనముల్
మెఱుఁ గైనచూపుతూపులఁ
గురిసి విభేదించుదారి ♦ గొనునే జగతిన్. 50

తే. గీ. తనుఁ దలఁచి దీను లిపు మొఱ♦ల్వినఁగ లేక
యతులనవదివ్యసంపద ♦ లలరఁ జెలఁగు
శౌరివీనులు శ్రీలై పో ♦ సారె కటులఁ
గాక కనుదమ్ములటు మేలు ♦ గనఁగ నేల. 51

తే. గీ. శౌరిముఖసామ్యమును గోరి ♦ సారసారి
గట్టుపై నెక్కి తలక్రిందు ♦ గాఁగ నెంతో
కాఁకఁబడిపడి తనచేతఁ ♦ గాక కాదె
యతనుచిత్తానువర్తి యై ♦ యతిశయిల్లె. 52

చ. వల నగునబ్జరూపములఁ ♦ బాత్రము జ్యోతియుఁ గాఁగఁ జేసి య
వ్వలపుల జేనితండ్రి మొగ♦వాసికి వాసిగ దృష్టి దీసినం
జెలిమి ఘటిల్ల నవ్వు డొక♦చెల్వము గాంచి ఘనంబు మించి హం
సలకుఁ గలంగ కే యుభయ♦సంపద లందెఁ దమఃప్రసక్తిగాన్. 53

తే. గీ. ఇరులు గా వని నీలంపు♦సరులు గాని
సరులు గా వవి మగతేఁటి♦గఱులు గాని

---

1. కన్ను బొమ్మలు. [మూ.]

గలులు గా వవి మరువేట♦యురులు గాని
యురులు గా వవి శౌరిముం♦గురులు గాని. 54

సీ. ఈకప్పపెన్నెరి ♦ కెన యౌనె సౌరముల్
నీలాంచలముపైని ♦ నెగడినంత
నీయెమ్మెక్రొమ్ముడి ♦ కెన యౌనె మునునాచు
యమునాజలంబులో ♦ నల్లినంత
నీనిడుకీల్జడ ♦ కెన యౌనె రాహువు
గురుతమోవిఖ్యాతిఁ ♦ గొన్నయంత
నీగొప్పకొప్పున ♦ కెన యౌనె శిఖికోటి
ఘనులతో బహుమైత్రిఁ ♦ గన్నయంత
తే. గీ. ననఁగ వలగట్టి మృదులత్వ♦మంది చిక్కుఁ
గొనక భంగ మై కొనసాగి♦కనుల కెసఁగి
బెండుపడకయె యెపు డొక్క♦దండి వన్నెఁ
జెందుగోపాలకస్వామి♦చికురభరము. 55

సీ. శకటారినెమ్మోము♦సరి యెందు లే దని
ద్విజరాజుపై నానఁ ♦ బెట్ట వచ్చు
శౌరికన్నులతోడ ♦ సమ మెందు లే దని
తమ్ములఁ బడవైచి ♦ దాఁట వచ్చు
మరునికన్నయమోవి♦సరి యెందు లే దని
యమృతంబుముందర ♦ నాడవచ్చుఁ
గ్రిడిబావయురంబు♦జో డెందు లే దని
యాదిశేషునిఫణ ♦ మంట వచ్చు

తే. గీ. కంసరిపుమధ్యసామ్యంబు♦గలుగ దనుచుఁ
జెప్పి హరిముందరనె బాస♦సేయ వచ్చుఁ
గృష్ణదేవునిరూప మిం ♦ కెందు దొరకఁ
బో దటంచును నజు నైన ♦ ముట్ట వచ్చు. 56

కం. ఇల రాయరాయ లగుమా
యలరాయల నెంచి యూచ ♦ కాచక మదిలో
నలరాయల నెలరాయల
వలరాయల నెన్న దృష్టి♦పాత్రలు గారే. 57

ఉ. ఆనడ లామెఱుంగుతొడ ♦ లారసికత్వము లావిలాస మా
మేనిమెఱుంగు లామొలక♦మీసఁపురంగులు నాబెడంగు లా
సూనశరాసతంత్రపరి♦శోధన లామధురస్మితంబు లా
పూనికచొప్పు లాపలుకు♦పోడిమి యానెఱజాణకే తగున్. 58

ఉ. మాటలు ముద్దుపద్దులును ♦ మక్కువటెక్కులు మ్రొక్కుసొక్కులున్
గాటఁపుకౌఁగిలింతలు వ♦గల్ గిలిగింతలమీటువింతలున్
మాటికి మాటికి న్గలయు♦మాలిమి మేలిమిఁ జూచినట్టియే
యోటది వాని వీడు నక♦టా కడురక్కసి నన్నుఁ దక్కఁగన్. 59

మ. అని చింతించుచు మించుఁబోఁడి తనయుం ♦ బ్రాణావనోదార మై
వనజస్యందమరందబిందువిలస♦ద్వాగ్ధోరణీసార మై
యనవద్యాఖిలలోకవర్ణితమనో♦జ్ఞాకార మాకీరముం
గని తా ని ట్లనె [1]సూనసాయకశరా♦ఘాతార్తచిత్తాబ్జ మై. 60

మ. ఇదిగో వచ్చెద నంచుఁ బోయె బహుళా ♦ల్లేగెన్ మహాబ్దంబు లై
సదయుం డేటికి రాఁడు నాయెడఁ గటా♦క్షం బెల్లఁ బో నాడెనో
మదిఁ దా వీడెనొ కూడెనో యిళను రా♦మా జీవ మూటాడెడిన్
మదనక్రూరదవానలం బదన మై ♦ మై నంటఁగాఁ గీరమా. 61

ఉ. కంటికి నిద్ర రాదు విను ♦ కాంతుని బాసిననాఁటినుండియున్
వంటక మింపు గాదు పెర♦వార్తలు వీనుల సోఁక లేదు నేఁ
డొంటిగఁ బ్రొద్దు పోదు మదు ♦ లూరక యుండఁగ నీదు తొల్లియే
జంటఁ బెనంగువారిఁ గనఁ ♦ జాలక చాల కరంగఁ గంటినో. 62

1. రాధ మన్మథ. [మూ.]

సీ. వానిమోమును జూచి ♦ నే నేల మరు లైతి
జిగిగందమామపై ♦ వెగటు దోఁప
వానిమైసొగ సెంచి ♦ నే నేల వలచితిఁ
గలువలపాన్పుపైఁ ♦ గసటు వొడమ
వానినవ్వు దలంచి ♦ నే నేల చిక్కితిఁ
జిక్కనిపాలపైఁ ♦ జేఁదు గొనఁగ
వానిమా టాలించి ♦ నే నేల లో నైతిఁ
జిలుకపల్కులపైని ♦ జుల్క నమర
తే. గీ. వానివా తెర నే నేల ♦ యానఁ గంటి
జీనిచక్కెరయుక్కెర ♦ [1]లేని మాన
[2]నిందు కేమందు నేమందు ♦ నందితిందు
[3]నెపుడు హరిపొందు గనుఁగొందు ♦ నెట్టులుందు. 63

సీ. కనుఁగవ హరిమోము ♦ గనుఁగొననే కోరు
వీనులు హరిమాట ♦ వినఁగఁ గోరు
నాసిక హరిమేని ♦ వాసన ల్గొనఁ గోరు
నధరంబు హరిమోవి ♦ యానఁ గోరుఁ
జెక్కిలి హరిగోటి ♦ నొక్కునొక్కులె కోరు
గుబ్బలుహరిఱొమ్ముఁ ♦ గ్రుమ్మఁ గోరుఁ
గరములు హరి నెంతొ ♦ కౌఁగింపఁగఁ గోరు
మేను శ్రీహరిప్రక్క ♦ మెలఁగఁ గోరు
తే. గీ. నిన్నియొక్కొకటే కోరు ♦ నిదిగొ నాదు
మనసు గోరెడికోరికెల్ ♦ మట్టులేవు
మర్మమెందుకు మదనసా ♦ మ్రాజ్య మిచ్చి
నెగడు హరియె యాయుర్దాయ ♦ మగుటశుకమ. 64

తే. గీ. మనసు కరఁగును హరిముద్దు ♦ మాట విన్న
మోహ మెద నిండు హరినగు ♦ మోము గన్నఁ

1. లేనిమాలి. [మూ]. 2. తిందు కేమందు మదిని నా♦నంద మెందు. [మూ].
3. దెపుడు. [మూ].

దమి చెలంగును హరిచెంత ♦ నిమిష మున్న
మరువ వచ్చునె యెవరెంత ♦ మరువుమనిన. 65

సీ. హరిపేరురముఁ జూచి♦నంతఁ జన్గుబ్బలు
సిగ్గుమాలుచు రైక ♦ చిటుల నుబ్బుఁ
బసిగాపురాయల♦పల్కు విన్నంతనే
వీనుల కమృతంబు♦విందు లగును
మీనాంకుతండ్రినె♦మ్మేను సోఁకినయంతఁ
బులకలు తను వెల్ల ♦ మొలక లెత్తుఁ
గమలాయతాక్షుని ♦ గదిసి పైకొన్నంతఁ
దమి నిండి తండోప♦తండ మగును

తే. గీ. నందనందనుఁ డబ్బెనా ♦ నవనిధాన
ములును దక్కినచందానఁ ♦ జెలఁగుఁ జిత్త
మామనోహరుఁ బాసి నేఁ ♦ డడల వ్రాసె
నౌర తలవ్రాఁత తలకొట్ల♦మారిధాత. 66

కం. చెలువుని గన్గొనుటకు నా
పలుకునఁ జని చిక్కె నేమొ ♦ పరిపరిగతులన్
బిలిచిన రా దిచ్చటికిం
జెలిమి గలుగునాదుమనసు♦చెలి యోచిలుకా. 67

కం. వీడుదు బంధుల మగనిన్
వీడుదు ధనధాన్య గేహ♦విభవము లెల్లన్
వీడుదుఁ బ్రాణము లొడలన్
వీడంగాఁ జాల హరిని ♦ వే యన నేలా. 68

ఉ. ఎంతని విన్నవింతు హృద♦యేశుఁ డొనర్చినవింత లన్నియుం
జింత కెడంబు లాయె మును ♦ చేసినబాసలు దప్పు లాయె న
న్నింతులు నవ్వ నాయె వెత ♦ లెందు వెలి న్విడఁ గూడ దాయె నే
నెంతయుఁ డార నాయె నిఁక ♦ నేటికి మాటలు ముద్దుకీరమా. 69

కం. కల గంటి నిన్న రాతిరి
[1]కలకంఠిని గూడి హరికిఁ ♦ గరకరినాపైఁ
[2]గల కంటినగతి నిదిగో
కలకంఠధ్వనులు కర్ణ♦కాండము లయ్యెన్. 70

ఉ. కావునఁ బోయి నీ విపుడు ♦ గావుము శౌరిని దెచ్చి కూర్చి వే
గావుగ నన్ను వే గదిసి ♦ కాయజుఁ డెంతయుఁ బంతగించె లో
జీవము లావలించెఁ దమి ♦ సిగ్గు నడంచె విరాళి మించె మై
దీవె చలించె దాయ యయి ♦ దేవుఁడు న న్నిటు ముంచెఁ గీరమా.

సీ. నాకృష్ణదేవుని ♦ నాముద్దుసామిని
నాచక్కనయ్యను ♦ నాదుహరిని
నానోముపంటను ♦ నారాజతిలకుని
నారాముతమ్ముని ♦ నాదువిభుని
నామనఃకాంతుని ♦ నానందతనయుని
నాప్రాణనాథుని ♦ నాదుప్రియుని
నామోహనాంగుని ♦ నానీలవర్ణుని
నావిటోత్తంసుని ♦ నాదుసఖుని
తే. గీ. జేరి కన్నులకఱ వెల్లఁ ♦ దీరఁ గాంచి
చాల నడిగితి మ్రొక్కితిఁ ♦ గేలు సాచి
కౌఁగిలించితిఁ గరములు ♦ కనులఁ జేర్చి
కొంటి ర మ్మంటి మదివేడు♦కొంటి ననుమి. 72

సీ. మోహనాంగునితియ్య♦మోవి బింబ మటంచు
మదిఁ జొక్కి నామాట♦ మరువ వలదు
నలినలోచనునిలే♦నగ వానవా లంచు
మరులెక్కి నామాట♦ మరువ వలదు

1. కలకంఠిని గూడిశౌరి ♦ కందిన యటు లైఁ. [మూ.]
2. గలఁ గనినగతియు నిదిగో. [మూ].

కంసారిపలుకులు ♦ కండచక్కెర లంచు
మదిఁ దక్కి నామాట ♦ మరువ వలదు
రమణుచల్లనిచూపు ♦ లమృతపూరమటంచు
నెరిఁ జిక్కి నామాట ♦ మరువ వలదు
కమలాక్షుకరములు ♦ కల్పశాఖ లటంచు
మది నెంచి నామాట ♦ మరువ వలదు

తే. గీ. వానిఁ గనిరేని ఘనమోహ♦వనధిలోన
మరగి మున్గుదు రయ్యాది♦మౌను లైనఁ
బలుక నేటికి మనవంటి♦వారిఁ గానఁ
గీరమా తెల్వి గొని తెల్పు ♦ శౌరితోఁడ. 73

కం. ఇళ చెంత నాథుఁ డుండఁగ
బలుకం బోయెదవు నాదు♦పలుకులు చిలుకా
వెలి దీసి యొంటికోలువునఁ
జెలువునితో విన్నపంబు ♦ సేయుము చిలుకా. 74

కం. అనుచిలుకలకొలికిని గని
కనికరమునఁ జిలుక పలికెఁ ♦ గలికిరో వినుమా
వనరుహనయనుఁడు మఱి మది
నిను గడ నిడి భళి మఱొక్క♦నెలఁతను గొనునా. 75

సీ. కలికి నీకంఠంబు♦కరణి నున్న దటంచు
నీకటితటిదారి ♦ నెగడె నంచుఁ
గాంత నీయూరుల♦గతిఁ జెలంగె నటంచు
నీయూరుతీరున ♦ నెగడె ననుచుఁ
జాన నీబొమలచం♦దాన మించె నటంచు
నీముక్కు చెక్కున ♦ నెగడె ననుచుఁ
బాలతి నీకొప్పచొ♦ప్పన మేలు గనె నంచు
నీమోముగోమున ♦ నెగడె ననుచు

తే. గీ. శంఖచక్రగదాఖడ్గ♦శార్ఙ్గములను
వేణుశిఖిపింఛపద్మము ♦ లీవడక పూనె
నట్టిహరినిన్ను విడుచునా ♦ యడల వలదు
నిమిషమునఁ దెత్తు నే వాని ♦ నీలవేణి. 76

కం. జలజభవాదులచేతం
దెలివిగఁ దే రానివానిఁ ♦ దే నోపుదువే
భళిభళి నీ వనఁ దెత్తును
బలుసోదరు నీకటాక్ష♦బలమునఁ జెలియా. 77

కం. అని పలికి కలికిపంపుసఁ
జనె ముద్దులు చిలుకుచిలుక ♦ జలజదళాక్షుం
గొని వత్తు నంచు నంతట
వనిత సఖు ల్గొలువఁ గేళి♦వనమున కరిగెన్. 78

తే. గీ. కొమ్మ యీరీతిఁ జని కొమ్మ♦కొమ్మయందు
నూతనం బగుదళములు ♦ నూల్కొనంగ
మరునికో టగుపూఁదోఁటఁ♦జార వెఱవఁగఁ
జారవ నుడివిరి తెఱవలు♦మఱువుపడగ. 79

చ. సకియరొ చూడుమా కనులు ♦ చల్లఁగ నల్లదె మాధవుండు వా
రక సుమనోవికాసుఁ డయి ♦ ప్రాప్తవనప్రియచిద్విలాసుఁ డై
శుక ముఖసద్విజప్రకర♦సూనృతవాఙ్మయుఁ డౌచు గోపికల్
కకవికఁ జుట్టఁ బెట్ట వన♦లక్ష్మిని గూడి చెలంగె వేడుకన్. 80

చ. పొగడలు చెంగలించె సుర♦పొన్నలు క్రొన్నన లుంచె మావులం
జిగురులు మించె సంపెఁగలు ♦ చెల్వు వహించె రసాలసాలము
ల్మొగడలు నించె గొజ్జఁగిగ♦ము ల్వికసించె నశోకభూజము
ల్తొగరు ఘటించె మించెఁ గద♦ళుల్ కనవే ఘనవేణికామణీ. 81

చ. ఘనకమలాకరాశ్రయతఁ ♦ గాంచిన హంసలు మాధవస్తుతిం
జనుపికముల్ హరిం దలఁచు♦జక్కవపక్షులు కృష్ణవర్ణముల్

గోనునును దేంట్లు మారగురుఁ ♦ గోరి వహించుశుకంబు లొప్ప మే
ల్గని పురుషోత్తమస్ఫురణఁ ♦ గైకొనె నీవనిఁ జూడు భామినీ. 82

కం. ఇటు లాడుచెలులమాటలు
కుటిలాలక యాలకించి ♦ కొంతకుఁ గొంతన్
దిట మూని కేళివనమును
జటులగతిం జొచ్చి మెల్లఁ ♦ జని చని యచటన్. 83

సీ. పున్నాగములఁ జూచి ♦ పున్నాగము లటంచు
భ్రమ గొని లేమావి♦గుములఁ జేరు
లేమావిగుములను ♦ లేమావిగుము లంచుఁ
దారాడి స్యందన♦తతికిఁ బాఱు
స్యందనతతులను ♦ స్యందనతతు లని
వెత నొంది పరవీర♦తతులఁ గోరుఁ
బరవీరతతులను ♦ బరవీరతతు లంచు
బెదరి కెంజిగురాకు♦పొదలు దూఱుఁ

తే. గీ. బొదలు మదనుని విరియంప♦పొదు లటంచు
నవలగొజ్జంగినీటికా♦లువలఁ దారుఁ
జెలులపైఁ జీరు వేమారు♦కలఁకఁ బాఱు
వెతలచే మీఱు వేసారు ♦ విధిని దూఱు. 84

కం. ఈరీతి నెచట నిలువక
తారాడుచు నొకరసాల♦తలమూలమునన్
జేరి విరిపాన్పుమీఁదను
నారీరత్నములు గొలువ ♦ నవలా చెలఁగెన్. 85

తే. గీ. కోకకుచ కాఁకఁ బడఁ జూడ ♦ లేక లోక
బాంధవుం డస్తమించెను ♦ బశ్చిమాద్రిఁ
గువలయద్వేషి యయ్యెను ♦ గొమ్మ వంతఁ
గనఁగ లేఁడన నితరుల ♦ ననఁగ నేల. 86

సీ. మఱి సంజ గనిపించె ♦ విరహులపై వల
రాజు గ్రక్కినకోప♦రస మనంగఁ
దిమిరంబు [1]తిమిరించెఁ ♦ దెగిపాంథులను ముంచ
మరుఁడు నిర్మించిన♦మాయ యనఁగఁ
దారక లరుదెంచె ♦ మారుండు పథికులఁ
గూల్ప నించినచిచ్చు♦గుండ్లనంగ
విధుబింబ ముదయించె ♦ వెస వియోగులనొంప
స్మరవీరుఁ డెత్తిన♦చక్ర మనఁగ

తే. గీ. బొండుమల్లియతండముల్ ♦ పూచినటులఁ
బండువెన్నెల బ్రహ్మాండ♦భాండ మెల్ల
మెండుకొనె విప్రయోగుల♦మీఁద శంబ
రారి వైచినవెలిగుడా♦రం బనంగ. 87

చ. కలువలు మీఱె నీరరుహ♦కాండము తాఱెఁ జకోరపంక్తి వె
న్నెలరుచి గోరె జక్కవల♦నీటులు దీఱె విటీవిటాళిపై
రలుకలు జాఱె సూనశరుఁ ♦ డమ్ములు నూఱె సుధాంశురాలలో
పల జల మూరె దంపతుల♦బంధురతాపము లాఱె నంతటన్. 88

చ. వెడవిలుకాఁడు లోపలను ♦ వెల్వల గాలియుఁ బైని జంద్రుఁడుర్
జడిగొని చుట్టుఁ గీరములు ♦ శారికలు న్పికహంసముల్ నెరా
యిడుములఁ బెట్టఁగాఁ గలికి ♦ యిట్టటు బెట్టుగఁ గొట్టుకాడుచుర్
బడలి విరాళిచేఁ గుముద♦బంధుని గన్గొని సైఁచ కిట్లనున్. 89

ఉ. తోయధిరాజుకుం బొడమి ♦ తోయజవాసినితోడఁబుట్టి యా
తోయరుహాప్తుజం టగుచు ♦ తోయజనేత్రునకు న్మఱంది వై
త్రోయఁగ రానిచీఁకటులఁ ♦ ద్రోయుచుఁ జల్లనితెల్వి చెందియుర్
నాయమె నీకుఁ జెంగలువ♦నాయఁడ నాయెడ నింత సేయఁగన్. 90

---

1. మించెను ♦ దెగిసాధులను. [మూ.]

తే. గీ. కాలమహిషాధిరూఢతఁ ♦ గదలి వచ్చి
కిరణపాశమ్ములఁ దగిల్చి ♦ విరహిజనుల
[1]డాసి తీసెదు ప్రాణముల్ ♦ దోసకారి
రాజవా నీవు యమధర్మ♦రాజు గాని. 91

కం. తమ్ములకును గొడుకునకును
సమ్మతి గానట్టిరజని♦చరుఁడవు గావా
యిమ్మహి రావణదితిజుల
నమ్మక్కఱొ మించి తౌర ♦ యత్రికుమారా. 92

తే. గీ. గురుపతిని బట్టి విప్రయో♦గులను గొట్టి
తమ్ముల నడంచి పక్షపా♦తము ఘటించి
కాలగతి నుండె యిదెరాజ♦గట్టునుండి
పడె దధోగతి రౌరవ♦ప్రాప్తిఁ జెంది. 93

చ. తనుఁ గొనువారినిం గొనుచు ♦ ధర్మము దప్పక కాలకూటము౯
మును గళమం దడంచికొని ♦ మూర్ఖత ని న్నిరసావహింపఁగాఁ
బునుకకళాస మెమ్ములను ♦ బూదియుఁ బూని తలేఁబుఁ బట్టి మే
నును సగ మయ్యు మూలఁ బడె ♦ నుగ్రుఁ డుదగ్రనిశాచరాగ్రణీ. 94

వ. అని మదనునిం గూర్చి యి ట్లనియె. 95

తే. గీ. విసముతోఁ బుట్టెఁ గావున ♦ విధున కకట
పద్మినుల నేచుగతి సరే ♦ భళిర నీవు
పద్మినీపద్మనేత్రుల♦వలనఁ బుట్టి
మేనమామను బోలఁగా ♦ మేలె మదన. 96

తే. గీ. తల్లిపుట్టింటిపగవానిఁ ♦ దనరఁ జేసి
తండ్రిపేరును గైకొన్న♦దంటనంటి
పద్మినీజాతులను జంపఁ ♦ బగలు గంటి
వౌర నీ కిది యేమిటి ♦ మేర మార. 97

1. గాసిఁ జేసెదవిప్పుడు ♦ దోసకారి. [మూ].

చ. అని యనిలుం గురించి పవ ♦ నా [1]పవ నామొడఁ జేయు నాయమా
ఘన మెడలించి మారుగతిఁ ♦ గై కొనుచు న్నుమనోహరుండ వై
దినమును లంకనుండి చను ♦ దెంచుచుఁ గొమ్మలఁ బల్మిఁ బట్టఁగా
వనఁ దగు దీవు రావణున ♦ కన్నవొ తమ్ముఁడవో యెఱుంగరా. 98

వ అని శుకపికాదులం గురించి 99

సీ. [2]కాని మాటనె బంది ♦ ఖానవే వేయింతు
గడుసుకొక్కెరవేఁట ♦ కానిఁ గూడి
[3]పట్టి మీపు ట్టెల్లఁ ♦ బలుగాకుల కొసంగి
వే ముంతు గోపికా ♦ రాముఁ గూడి
పద మెత్తి పెట్టి మీ ♦ మద మెల్ల వదలింతు
మెదలనీయక నీల ♦ మేఘుఁ గూడి
జడకొద్దిఁ గొట్టి మీ ♦ చెఱుగంతుల నడంతు
నిస్తులశరదబ్జ ♦ నేత్రుఁ గూడి
తే. గీ. యలిగి మొగ మేల నెఱఁజేయ ♦ శుకములార
[4]విడువ్రుఁడీ పట్టికూఁతలు ♦ పికములార
డించుఁ డటు మందగతుల రా ♦ యంచలార
నిలుపుఁ డీఁక పెట్టికేకలు ♦ నెమ్మలార. 100

వ. అని విలపించుచుండునవసరంబున. 101

చ. చిలుకవజీరుఁ డత్తరిని ♦ జిందఱవందఱఁ జేతు నంచు నా
చిలుకలకొల్కిపైఁ గదిసి ♦ చివ్వలిరవ్వ లడంగ జాతిపెం
జిలుకులకోరికోల లటు ♦ చేఁదెను దుమ్మెదనారి మ్రోయఁగాఁ
గలికిమెఱుంగుగుబ్బలను ♦ ఖంగు ఖణీలు ఖచిక్కు రింగనన్. 102

కం. ఇ ట్లేసిన మదిఘుల్లని
[5]పట్లెల్లను సడలి రాధ ♦ భయ మందుచుఁ దా

---

1. పగ. [మూ]. 2. కానిమ్మి నే. [మూ]. 3. పట్టి మీపుట్టిల్లుఁ. [మూ]. 4 వ్రేలగా నేలవిప్పుడు ♦ పికములార. [మూ]. 5. పెట్లెమ్మదిసడలి రాధ ♦ పంచినవేళతో. [మూ].

ని ట్లని పలుకఁ దొడంగెను
బొట్లంబుగఁ జుట్టు నున్న♦పొలఁతులతోడన్. 103

ఉ. శౌరిని బిల్వఁగాఁ జనిన♦చక్కనికీర మదేల రాదొ యే
దారిని జన్నదో నడుమఁ ♦ దారెనొ చేరెనొ లేదొ గోపికా
జారుని గాన్చెనో కనదొ ♦ చక్కఁగ నావెత విన్నవించెనో
సారెకు లేక శౌరినుడి♦చక్కఁగయుక్కర మెక్కి చిక్కెనో. 104

సీ. పద్మాక్షుఁ డెవ్వతె♦పైఁ గన్ను వేసెనో
పలుమాఱు వలకన్ను ♦ పదరె నిదిగొ
శౌరి యెవ్వతెమోవి ♦ చవులకు మరగెనో
వదలక కెమ్మోవి ♦ యదరె నిదిగొ
వనజారి యచట నె♦వ్వతెచెట్టఁ బట్టెనో
విడువక భుజము కం♦పించె నిదిగొ
ఫణిశాయి యెవతెను ♦ బైకొని యేలెనో
మించి పెందొడ చంచ♦లించె నిదిగొ
తే. గీ. చిత్తజునితండ్రి యెవతెచేఁ ♦ జిక్కొనెనొ
మించుసంచున మై తత్త♦రించె నిదిగొ
చిలుక యీవేళకును రాక ♦ నిలిచినపుడె
యేమి హేతువొ తెలియ లే♦దింతులార. 105

కం. చెలువుఁడు వేఱొకచెలియను
దలఁపునఁ దలపోసినపుడె ♦ తనకుం దానే
తల నొచ్చెఁ గనక వినకయె
కలికిరొ యే మందు వలపు ♦ కానిది సుమ్మా. 106

చ. కిలకిల నవ్వుచుం దివిరి ♦ కిన్నెర మీటుచుఁ బాట పాడుచున్
జిలుగురుమాలచెంగు వెను♦జీరఁగ దుప్పటొకింత జాఱఁగాఁ
గలుకుహారంగుపెండియము ♦ ఘల్లన నాయెడ ఘల్లు ఘల్లనన్
దులదుల శౌరి వచ్చుగతి ♦ దోఁచియుఁ దోఁచక యున్నదేమొకో.

సీ. మదహస్తిపై నెక్కి ♦ మావటీల్ గొలువంగ
విచ్చలవిడిఁ జొచ్చి ♦ వచ్చునటుల
సాంబ్రాణితేజిపై ♦ సాహిణు ల్పొగడంగఁ
బట్టాను జేపట్టి ♦ వచ్చునటుల
వెంట దళంబు లై ♦ విచ్చుకత్తులవారు
మెచ్చఁగా దులదుల ♦ వచ్చునటుల
గిలుకుపావలు మెట్టి ♦ చెలికాండ్రు వెంట రాఁ
బావురంబును బూని ♦ వచ్చునటుల
తే. గీ. బడఁతు లిరువంకఁ జెలనాకు♦మడుపు లొసఁగఁ
గొనుచు జిగిచూపులను నాదు♦మనసు గొనుచుఁ
బడకయిలు సేరఁగా శౌరి ♦ వచ్చునటులఁ
దోఁచుటే కాని మఱి యేమి ♦ దోఁచ లేదు. 108

చ. ఉరమున హారము ల్గదల ♦ నొ ట్లసియాడ రుమాలచెంగు వె
న్నొరసి నటింపఁగాఁ జెమట ♦ లూరఁగఁ గస్తురిబొట్టు జాఱఁగా
వరుసలు మీఱఁగా గళర♦వం బొఱపారఁగ మందనుండి శ్రీ
హరి నను నేలె నేను నెదు♦రానఁగ మాయగ నున్న దేమొకో. 109

చ. అరయఁగఁ బ్రాణనాయకుల ♦ నవ్వుల నివ్వలఁ బాయురామ లా
విరిశరునంపతంపరల ♦ వ్రేఁగునఁ బొర్లఁగ న్యాయ మక్కటా
హరి యిదొ నాదులోవెలి న♦హర్నిశముం గనుపట్టుచుండెడిన్
విరహ మి దేలనో మిగుల ♦ వేదనఁ బెట్టు దురాగతంబుగన్. 110

చ. వలచినవారు లేరొ యెడఁ♦బాసినవారలు లేరొ వార లీ
యలమటఁ జెందిరే మిగుల ♦ నందియు నావలె జీవయుక్త లై
నిలిచిరె యేటిమాట లివి ♦ నేరక యాడితి భూమి నుండఁగాఁ
గలిగెను శౌరితోఁ జెలిమి ♦ గంధగజేంద్రసమానగామినీ. 111

ఉ. ఎంతవిలాస మెంతసొగ ♦ సెంతవదాన్యత యెంతరాజసం
బెంతయొయార మెంతకళ ♦ యెంతగభీరత [1]యెంతసోయగం

1. యెంతయారజం [మూ].

బెంతనిరూఢ మెంతనయ ♦ మెంతమనోజ్ఞత మెంతలీవి నా
యంతటిమందభాగ్య కిఁక ♦ నంతటిచక్కనిదేవుఁ డబ్బునే. 112

సీ. నేను ముద్దులు వెట్టఁ ♦ దాను ముద్దులు వెట్టి
తెలుప నీదుఋణంబు ♦ దీరె ననును
నేను గెమ్మో వానఁ ♦ దాను గెమ్మో వాని
వెలఁదిరో విందుకు ♦ విందె యనును
నేను జెక్కిలి నొక్కఁ ♦ దాను జెక్కిలి నొక్కి
విరిబోణి వీడుకు ♦ వీడె యనును
నేను గౌఁగిటఁ జేర్పఁ ♦ దాను గౌఁగిటఁ జేర్చి
మెలఁతరో మేరకు ♦ మేర యనును

తే. గీ. [1]రతుల నే నేలఁ దా సమ♦రతుల నేలి
సారసాక్షిరో యిది మారు♦బేర మనును
చిన్ని చిన్నారివెన్నుఁడు ♦ సేయుచిన్నె
లెన్ని యె న్నని తలపోతు ♦ నేమి సేతు. 113

సీ. కెమ్మోవి యానకు ♦ గేలి సేయుదు రంటె
గజిబిజిమొనపంట ♦ గంటి సేయుఁ
గురులు ప ట్టీడ్వకు ♦ గుట్టు దక్క దటంటె
చీకాకుగాఁ దీసి ♦ చిక్కుపఱచు
జిగిగుబ్బ లంటకు ♦ సిగ్గు వోవు నటంటె
క్రొత్తనెత్తురు గ్రమ్మ ♦ గోరు లుంచుఁ
బరులు రాఁ గలరు లే ♦ వడిగ నేలు మటంటె
జాములతరబళ్లఁ ♦ బ్రేమ నేలుఁ

తే. గీ. బలుకక వ ద్దనఁ బావురా♦పలుకు పలుకుఁ
గిలకిలను నవ్వవ ద్దనఁ ♦ గేక వేయు

1. రతుల నే నేలఁగా నను ♦ రతుల నేలి. [మూ.]

వానివగ లెంచి మై నీరు ♦ గానియపుడె
రాతఁ జేసెనో చెనటివి♦ధాత నన్ను. 114

సీ. వానికన్నులతేట ♦ వానిచల్లనిమాట
వాఁ డాడుసయ్యాట ♦ వానిపాట
వానిముద్దుమొగంబు ♦ వానికంబుగళంబు
వానిత్రొమ్మెదిటంబు ♦ వానిడంబు
వానివా తెరకావి ♦ వానిపెన్నెరితావి
నిచక్కనిఠీవి ♦ వానియీవి
వానిమూఁపులపొంగు ♦ వానిమేనిమెఱుంగు
వానికొను బెడంగు ♦ వానిరంగు

తే. గీ. వానియొరతీరుచూపులు ♦ వానిసొరు
వానివలపులదొరసాము ♦ వానిగోము
వానిసేఁతలతగుమేల్మి ♦ వానితాల్మి
పరుల కెవ్వరికినిలేదు ♦ మరపు రాదు. 115

సీ. తనరఁ జూచిన దృష్టి ♦ దాఁకునో యని వాని
నునుమోము కనులారఁ♦గనఁగ నైతిఁ
గదియ నొక్కిన నేడఁ ♦ గందునో యని వాని
యధరంబు తనివార ♦ నాన నైతి
బిగిగుబ్బ లెద సోఁక♦బొగులునో యని వాని
త్రొమ్మున నిండారఁ ♦ గ్రుమ్మ నైతిఁ
దడవు చేసిన మేను ♦ బడలునో యని వానిఁ
జెలఁగి నామనసారఁ ♦ గలియ నైతి

తే. గీ. నొచ్చు నంచని చెక్కిలి ♦ నొక్కనైతి
నలుగు నని గ్రుచ్చి కౌఁగిట ♦ నలమ నైతి
నందసుతుప్రేమ సత మని ♦ నమ్మియుంటి
నిప్పు డీరీతి నడుచు నం♦చెఱుఁగ నైతి. 116

సీ. మును చల్వ లొసఁగుచు ♦ మోమోటమున నున్న
సోముఁడు సోముఁడై ♦ చురుకు చూపె
నపరశరీరుఁ డై ♦ యాత్మజుఁ డై యున్న
మారుఁడే మారుఁ డై ♦ పోర సాగె
దాక్షిణ్యశాలి యై ♦ తగుప్రాణ మై యున్న
గాలియే గాలి యై ♦ కలఁప సాఁకె
మధువు గూరుచువేళ ♦ మహిమ నపేక్షించు
సురభియే సురభి యై ♦ తరుమఁ జూచె

తే. గీ. నగ్నిశిఖ లయ్యె వివరింప ♦ నగ్ని శిఖలు
భువి శిలీముఖములు శిలీ ♦ ముఖము లయ్యె
నన్ని యట్లయ్యె నిల్లైన ♦ యపుడె యిపుడు
కృష్ణదేవునిదయ దప్పె ♦ నేమి సేతు. 117

వ. ఇ ట్లగుటంజేసి. 118

సీ. తగుకుంకుమరసంబు ♦ మగనిపేరురమునఁ
బెం పొందుకొమ్మ క ♦ ర్పించరమ్మ
పద నై నగంబురా ♦ సదయువా లైర నాని
మెసఁగురంభోరున ♦ కొసఁగరమ్మ
నూఁటినకస్తూరి ♦ గారాబుపతిపత్రిక
వెలయుమృగాక్షి కి ♦ ప్పించరమ్మ
చేర్చి కూర్చినవిరుల్ ♦ చెలికానిఁ బై కొని
పొసఁగులతాతన్వి ♦ కొసఁగరమ్మ

తే. గీ. కటకటా నేర కిటు లంటిఁ ♦ గాని ద్రోహి
యైననేఁ గూడఁగాఁ బెట్టి ♦ నట్టిదీని
నిచ్చినంతనె వారల ♦ మచ్చికలకు
హాని పుట్టదె యిప్పుడే ♦ చానలార. 119

వ. అని యనేకవిధంబుల విలపించుసమయంబున. 120

తే. గీ. హరు నుదిటికంటిమంటల♦నంటి బెదరి
త్రుళ్ళి రౌతును బడ వైచి ♦ మళ్ళి వచ్చు
తియ్యవిలుకానిసాంబ్రాణి♦తేజి యనఁగ
గగనమార్గంబునను దోఁచెఁ ♦ గలికిచిలుక. 121

కం. ఇటు లేతెంచినచిలుకను
గుటిలాలక చూచి లేచి ♦ కులుకుచుఁ జిలుకా
యిటు రమ్మ ర మ్మటంచన
దిటమున ముంజేత వ్రాలె ♦ దీనత దోఁపన్. 122

తే. గీ. అటుల ముంజేతిపై వ్రాలి♦నట్టిముద్దు
చిలుకను గురించి చిలుకల♦కొలికి పలికె
మోవి కంపింప ముక్కర♦ముత్తె మదరఁ
గప్పురపుతావి గుప్పన ♦ నుప్పతిల్ల. 123

సీ. కంటివా నాసామి♦కళలుగుల్కెడుమోము
కనులకఱవు దీర ♦ గరిమ చేర
వింటివా నాసామి ♦ వెలలేనిపలుకులు
తమకంబు దైవాఱఁ ♦ దాప మాఱ
నుంటివా నాసామి ♦ యొఱపైనముంజేతఁ
గాయంబు చెలువాఱ ♦ ఘనత మీఱ
మంటివా నాసామి ♦ మన్ననల్ గైకొని
బలుసంతసము చేర ♦ వలపులూర

తే. గీ. నంటివా తుంటవిలుదంట♦మంటమారి
తనము తొఁగగంటి వెనువెంటఁ ♦ దగిలెనంట
తొంటి నెనరంట నొంటినే ♦ నింట నుంట
జంట గూడక తాళ లే♦నంట చిలుక. 124

ఉ. దేవకిచిన్నికుఱ్ఱ వసు♦దేవునికూన యశోదపట్టి నా
దేవుని నెందుఁ గందు బల♦దేవునితమ్ముఁడు గోపగోపికా

జీవనజీవనంబు యదు♦సింహుఁడు శౌరి కిరీటిబావ శ్రీ
దేవియనుంగు సౌఖ్యనిర♦తి న్వసియింపఁగఁ గంటె కీరమా. 125

తే. గీ. ఎంతవేఁడిన బదు లాడ ♦ వేమి చిలుక
కాలగతు లెట్టు లున్నవో ♦ గడచినామె
కాఁగలది కాక మానదు ♦ గానఁ దెల్పు
చల్ల కై వచ్చి ముంత దా♦చంగ నేల. 126

తే. గీ. అనిన విని చిల్క యుల్కి పే♦రల్క చిల్కఁ
బల్కె ని ట్లని చిల్కల♦కొల్కితోడ
నన్నుదలమిన్న విను మొన్న ♦ నన్ను నీవు
వనజనాభుని దోడి తె ♦ మ్మనఁగఁ బోయి. 127

కం. తెఱవా యే మని చెప్పుదు
హరి యున్నవనంబు చేరి ♦ యటు చూతుఁ గదా
గిరికొని యున్నా రచ్చటఁ
దరుణులు కోటానకోట్లు ♦ తన్మధ్యమునన్. 128

సీ. బారను గొల్వగా ♦ మీఱువక్షమువాఁడు
తలచుట్టి వచ్చు నే♦త్రములవాఁడు
చిక్కనిపాల్గాఱు♦చెక్కులు గలవాఁడు
మెఱుఁగుచామనచాయ♦మేనివాఁడు
విడికెంపునణగింపు♦బింబాధరమ్మువాఁ
డున్న తాజానుబా♦హువులవాఁడు
చిగురాకులను గేరి ♦ నగుపాదములవాఁడు
డంబైన కంబుకం♦ఠంబువాఁడు
తే. గీ. నెమలిరెక్కతురాఁబూను♦నెరులవాఁడు
మొలకనవ్వులఁదగుముద్దు♦మొగమువాఁడు
మదనకోటులఁ గొనగోట ♦ నదుమువాఁడు
చారుతరమూర్తి గోపాల♦చక్రవర్తి. 129

తే. గీ. పూలసిగ వీడ బావిలీల్ ♦ తూలియాడ
రాజసము గూడ భూషణ ♦ రాజితోడఁ
బ్రోడలకుఁ బ్రోడ యని కొని ♦ యాడిపాడఁ
గనఁదగియెనాడఁ గన్నుల ♦ కఱవులూడ. 130

తే. గీ. మనము మాటాడ వేళ గా ♦ దనుచు నేను
దియ్యమామిడికొమ్మపైఁ ♦ గుయ్యికణగి
యుంటి దంటలమటుమాయ ♦ తంట లెఱుఁగ
సరగఁ గులుకుచు వారలు ♦ హరినిగూడి. 131

సీ. కొమ్మ యొక్కతె గబ్బి ♦ గుబ్బలు గదియించె
సఖియ యొక్కతె మోవి ♦ చప్పరించె
వనితయొక్కతె రాధ ♦ వలెనేలు మనితక్కెఁ
జెలియ యొక్కతెనిక్కి ♦ చెక్కునొక్క
రమణి యొక్కతె పావు ♦ రాపల్కులను బల్కెఁ
గలికియొక్కతెపోల ♦ యలుక చిలికె
నలివేణి యొక్కతె ♦ సొలపిముద్దులు వెట్టె
నువిద యొక్కతె పాద ♦ యుగము పట్టె

తే. గీ. ముదిత యొక్కతె చుంబనం ♦ [1]బునను బొల్చె
బాల యొక్కతె పుంభావ ♦ కేళి నిలిచెఁ
జాన యొక్కతె సమరతి ♦ సలుపఁ బిలిచెఁ
దరుణి యొక్కతె నటనబం ♦ ధనము వలచె. 132

చ. అపు డొకకుల్కులాఁడి పొల ♦ యల్కలుచిల్కుచుఁ బల్కుపల్కుకర్
గపురపుపల్కు లొల్క వగ ♦ కాఁడ బలే నిను మెచ్చఁగా వలెన్
గపటము చేసి మాచెలిని ♦ గంతునిరంతుల కొప్పగించి నీ
విపు డిటు వచ్చి నెచ్చెలుల ♦ వేడుకల న్మరుగంగఁ జెల్లునే. 133

1. బోలిజేసె. [మూ].

తే. గీ. అనుచుఁ జనుదేఁగఁ గని యిళా♦వనితచెలియ
యంచు మది నెంచి చెలులకే♦డించి దాని
గబ్బిచనుదోయి మొద నుంచి ♦ కౌఁగిలించి
పడఁతితోఁ దెల్ప వల దని ♦ పంజరించి. 134

సీ. తప్పక తనుఁ జూచి ♦ ఱెప్పవేయక వచ్చు
జలజాక్షిపై దృష్టి♦సైత మిడక
మోహోపదేశత♦మోముఁ జూపుచు వచ్చు
సకియమోమున ముద్దు♦సైత మిడక
బహుదూరమున నుండి ♦ పైఁట విచ్చుచు వచ్చు
చానగుబ్బలగోరు♦సైత మిడక
భ్రమఁ బోకముడి సగ్గి ♦ బారవైచుక వచ్చు
నాతిమేనున మేను ♦ సైత మిడక

తే. గీ. జారుశిఖపీడ తెలిముత్తె♦సరము లాడ
నందియలు పల్కఁ బఱచె ఘ ♦ ర్మాంబు లొలుక
నదరు మదినాటి యిళ నెంచి ♦ యదుకిరీటి
[1]పదక మెద మీఱ బాగారు♦పటము జాఱ. 135

మ. ఇటు లేతెంచినశౌరిరాకఁ గని య♦య్యేణాక్షి మోహంబుచే
నటు చన్గుబ్బలు లుబ్బఁ గన్ను బెళుకన్ ♦ హారాళు లల్లాడ నా
మటుమాయు ల్గలశౌరిఁ జేరి పులకల్ ♦ మైఁ గ్రమ్మఁగాఁ గ్రుచ్చి కౌఁ
గిట శయ్యాగృహమందుఁ జేర్చి మదన♦క్రీడాభిలాషం దగన్. 136

కం. అప్పుడు వారలవెంటనె
చొప్పెఱుఁగఁగనీక నందుఁ ♦ జొరఁబడి యొక హా
న్మెప్పులకీల్బొమ్మకడన్
దప్పక కనుచుంటి వారి♦తటమట లెల్లన్. 137

1. వెడలె నెదయందు మదనుఁడు ♦ విరియఁబాఱ. [మూ.]

సీ. పన్నీరుమేరువల్ ♦ బాగాలతట్టలు
　　　　కలపంపుగిన్నెలు ♦ గందపొడులు
ముడిపూలపొట్లముల్ ♦ పునుఁగుకరాటముల్
　　　　జవ్వాదిబరిణె లా♦తూరసంబు
పొమ్ముల పెట్టెలు ♦ పొరిది యత్తరుబుడ్లు
　　　　కుంకుమపింగాండ్లు ♦ కుసుమధృతులు
కపురంపుక్రోవులు ♦ కస్తూరివీణెలు
　　　　కట్టువర్గంబులు ♦ చుట్టుఁ దనరు
తే. గీ. చలువచప్పరకోళ్లమం♦చంబులోనఁ
　　జెంపబిళ్ళలతలగడల్ ♦ చిన్నిదిండ్లు
　　బటువులొఱగులుఁ గలపూల♦పాన్పుమీఁదఁ
　　దమకమున నిళామాధవుల్ ♦తగ వసించి. 138

సీ. కంసారి బిగియారఁ ♦ గౌఁగిటఁ జేర్చిన
　　　　గుబ్బలకసి దీరఁ ♦ గ్రుమ్మెఁ గొమ్మ
కంజాక్షుఁ డాని చి♦క్కనిముద్దువెట్టిన
　　　　నలరుచక్కనిమోవి♦యానెఁ జాన
యతనునికన్నయ్య ♦ యచ్చోటఁ జెనకినఁ
　　　　దేటచెక్కిలి గోట♦మీటె బోటి
మందరనగధారి♦మణితముల్ నించినఁ
　　　　జిగురుమకారముల్ ♦ చిలికెఁ గలికి
తే. గీ. కృష్ణదేవుఁడు కరికర♦క్రీడ సలుపఁ
　　జేరి తమి రేచి పురికొల్పెఁ ♦ గీరవాణి
　　నీలవర్ణుఁడు పైకొని ♦ క్రీడ నేల
　　బాళి నెదురొత్తు లిచ్చె ని♦ళాలతాంగి. 139

సీ. కిలకిలనవ్వులు ♦ గిలిగింతలును బంధ
　　　　భేదపురవములు ♦ వింతవగలు

పావురాపలుకులు ♦ వాతెరనొక్కులు
చిగురుమకారముల్ ♦ జిలుగుతిట్లు
దురుసుపైసరములు ♦ తొందరముద్దులు
బిగికౌఁగిలింతలు ♦ బింకములును
గొనగోటిమీటులు ♦ గోరింపు లుబుకులు
కొసరులు బొమముళ్ళు ♦ కురుచసన్న

తే. గీ. లౌర శాబాసు మేలు బ♦ళారె బాగు
హాయి తడబడ కెడ గాకు ♦ మాయెనాయె
విడకు విడువకు మనియెడి♦ నుడువు లపుడు
చెల్లవో యేమి చెప్పుదుఁ ♦ గొల్లకొల్ల. 140

తే. గీ. వెలఁది యీరీతి వేవేల♦వితము లమరఁ
గలిసి కసివోక నీలమే♦ఘుంబుమీఁద
నెరితళుక్కనుక్రొక్కారు♦మెరు పనంగ
సరసిజాక్షునిపై వేగఁ ♦ జౌకళించె. 141

సీ. వడిగండ్లగమిగుంపు♦వర్షించుఘనమనఁ
గుసుమముల్ గురియుకీ♦లొ్క్కప్పు మెరయ
హిమబిందుసిక్తమై♦యింపొందుతమ్మినాఁ
జెమట గ్రమ్మినమేను♦చెలువు మీఱఁ
జిలుక నొక్కినబింబ♦ఫలరాజమో యన
మొనపంటిగంటికె♦మ్మోవి దనర
డాగువేసినబల్క♦డానికుండలరీతిఁ
గొనగోటిమీటుల ♦ గుబ్బ లలర

తే. గీ. మారసంగ్రామగంభీర ♦ భేరిదారి
రవలబంగారుటందెల♦రవ మెసంగఁ
దరుణి పొదలుచుఁ బురుషాయి♦తంబు సలిపె
ముద్దులమురారిపై లకు♦ముకి యనంగ 142

చ. తసుకులు మూల్గు లగ్గలికె♦తాఁకులు సోఁకులు తోపు లూపులుఙ్
కొసరులు మెప్పులుఙ్ వగలు ♦ గుల్కులు బెళ్కులు కూర్మిపల్కులుఙ్
వెసఁ జిఱుసన్నలుఙ్ వలపు♦నిక్కులు తక్కులు సొక్కుమ్రొక్కులుఙ్
గుసగుసమాటలు న్నడిచెఁ ♦ గూరిమి నిద్దఱికి న్సమంబుగన్. 143

కం. నానావిభవాకర మై
మానససంజాతజాత♦మహిమార్ణవ మై
కానుకతర మై యాసుఖ
మానందోబ్రహ్మ మైన ♦ హరి మైమఱచెన్. 144

గుణితమత్తేభవిక్రీడితవృత్తము.

తరుణీమన్మథ తామసాంతతిమిరో♦ద్యచ్ఛాయ తీర్థాంఘ్రిపు
ష్కరమా తూర్ణగవైనతేయహయ తే♦జస్సూర్యతైక్ష్ణ్యోజ్జ్వల
ద్వరచక్రాయుధ తోయజాతనయనా ♦ తౌషారశుభ్రప్రభా
కరకీర్తిప్రద తంద్రికేతరచిరా♦ఖ్యా తస్కరాగ్రేసరా. 145

కవిరాజవిరాజితము.

వృజినవిదారణకారణ దారుణ♦వీర్యగుణాగుణవిత్ప్రతిభా
విజయవిసృత్వరజిత్వరసత్వర♦వీర పరాత్పరవిప్రసభా
నిజపదసేవనపావనభావన♦నీలఘనాఘననిర్మలభా
స్వజనకృతాదర మోదరసాదర♦సర్వధరాధరసారశుభా. 146

కం. అంభోధిపటీభారవి
జృంభణసకలాద్రికులవి♦శృంఖలదళహృ
జ్జంభారితనయసారథి
గాంభీర్యౌదార్యవిజిత♦కలశాంబునిధీ. 147

గ ద్య ము .

ఇది శ్రీచిన్నికృష్ణకరుణాకటాక్షవీక్షణక్షణప్రవర్ధమానానూనశృంగారరసప్ర
ధానసంగీతసాహిత్యభరతశాస్త్రాదివిద్యాపారంగత శ్రీమత్తిరుమల
తాతయాచార్యపాదారవిందమిళిందాయమానమానసచోళ
సింహాసనాధ్యక్ష ప్రతాపసింహమహారాజ బహూ
కృతానేకచామీకరాంబరాభరణ ముత్యా
లుగర్భశుక్తిముక్తాయమానముద్దు
పళనిప్రణీతంబైనరాధికా
సాంత్వనం బనుశృంగార
ప్రబంధంబునందు
ద్వితీయా
శ్వాసము.

శ్రీరస్తు.

(ఇళాదేవీయ మనునామాంతరముగల)

# రాధికాసాంత్వనము.

## తృతీయాశ్వాసము.

శ్రీ మహిళాప్రియనాయక
సామజరాజాపవర్గసంధాయక భ
క్తామితకామితదాయక
భూమీప్రియ చిన్నికృష్ణ పోషితకృష్ణా. 1

తే. గీ. అవధరింపుము దేవ దివ్యానుభావ
వ్యాసమునిసూతి జనకభూవిభుని జూచి
చొక్కటపుజీనిచక్కెర యుక్కెరలకు
లెక్కయై మించునుడిచవు లెక్కఁ బలికె. 2

చ. అపుడు చెలంగి పొంగి యిళ హామికతో విడివడ్డరైకతోఁ
గపురపుతావివీడియము ఘుమ్మని క్రమ్మముఖాంబుజంబుతో
గపురపుటారజంబుగమకంబు నయంబు భయంబుఁ జూపుచున్
విపులతరస్తనాగ్రముల వెన్నునిబొమ్మునఁ గ్రుమ్మి నెమ్మితోన్. 3

చ. పరవశుఁ డైనశౌరిఁ గని ♦ పంకజలోచన రాధికామణిం
దొరఁగు మటంచు వేఁడుకొనెఁ ♦ ద్రోయక మాధవుఁ డిచ్చె నమ్మికల్
పురుషుల కేటిసత్యములు ♦ పూని కె లేదవి నమ్మి కేది నీ
మరు లిటు కొండ లై పెరుగు♦మాత్రమె కాని కురంగలోచనా. 4

వ. అనిన విని ఘనాఘనఘనిస్వనంబువిన్న చిన్నిరాయంచచందంబున గబ్బిబెబ్బులిమ్రోఁతలాకర్ణించినకన్నెసారంగంబు తెఱంగున బిడాలఘోషం బాలకించిన బాలశుకంబురకంబున సింహనాదం బాలకించి బెగడినపెంటియేనుంగుతెఱంగున బెగ్గడిల్లి యాపాదమస్తకంబునుం జల్లు మని పులకలు మొలక లెత్త గుండె గభీ లన వకావక లై తల్లడిల్ల డిల్ల వడి యారామకారునిచే ఖండితం బయినకదళీకాకాండంబుచందంబున నందనందనునిపైఁ జెందినవలపు నిలుపోపం జాలక చాల కరంగి జాలిమాలి నేలవ్రాలి మూర్ఛిల్లిన న్గనుంగొని చెంగట మెలంగుమెఱుంగుబోణు లెలుంగుదిగులున నమ్మికచెల్ల యీహల్లకపాణి నింక నమ్మఁగఁ జెల్లదను నుల్లసంబున నుల్లసిల్లుచు నవ్వల్లవపల్లవాధర నెత్తి యొత్తుపయ్యెదచెఱంగులస్వేదబిందుసందోహంబులం బోనొత్తి చల్లనిపటీరనీరపూరంబు చల్లి నల్లకల్వ రేకులు తుదల నల్లిబిల్లిగాఁ గనుపట్టువట్టివేళ్లవీవనలు విసరి కెందమ్మిదళంబులం గట్టినకపురంపుపొట్లమ్ములం గర్ణంబులం గీలించి శైత్యోపచారంబుల సేద దేర్చఁ బెద్దయుం బ్రొద్దునకు ముకుళితంబు లగుకనుదమ్ములు విచ్చి పదాహతిఁ బొరలునురగాంగనభంగి బుసగొట్టుచుఁ గటితటంబు లుబుక ముక్కుఁపుటము లదర రాకానిశాకరబింబంబుడంబును విడంబించునెమ్మొగంబు జేవురింపఁ బ్రచండమారుతతండంబునం జవిలి వడంకుకెందలి రాకుపీఁక బింబాధరంబు కంపింప మరుఁ పురువడి నొర వెరికి విరహులయురంబులు దూసి పోవం గ్రుమ్మి తదీయరక్తంబులంటఁదీసి ధళధళఝళిపించుతళుకుకత్తుల జిత్తులం బెట్టుచుఁ గ్రొత్తలతుక చొత్తిలమత్తిల్లుబిత్తరపుఁజూపులు కడకన్నులం గ్రుమ్మరింప డగ్గరి హెగ్గడికత్తియలు బెగ్గడిల్లి యవల నివలఁదొలంగి నిలువ సాకారం బగుశోకంబురీతి సాక్షాత్కరించినకోపంబుభాతి సశరీరం

బగుబడలికకై వడిం గనుపట్టుచుఁ గలికిచిలుకం దిలకించి [1]క్రోధమూర్ఛితయై కొంతతడవు వూరకుండి వెండియుఁ దెలివి దెచ్చుకొని బెట్టునిట్టూర్పులు నిగుడించి గద్గదస్వరంబున ని ట్లనియె. 5

శా. ఏమేమీ వెర పింత లేకయె యిళా♦హేమాంగి యి ట్లాడె నే
యామాట ల్విని మంచి దం చనియెనే ♦ యాధూర్తగోపాలుఁడుర్వీ
రామా యట్లనె కాని మంచిపని [2]రా♦రాపేల యేమాయె నా
భామారత్నము గూడి తా సుఖము మై ♦ వర్ధిల్లినం జాలదే. 6

సీ. మఱచెనో నాచేతి♦మణితంబు లన్నియుఁ
బలుకనేర్చిననాఁటి♦పంజరింపు
తెలియదో నాచేతి♦దేశ్యంపుగుజరాతి
విత మెఱింగిననాఁటి♦వేఁడుకోళ్లు
ఎంచదో నాచేత ♦ నిల జంత్రగాత్రంబు
లభ్యసించిననాఁటి♦యణకులెల్ల
వేఁడదో నాచేత ♦ వెడవిల్తుశాస్త్రంబు
లెఱుఁగఁబూనిననాఁటి♦తిరుగుమరుగు

తే. గీ. గణన సేయదొ మరుసాము ♦ గమనములకుఁ
దాను నాచేతఁబడినబె♦త్తంపు పెట్లు
పరులు గని కేరి నవ్వ ద♦బ్బర మురారి
లాలనకె పొంగి యిప్ప డి♦ళాలతాంగి. 7

తే. గీ. నిన్నఁగుప్పయు నేఁడాళ్లు ♦ నెలఁత తాను
గోరి నామీఁదఁ జేసెనే♦కారుబారు
ముక్కుపచ్చలు మానక ♦ మునుపె బిరుదు
పిచ్చుక యెదిర్చి కాట్లాడ ♦ వచ్చినటుల. 8

తే. గీ. వెనుకఁ గొప్పను ముందఱఁ♦జనులు గేలి
సేయనాయెను నాచెంతఁ♦జేయు వింత

1. క్రోధాతురచిత్తయై [మూ.] 2. పేఁ♦లాయెన్ మఱేమాయె [మూ.]

తాను బెంచినపొట్టేలు ♦ తనదుచేన
సన్నఁబడుసామ్య మాయెనో ♦ చిన్నిచిలుక. 9

తే. గీ. తనదుమ ట్టెంత తా నెంత ♦ తానె యింత
చేయఁజూచిన నే నెంత ♦ సేయరాదు
వేలు వాచిన ఱోలంత♦విరివి యైన
ఱోలు వాచిన నది యెంత ♦ భోలు గాదు ? 10

తే. గీ. వారిజాక్షుని నాపగ♦వారివెంట
ననుప గోరంత యైనను ♦ మనసు లేదు
నందుఁడనుపఁగఁ గని మన♦మందునందు
కొంటి తడ సేయరా దని ♦ యుంటిఁ గాని. 11

ఆ. వె. కుట్టఁ దేలు కుట్ట ♦ కున్నఁ గుమ్మరబూచి
తోసిరా జటంచుఁ ♦ జేసి చెలియ
దానివేలు దీసి ♦ దానికే పొడిచిన
యటులఁ జేయ కున్న ♦ నగునె చిలుక. 12

ఆ. వె. తగరు కొండమీఁదఁ ♦ దాఁకఁ గోరినదారి
నెదురు దన్నఁదెలియ ♦ కింత పలికె
నెంతమీను వచ్చి ♦ యెంతమీనును మ్రింగెఁ
గానఁ ద్రుళ్ళునెద్దె ♦ గంత మోయు. 13

సీ. ఆశుకవిత్వంబు ♦ లల్లితేనే సరా
చిత్రప్రబంధము ♦ ల్సేయ వలదె
గోటిచేతను వీణె ♦ మీటితేనే సరా
కొంచక రా ల్గరఁ♦గించ వలదె
పదచాళిరాగము ♦ ల్పాడితేనే సరా
హిత వొప్ప వర్ణంబు ♦ లెత్త వలదె
అలనాట్యభేదమ్ము ♦ లాడితేనే సరా
నవరసంబుల నంటి ♦ నడువ వలదె

తే. గీ. వింతవింతగఁ గలసిన • యంత సరియె
యెమ్మెకానిమనోభావ • మెఱుఁగ వలదె
యేమినేరని నిన్నటి • యింతమొటికె
నన్ను విడనాడనా కోరెఁ • జిన్నిచిలుక. 14

తే. గీ. కాని పదరకు మిఁకమీఁద • దానిమోము
గనఁగ వల దని శౌరిని • గట్టిపెట్టి
బింకములు కూల నరకాలఁ • బెట్టి నేల
రాచ కున్నను నాపేరు • రాధ గాదు. 15

కం. అన విని శుక మి ట్లనియెను
వనితా యేమందు దాని • వగలో త్రుళ్లో
మినుకో తెలివో గలివో
విను వెన్నకుఁ బండ్లు వచ్చు • విత మాయెఁ గదే. 16

తే. గీ. చూపులోపల నొకవింత • చూపుతళుకు
నడుములోపల నొకవింత • నడుముబెళుకు
నుండు నునికికి నొకవింత • నుండుకులుకు
వచ్చెఁగదవమ్మ మనయిళా • వనిత కిపుడు. 17

తే. గీ. లేనిపట్టింపు లెల్లను • బూని చాన
నేనె యెదు రైన నిం తైనఁ • గాని చూడ
దల్పునకుఁ గల్మి వచ్చిన • నర్ధరాత్రి
గొడుగు తె మ్మన్నకత గాను • కోమలాంగి. 18

తే. గీ. పడఁతి మును దెల్పనా పదిం • బదిగ నేను
దాని వినయంపుపోకిళ్లు • తగ నెఱింగి
మానిసిని జేయ వలదమ్మ • దీనిఁ జేర్చి
తెలియ నిది మేకవన్నియ • పులి యటంచు. 19

వ. అనిన మధురవాణి యనుమధుపవేణి యవ్వీరిబోఁణి నవలోకించి
యి ట్లనియె. 20

కం. [1]నిన్నెఱుఁగదు తన్నెఱుఁగదు
తన్నుం దనమ ట్టెఱుంగు ♦ దామోదరుఁడే
[2]తన్నుండె నిన్ను విడుచు న
[3]టన్న న్మఱి దీని నగరె ♦ హాహా జనముల్. 21

కం. నిన్నుండే మానిని యై
నిన్నే వెలి సేయఁ బూనె ♦ నెలఁత భళారే
కొన్నంగడిలోపలనే
యన్నన్నా మాఱుబేర ♦ మగునే చెలియా. 22

ఆ. వె. ఈఁక తోఁక లేని ♦ శ్రీకృష్ణుమాటలు
పొలఁతి నమ్మి నానఁ ♦ బోసికొనియెఁ
దగిలెనా తగులును ♦ దప్పెనా తప్పును
నాతి వెట్టివాని ♦ చేతిరాయి. 23

తే. గీ. కుమ్మరికిఁ జూడ నొకయేఁడు ♦ గుదియ కొక్క
పెట్టటన్నట్టు దీనియె ♦ బ్బెట్టుతనము
తెల్ల నిదె తీరు నొకసారి ♦ యిటకు శౌరి
వచ్చి నిన్నేల, నిందుకు ♦ వగవనేల. 24

వ. అనిన విని రాధావధూరత్నం బి ట్లనియె. 25

తే. గీ. కోటిమదనులఁగడవ్రేలి ♦ గోట గెలుచు
సుందరాకృతితోడ నా ♦ నంద మిచ్చు
దివ్యసుందరగోపాల ♦ దేవుఁ జూచి
వసుధలోపల వలవని ♦ వారు గలరె. 26

తే. గీ. దాని నెంతయు నన నేల ♦ తలఁచి చూడఁ
దప్పుతంటలకొఱగాని ♦ దానవారి

1. నిన్నెఱుఁగు నెదిరి నెఱుఁగును. [మూ]. 2. తన్నుంచి విడుచు నిన్నని. [మూ].
3. యన్న. [మూ].

ననవలెను గాని తెగ నిండ♦దొనకుఁ దీసి
యేయువాఁ డేయ న మ్మేమి♦సేయుఁ జిలుక. 27

ఆ. వె. నందసుతుఁడు మున్ను ♦ నామీఁది ప్రేమచే
నొకటి సేయఁబోయి ♦ యొకటి సేయు
[1]అత్త నెత్తిఁ జేతు ♦ లంగడిలోఁ గన్ను
లాయె ననుచుఁ జెలియ ♦ లరసి నవ్వ. 28

వ. అని మఱియు నారాధావధూటి తనచేటీరత్నంబున కిట్లనియె. 29

ఆ. వె. తగులుదాఁక మేళ ♦ మగపడ్డఁ దాళముల్
గాఁగఁ జేసినట్టి♦కాంత వింత
గట్టు చేరినంతఁ ♦ బుట్టివానికి బొమ్మ
గట్టు సామ్య మాయెఁ ♦ గదవె చెలియ. 30

సీ. కీరవాణులచేతఁ ♦ గీళ్ళాకు లంపితే
శిరసావహించు నో ♦ సరసిజాక్షి
నాతి యెవ్వతె యైన ♦ నామేర వేఁడితే
కను లెఱ్ఱఁ జేయు నో ♦ కంబుకంఠి
యెలమి నాకోసర ♦ మెంతవారల నైనఁ
బగనాడఁ దలఁచు నో ♦ చిగురుఁబోఁడి
యేఁ జూచి చూడక ♦ యేమాటఁ జెప్పిన
జవదాఁట వెఱచునో ♦ సన్నుతాంగి

తే. గీ. యేపదార్థంబు లైన నా♦యెదుటఁ బెట్ట
కెవరికి నొసంగఁబోవఁ డో ♦ యిందువదన
చేరి యటు లున్నవిభుఁ డిట్లు ♦ చేసె నేని
తిరుగ బ్రతుకాడవలెనఁటే ♦ శరదవేణి. 31

1. అత్త మీఁదఁ గన్ను ♦ లంగడిలోఁ జేతు. [మూ].

కం. మున్నింతో చను వొప్పఁగ
మన్నించినవిభుఁడు వెనుక ♦ మార్గ్మగ మైనఁ
గన్నియ బలిమిని వేడుక
విన్నదనం బదియె కాదె ♦ విధుబింబాస్యా. 32

సీ. మేను మే నానిన ♦ మేను సోఁక దటంచుఁ
గలపంబు లొల్లఁ డో♦కలువకంటి
పరులు వచ్చిన రిత్త♦పలుక నయ్యా నని
తెర యెత్త నియ్యఁ డో♦శరదవేణి
అలమి కౌఁగిటఁ జేర్ప ♦ నడ్డ మయ్యా నని
హారంబు లొల్లఁ డో♦హంసగమన
గాసిల్లి నాతోడల్ ♦ కండె లయ్యా నని
పుంభావ మొల్లఁ డో♦పువ్వుఁబోఁడి
తే. గీ. మణిగుణంబులదారిని ♦ నసఁగి పెనఁగి
కుసుమగంధంబులట్టులఁ ♦ గూడి మాడి
చెలఁగి తిలతైలములరీతిఁ ♦ గలసి మెలసి
యున్నవిభుఁ డెట్లు చేసెనో♦సన్నుతాంగి. 33

కం. అల్లునిమంచితనంబును
గొల్లనిరసికతయు లేదు ♦ కోరితి నీరెం
డల్లనె చూచియుఁ గనియును
బల్లములోఁ బడినదాని♦భంగిని జెలియా. 34

కం. నెరతన ముడి గింటింటికిఁ
దిరుగుచు బతిమాలు హారికిఁ ♦ దెలివలు కలవా
తిరిపెం బెత్తెడువానికిఁ
బెరుగుంగూ డేమిబ్రాఁతి ♦ విధుబింబముఖీ. 35

కం. కలలోనైనను బాయక
కలకాలము నున్నవిభుఁడె ♦ కపుగాయకు నై

పలచన చేసె నటన్నం
జెలియా మగవారిచనవు ♦ చెడ్డది సుమ్మా. 36

కం. అనువనజాక్షిని గని తాఁ
గనికరమునఁ బలుక పలికెఁ ♦ గానీ వమ్మా
వనజాక్షువింత లెఱుఁగవె
కని తెల్పిన భాఁతంబు♦కత లై పెరుఁగున్. 37

సీ. కొనవాల్కఁ గొని దాని♦ననమోవి చెనకితే
కసుగందునో యంచుఁ ♦ గలవరించు
మొనవేళ్ళమెలమెల్లఁ♦జనుమొనల్ నిమిరితే
తగిలి నొచ్చునో యంచుఁ♦దత్తరించు
వదన మించుక నాభి♦పై మోపి ముద్దాడి
బరువాయెనో యంచుఁ ♦ బలవరించు
గోటిచేఁ గప్పముం♦గురులు చిక్కడలించి
చురుకునేమో యంచుఁ ♦ బరితపించు

తే. గీ. జాజిపూఁదేనె గొనుతేఁటి♦జాడ నమరి
తాను రతి చేసి దాని పా♦దమ్ము లొత్తు
వలచువారును వలపించు♦వారు లేరో
వార లీబూఁమె లొనరింప ♦ లేరు గాని. 38

తే. గీ. దొరకరానిపదార్థంబు ♦ దొరకి నటుల
బొమ్మనని కాని డించఁ డే♦యిమ్ము నైనఁ
బెట్టుచోటను బెట్టక ♦ వెలఁది నిపుడె
కట్టి కాచుక యున్నాఁడు ♦ కదలనియఁడు. 39

సీ. కనకాంగికట్టువ♦ర్గమె వల్లెవా టాయెఁ
గొమ్మపావడ చుట్టు♦కొనుట కాయె
నలివేణినెమ్మోము ♦ నిలువుటద్దం బాయెఁ
జెలిగోటిలత్తుక ♦ తిలక మాయెఁ

దరుణిలేనునుతోడ • త్తలగడదిం డ్లాయె
వెలఁదిగుబ్బలు చెంప•బిళ్ళ లాయె
లలితాంగిచెమ్మట • ల్చలువపన్నీ రాయెఁ
గలికిమేను నలుంగు•కలప మాయె

తే. గీ. బోటి పడకిల్లు జిగికొల్వు•కూట మాయె
లోలలోచనతోడిదే • లోక మాయెఁ
బలుకు లేటికి నిపు డిళా•భామనుండి
యచట శౌరికి దొరతన • మమరె నమ్మ. 40

తే. గీ. మగువ యదిగాక యిఁకనొక్క•మాటగలదు
వినుము వలపులదొరసాని • యనెడు పేరు
దాని కిచ్చెను నిఁబిల్వఁ•బో నటంచు
నెటుల నో రాజనో శౌరి • కెఱుఁగనమ్మ. 41

తే. గీ. రాధలోనను నాలోన • రమణి యెవతె
తెలుపుమాయంచు నానతోఁ • బలుకనాతఁ
డన్నిటను మీర లొక్కరూ•పైనఁగాని
మురిపెమున నీవె హెచ్చనె•మోహనాంగి. 42

వ. అనిన విని రాధావధూరత్నం బి ట్లనియె. 43

ఉ. ఎల్లజగంబుల న్మనుచు•నేలిక కంజభవాదిమౌనిహృ
త్ఫుల్లసరోజరాజములఁ • బూని వెలింగెడితేజ మిందిరా
హల్లకపాణిబాహువుల • కబ్బనిదివ్యసుఖంబు చిత్ర మీ
వల్లవకామినీచగణ•వారిజసేవకు లెస్సఁ జిక్కెఁగా. 44

తే. గీ. వారి వీరిని నన నేల • వీరి వారిఁ
గలగలపు చేయున న్నన • వలయుఁగాక
తెఱఁగెఱుంగక యపు డట్టు • దిమ్మగొంటి
తలఁపఁ దననుండిరానట్టి•తప్పు గలదె. 45

తే. గీ. ఎల్లవారికి శకునంబు ♦ లెల్లఁ బలికి
బల్లి తాఁ బోయి తొట్టిలోఁ ♦ బడినరీతి
నొకరి ననలేల తాఁ జేసి♦కొనినపనికి
వెనుకఁ జింతించు టెల్లను ♦ వెఱ్ఱితనము. 46

ఆ. వె. హద్దుముద్దుమీఱి ♦ యాఁడుది మగఁ డంచుఁ
గూడి మాడి యాడఁ ♦ జూడఁ దలఁచి
బలిమి విందుఁ బెట్టి ♦ పగ గొన్నచందానఁ
బెండ్లి చేసి నేనె ♦ బేల నైతి. 47

ఆ. వె. నక్క యురులలోనఁ ♦ జిక్కుకొన్నవితానఁ
గోరి మనము చేసి♦కొన్నపనికిఁ
బేగులోనితీఁట♦వెత మాయె ననఁగ రా
దత్తకొంగు తొలఁగి♦నటులఁ జిలుక. 48

చ. కరి తరుమంగ వాఁడి గల♦కంటకము ల్వని మేనఁ గాడఁగా
సరి పడఁ బోవఁ బాము గని ♦ జాలిన మధ్యమసీమ నెల్క వే
కొఱికెడువేరు పట్టి చుఱు♦కుల్ తగఁ గందురుటేఁగ లెల్లెడం
గరువఁగఁ దేనెఁ గ్రోలఁ జను♦కామినితో సరి యైతిఁ గీరమా. 49

తే. గీ. నీవు పోయినపనికి రా♦నీవు కొదవ
పట్టి పల్లార్చి దేవకి♦పట్టినిటకుఁ
దోడుకొని వత్తు వనుచు నీ♦తోడుచిలుక
నెమ్మి కన నెమ్మనమ్మున ♦ నమ్మియుంటి. 50

తే. గీ. దాని వెలి చేసి శౌరి నె♦ల్లైనఁ గాని
తోడితెచ్చునుపాయంబు ♦ దోఁచ లేదా
తోఁచ కాడితి నీ కేల♦తోఁచ నిచ్చు
ముందుపడ నాదుతలవ్రాఁత♦ముద్దుచిలుక. 51

వ. అనిన విని బెట్టులికి చిలుక యక్కలికించితవతీతిలకంబుం దిలకించి యీబాల యింతబేల యగునే యని బెట్టునిట్టూర్పు నిగుడించి యి ట్లనియె. 52

సీ. చిక్కనికౌఁగిళ్ళఁ • జిక్కి మై మఱచుచు
ఓమ్మ ఓమ్మన నాని • రోఁజుకొనుచు
నొక్కరికెమ్మోవి • యొక్కరు మార్చుచుఁ
గలగల్పుమణితము • ల్పలుకుకొనుచు
నెదురయ్యలల నెక్కి • యెలనాగయును దాను
జిగినోటిముసుపులు • చేకొనుచును
గళ లీనుచెక్కుల • నెలవంక లీనఁగాఁ
దిలకము ల్కానగోళ్ళ • దిద్దుకొనుచు

తే. గీ. నచట వేసిన తెర వేసి•నట్టులుండ
సరిగచౌశీతిబంధము • ల్సలుపుకొనుచుఁ
జెలఁగు వనమాలిఁ జేరితి • సిగ్గువాలి
వరుస నెటు తోడితెత్తు నో•వన్నెలాఁడి. 53

కం. తల కెక్కినవలపున హరి
యలయిళ దాసానుదాసుఁ • డై మెలఁగంగాఁ
గలవె యిఁక నేటియాసలు
కలి పోసినవెనుక నుట్టి • కనుఁగొనువాడ్కన్. 54

వ. అనిన విని మనస్సునఁ బట్ట రానికినుక పొడమినంత. 55

చ. అదరెడుమోవి తొట్రుపడు•యానముఁ గుచ్చెల జాఱుపైఁటయున్
జెదరినముంగురుల్ మిగులఁ • జింతిలుచిత్తము వాడుమోము లోఁ
బొదలెడివాంఛ గద్గదిక • మోసుపకనుంగవ మీఱ మారుచే
బెదరుచు లేచి యామెలఁత • వెన్నునిపైఁ దగుమచ్చరంబునన్. 56

సీ జడ వేగ వదలించి • ముడిపూలు విదలించి
యలజడిఁ గీల్గంటు • నందగించి
కలసొమ్ము లెడలించి • వలయము ల్చిట్లించి
నుదుటఁ గస్తూరిబొట్టు • కదియ నుంచి

కాటుక సమయించి ♦ కలపము త్రైమలించి
సరసవాసనకట్టు ♦ సంఘటించి
దుగరైక తొలగించి ♦ జిగిచల్వ నటు డించి
మాసినచీర స♦మ్మతి ధరించి

తే. గీ. [1]వెతల మితి మీఱి వేసారి ♦ విధిని దూఱి
యలమటలఁ దారి జీవపు♦టాస లాఱి
పడకయిలు చేరి కంకటి♦పైని జేరి
పొరలె మరు లూరి చిలువరా♦పొలఁతిదారి. 57

చ. పొరలును గొట్టుకొను వెతఁ ♦ బొందును హా యనుఁ జింత నొందు ని
వ్వెఱపడు వాడు లోఁ గుములు ♦ వెట్టిగఁ ద్రేలు విరాళిఁ జెందు బల్
సొరుగును సొమ్మసిల్లు మదిఁ ♦ జొక్కు వితాకవు మూరు దూఱు నా
తరుణిని గేరు మారుకొను ♦ తఱ్ హరి దూఱును బెట్టు మూర్ఛిలున్.

చ. ఉలుకును వెచ్చ నూర్పుఁ గదు ♦ నుస్సురనుం దల యూఁచు లేచు లోఁ
గలగఁబడున్ దిగుల్పడును ♦ గానిపను ల్తలపోయు వేసరుం
గలవల మందుఁ గన్గొను వి♦కావిక నవ్వు భయంబుఁ జెందుఁ గ
న్గొలఁకుల నీరు నించు మదిఁ ♦ గొంకుఁ దలంకు వడంకు నెంతయున్.

ఉ. రా యను వింత పుట్టినది ♦ రా యనుఁ జూతువు గాని వేడ్క లే
రా యను మేలువార్త విను♦రా యను నావల పింత చేసె నా
రాయను నిన్ను దూఱ నగ♦రా యను నంతియె కాదు కాని పో
రా యను దానిపొందె కన♦రా యను హా యదు శేఖరా యనున్. 60

సీ. ఏమెడ నాఱొమ్ముఁ ♦ బాయనిపీణ నే
పాటలాధర గోట ♦ మీటునొక్కొ
నామాట మీఱక ♦ నలు వొందుకీర మే
నెలఁతముంజేతిపై ♦ నిలుచునొక్కొ

1. మొదను తమి. [మూ].

యెలమి నాకనుసన్న ♦ మెలఁగునేణాక్షు లే
నలినాక్షియాజ్ఞల ♦ నడుతురొక్కొ
నామొగంబున కొద్ది♦కై మీఱునద్ద మే
సుందరీరత్నంబు ♦ చూచునొక్కొ

తే. గీ. తూఁగుటుయ్యల నెవ్వతె ♦ తూఁగునొక్కొ
పెట్టెసొమ్ముల నెవ్వతె♦ పెట్టునొక్కొ
పొందుగా శౌరి నెవ్వతె ♦ పొందునొక్కొ
తెలియ దిటుమీఁదఁ బ్రాణము ♦ ల్నిలుప రాదు. 61

ఉ. అందఱిబొమ్మరా ళ్ళుడిగె ♦ నందఱినెమ్మది చల్లనయ్యె నే
డందఱినెమ్మొగంబులును ♦ హాసములం జెలు వొందె నౌర గో
విందుఁడు దానిఁ గూడి నను ♦ వింత యొనర్చినయంత నక్కటా
కందక కంద నేమి కల♦కాలము నాదుమనంబుమాత్రమున్. 62

సీ. హరిని బాసిననన్నుఁ ♦ బరిహాస మొనరించు
మోహనాంగులనోరు ♦ మూసినటుల
నానాఁటఁ గృశియించు♦ననుఁ జూచి కనుఁగీటు
పువ్వుబోణులకన్ను ♦ పొడిచినటులఁ
గడువిన్న నగునన్నుఁ ♦ గని సంతసం బందు
మెలఁతలబొమ్మలు ♦ మెట్టినటుల
నెంచి సన్నిఁక త్రుళ్ళు ♦ నంచని తల లూఁచు
ముద్దుగుమ్మలతలల్ ♦ మొట్టినటుల

తే. గీ. యదువిభుని జేరి సామి ర♦మ్మనుచుఁ జీరి
గెలివి యొనగూర్చి నిండుకౌఁ♦గిటను జేర్చి
మురిపెమునఁ దొట్టి చిక్కని♦ముద్దు వెట్టి
మేలిమిని గూడఁ గలదె యీ♦మేనితోడ. 63

కం. అని మిగుల వగలఁ బొగులుచుఁ
దనపలుకుల కొద్ది కగుచుఁ ♦ దగునాచిల్కకున్

గనుగొని వనరుచు రాధా
వనజేక్షణ పలికె వలపు ♦ వడ్డికిఁ బాఱన్. 64

మ. చిలుకా యెవ్వతె లేని-పోద లిడి డా ♦ చేతం గడం ద్రోయునో
బలిమిన్ రాధికదూత గావె యని కో♦పావేశతం జూచునో
నలి యాఁకంటికి ఖండచక్కెరలఖా♦ణం బుంచునో యుంచదో
కలలో నంతకుఁ దాళలే వకట నీ♦గారాబ మెట్లున్నదో. 65

సీ. ఏసాంకవామోద ♦ యిఁక రాపు సేయునో
చూడఁ జాలక రాజ♦శుకములార
అంబుదాలక యేది ♦ యలజళ్ళఁ బెట్టునో
సైరింప లేక హం♦సంబులార
శరదిందుముఖి యేది ♦ విరసంబు చేయునో
నెమ్మి నెమ్మది మాని ♦ నెమ్మిలార
మించుబోణియెవర్తు ♦ మిఱుమిట్లు గొల్పునో
వైరంబు మీఱ గో♦ర్వంకలార
తే. గీ. తేజరిల్లునిళాండజ♦రాజయాన
కాల రాచును మిము నెల్ల ♦ నేలఁబెట్టి
మిగుల మునురీతి నావెన్క ♦ నెగిరి పడఁగ
వలదు మనుఁ డింక సన్మార్గ♦వర్తు లగుచు. 66

తే. గీ. కలరవములార యిఁక నొక్క♦కలికి మిమ్ముఁ
దప్పు లెంచక యాఁకలి♦దప్పులెఱిఁగి
సనగ లులవలు నువ్వులు ♦ సన్నబియ్య
మునిచి పెంచునొ పెంచదో♦కసరు చేసి. 67

వ. అని నెచ్చెలులం జూచి యి ట్లనియె. 68

సీ. హరిమధ్య యెవ్వతె ♦ కరికోఁత బెట్టునో
యదలించి మత్తేభ♦యానలార

కనకాంగి యెవ్వతె ♦ కడుఁ గాఁకఁ జూపునో
విడివడి సమదాళి♦వేణులార
శుకవాణి యెవ్వతె ♦ వికటించి పలుకునో
మొగ మెత్తఁ జేసి యో♦ముగుదలార
అబ్జాస్య యెవ్వతె ♦ యటుగొఱల్ నించునో
పక్షపాతమునఁ బ♦ద్మాక్షులార

తే. గీ. యింక నేకలకంఠి తా ♦ నెగిరి పడునొ
పగను మీమీఁదఁ బల్లవ♦పాణులార
మీరు కల నైన ననుఁ బాసి ♦ పోరటంచు
నమ్మి యుండితి నిదివఱ ♦ కమ్మలార. 69

తే. గీ. ఒక్కపాటు నెఱుంగక ♦ యున్నమీకు
నకట నన్నుండి యీవెత ♦ లంద వలసె
నినుముతోఁ గూడ నగ్నిహో♦త్రునకుఁ బెట్లు
తగులు నంచనుకతగాను ♦ తరుణులార. 70

సీ. ఈమేను దొరఁగిన ♦ నీఁక జీవునకు వేత
వరతను వచ్చ దన్♦భ్రమను గాదు
పద్మాక్షుఁ డీవట్టి♦పడకిల్లు గన్గొని
పరితాప మందు న♦న్నభ్రమను గాదు
మనరాధ పోయెఁగా ♦ యని యిళాకలకంఠి
వగ లందునో యను♦భ్రమను గాదు
చుట్టువాఱుక బెట్టు♦చుట్టంపుపూఁబోండ్లు
పలవింతురో యను♦భ్రమను గాదు

తే. గీ. మంచి యేలికసాని లే ♦ దంచు మీర
లెగ్గు చెందెద రనుచు నే ♦ నిన్నినాళ్లు
నిలుపఁ గూడని ప్రాణముల్ ♦ నిలుపుకొంటి
నీఁక నిలుప రాదు దయయుంచు ♦ డింతులార. 71

వ. అని విలపించుచుండుసమయంబున. 72

కం. మరుఁ డురువడి నొఱ నరవిరి
కిరుసుఁఝురీ లంచు దూసి ♦ కినిసి బిరాన్ద
పరుఁ జంటఁ జెమట పొడమఁగఁ
దరుణీమణియెదను దారి♦దప్పక కుఱిమ్మెన్. 73

కం తను వెల్ల జల్లు మనఁగా
ననమోవి చలింప మిగుల ♦ నడుము వడంకం
జను లదరఁ గురులు వదలఁగఁ
గనుదమ్ములు మోడ్చి వ్రాలెఁ ♦ గామిని మూర్ఛన్.

కం. అత్తరి బిత్తరు లెల్లను
జిత్తమ్ములు తల్లడిల్లఁ ♦ జిత్తజుచివురుం
గత్తులపై వ్రాలిన య
మ్మత్తచకోరాక్షిఁ జూచి ♦ మమత దలిర్పన్. 75

సీ. కలకంఠినిట్టూర్పు♦గాడ్పులు నిగిడిన
వల్లీమతల్లిక ♦ లెల్ల సొరిగె
మదవతిపై సోఁకు♦మారుత మొలసిన
శుకపికనికరము ♦ లొస్సలి వ్రాలె
నలివేణి యొరగిన♦తలిరుటాకులసెజ్జ
నీరసం బై బూది♦దారిఁ గాంచెఁ
దరుణిగుబ్బల నున్న♦తారహారంబులు
సొబగెల్లఁ జెడి చిట్లి ♦ సున్నమయ్యె

తే. గీ. దమ్ము లిడఁ బోవఁ గలువమొ♦త్తము లయ్యె
విసము లయ్యెను జేర్చిన♦బిసము లన్ని
మల్లె లయ్యెను విరిబొండు♦మల్లె లుంచ
నెందునను వీఁకఁజెడు దీనిఁ♦జెందుకాఁక. 76

కం. ఏ మంద మేమి సేయుద
మేమందునఁ దీరు కాఁక ♦ లేదిన మకటా
యేమందయాన నమగుద
మీామందరకుచ తెఱంగు ♦ లెల్ల నటించున్. 77

సీ. తావికప్రపుఁదిన్నె ♦ దనరించె నొకరంభ
యొప్పుపుప్పొడి గప్పె ♦ నొక్కశ్యామ
విరిజాజు లలరించె ♦ వేఱొక్కలతకూన
యొమ్ములమ్ముల నుంచె ♦ నొక్కసరసి
బిసకాండములఁ జేర్చె ♦ వెస నొక్కపద్మిని
యొగిఁ బల్లవము లుంచె ♦ నొక్కకొమ్మ
హిమజలంబులఁ జల్లె ♦ నిల నొక్కశశిరేఖ
కెందొగ లిడె నొక్క ♦ కృష్ణవేణి
తే. గీ. తక్కనెచ్చెలు లట్లనే ♦ తలిరువిల్తు
ధాటి కోర్వనిరాధావ ♦ ధూటి కపుడు
తమతమకు నొద్దికైనసా ♦ ధనము లొసఁగి
సారెఁజేసిరి శైత్యోప ♦ చారవిధులు. 78

ఉ. కోమలిసిబ్బెపున్వలుద ♦ గుబ్బల జొబ్బిలునొప్పుకపప్రిమా
కాముని కాఁక సోఁకి యది ♦ గప్పిన మండఁ దొడంగె మన్మథ
స్వామికి నేఁ డిదే చమురు ♦ వత్తియు లేనినివాళిజోతు లో
సామజయానలార యని ♦ చానలు చేతులు పట్టి పల్కఁగన్. 79

తే. గీ. సకియ లిటు సల్పుశైత్యోప ♦ చారవిధులు
చెలియ కవి నిమ్మకెరువు వే ♦ సినవితానఁ
గాఁక మితి మించఁగా నది ♦ గాంచి మధుర
వాణి యనుచాన మన్మథ ♦ స్వామి నెంచి. 80

సీ. రతిమనఃకాంతాయ ♦ రాజీవకుంతాయ
మలయానిలరథాయ ♦ మన్మథాయ

సత్కారవాహాయ ♦ జగదేకమోహాయ
మత్తశూర్పవథాయ ♦ మన్మథాయ
పద్మాకుమారాయ ♦ బాలికాధారాయ
మహనీయవిబుధాయ ♦ మన్మథాయ
మాధవప్రభవాయ ♦ మాధవసచివాయ
మానితాత్మకథాయ ♦ మన్మథాయ

తే. గీ మంజుహర్షణబోధాయ ♦ మన్మథాయ
మధుపగుణచాపనాథాయ ♦ మన్మథాయ
మహితశృంగారసదనాయ ♦ మన్మథాయ
మనసిజాయ తుభ్యం నమో♦మన్మథాయ. 81

కం. నగధరుఁ డెప్పటివలెఁ జెలి
తగు లొందిన నిన్నె యిష్ట♦దైవము వంచుఁ
దగఁ గొలుచుఁ బాపు మాపద
ఖగవాహన గోపతనయ ♦ కమలాదరణా. 82

తే. గీ. అనుచుఁ బ్రార్థించి వందనం ♦ బాచరించి
మృగమదముచేత గేదంగి♦రేకుపైఁ ద
దీయయంత్రంబు వ్రాసి రా♦ధికను డాసి
యాకుణమె దిట్టముగఁ గేల ♦ రక్ష గట్టి. 83

కం ప్రియునామమ్ములపలుకులు
ప్రియ మందఁగ నాలకించి ♦ పెంపు దలిర్పన్
నయనములు దెఱచి సరసిజ
నయనుని సటఁ గాన కడలి ♦ నాటినపేమన్. 84

శా. ఆకాంతామణి యంగజానలము లో♦కాతీత మై పర్వ నా
లోకాభీలదృగశ్రువర్షము లురూ♦రోజాద్రులం గుప్పఁగా
శోకోద్రేకముచేఁ జెఱంగు మొగము ♦ నోసెఁకించి తా నేడ్చె న
స్తోకోన్మత్తమయూరరాజవిలస♦త్సువ్యక్తరావంబునన్. 85

కం. వనజాతవదన లదిగని
వనితామణిచుట్టు ముట్టి ♦ వగవకు మమ్మా
వనమాలిఁ గూడె దిదిగో
వినుమా దక్షిణపుగాలి ♦ విశదం బయ్యెఁ 86

సీ. అలజక్కవలపెక్కు ♦ వలఁ ద్రొక్కు బలునిక్కు
గలగుబ్బపాలిండ్లు ♦ గలఁగెనమ్మ
బిగిఁ జెందుతొగవిందు ♦ తగు లొందువగ లందు
వదనారవిందంబు ♦ వాడెనమ్మ
నునుగల్వలను గెల్వఁ ♦ గనునిల్వుఁ డను చెల్వ
మరుకన్నులను జెల్వ ♦ దొరఁగెనమ్మ
పరువంపుమరువంపు ♦ మురువంపుగరిమంపు
చిన్నారినెమ్మేను ♦ చిక్కెనమ్మ
తే. గీ. చొక్కు మగుచెక్కుటద్దము ♦ లుస్రుక్కెనమ్మ
తావిచెంగావిమోవిడా ♦ లారెనమ్మ
యేల యిఁకజాలి వనమాలి ♦ నేలి మేలు
కొనెదు వినవమ్మ శుభము చే ♦ కొనెదవమ్మ. 87

వ. అనిన విని రాధికామణి యి ట్లనియె. 88

సీ. తనివార హరిమోము ♦ గన లేనికన్నులు
కలఁగిన నే మాయెఁ ♦ గాంతలార
చెలువునికౌఁగింట ♦ మెలఁగనిదేహంబు
చిక్కిన నే మాయెఁ ♦ జెలియలార
గోపాలకస్వామి ♦ గ్రోలనికెమ్మోవి
స్రుక్కిన నే మాయె ♦ సుదతులార
యెమ్మెకానియురమ్ముఁ ♦ గ్రుమ్మనిపాలిండ్లు
కమలిన నే మాయె ♦ రమణులార
తే. గీ. యెఱ్ఱఁగి యెఱుఁగక పలికెద ♦ రింతె కాని
యెడ విడనిబాళి రతికేళి ♦ నెలమి నేలి

నట్టినాదేవు నెడఁబాసి ♦ నట్టివెనుక
జీవనం బేల తను వేల ♦ జీవ మేల. 89

ఉ. మానినులార మీర లను♦మానము మానుఁడు నమ్మ వద్దు నన్
గానిపనుల్ మదిం దలఁచి ♦ గాసిల నేటికి నేఁటి కీయెడల్
సూనశరాగ్ని కాహుతిడి ♦ సొంపు వహించెదఁ బక్షు ముంచుఁడీ
ప్రాణము ప్రాణనాయకుని ♦ బాసి తరించున నెంత నిల్చినన్. 90

ఉ. ఈయెడఁ గాయము న్విడిచి ♦ యేగెద నంచు విచార మొంద లే
దాయదుసార్వభౌమునికి ♦ నాముర వైరికిఁ గానికానిమై
పోయినఁ బోవ కున్న నిలఁ ♦ బుణ్యమొ పాపమొ గ్రుడ్డికన్ను దా
మూయక విచ్చిన న్మఱచి ♦ మూసిన నేమి తలంచి చూడఁగన్. 91

కం. ఐతే యింకొక నెంజలి
యాతరుణీస్మరునిమోము ♦ నవలోకింపం
బాతకురాలైతిఁ గదా
యీతరి నను గూర్చి వగవ ♦ నేటికి మీకున్. 92

కం. అని పలుకువనితఁ గనుగొని
కనకాంగులు కనుల నశ్రు♦కణములు దొరఁగన్
వనరఁగ నేటికి నేఁటికి
వనజాక్షుఁడు వచ్చువేళ ♦ వచ్చె నటంచున్. 93

సీ. హరి యదె వేంచేసె ♦ వరరథాంగస్ఫూర్తి
యను వంద వీక్షించు ♦ మనిమెనొకతె
కమలాప్తుఁ డదె యీమొ♦గం బయ్యెఁ బద్మినీ
హాసముల్ చెలరేగె♦ననిమె నొకతె
గోవర్ధనుఁడు తమః♦క్రూరప్రభల్ జాఱ
నల్లదె పొడ సూపె ♦ ననిమె నొకతె
యదె లోకబాంధవుం ♦ డరుదెంచెఁ గుముదాళు
లణఁగి తల ల్వంప ♦ ననిమె నొకతె

తే. గీ. కరుణ వెన్నుఁడు నీమీఁదఁ ♦ గన్ను దెఱచె
నదిగొ దిశలెల్లఁ జెలివొందె ♦ ననియె నొకతె
వచ్చె నాచాయవగకాఁకు ♦ వగవఁబోకు
మతనుభయ మేమిచేయునం ♦ చనియె నొకతె. 94

కం. ఈరీతి వారిపలుకులు
సారెకు వీనులను సోఁక ♦ సతి మరుకాఁకల్
దీరఁగ వెలఁదులకడ నా
శౌరిం గోరుచు న టుండె ♦ సమ్మతమతి యై. 95

తే. గీ. అంత నచ్చట నర్జునా ♦ హ్వాయునిసఖుని
జేరి రాధిక పంచిన ♦ చిలుక యలుకఁ
జెప్పకయె పోయె నని చెప్పఁ ♦ జిత్తగించి
వనజనాభుఁడు మనము ది ♦ గ్గనఁగ లేచి. 96

సీ. రాజాస్య గీలించు ♦ రవలపావలు మాని
ధవళాక్షి యిచ్చుకై ♦ దండ మాని
పడఁతులు దెచ్చిన ♦ బారిపల్లకి మాని
సుమగంధు లిడుచామ ♦ రములు మాని
కాంచనాంగులు పట్టు ♦ కరదీపికలు మాని
శుకవాణు లను హెచ్చ ♦ రికలు మాని
భామామణు లొసంగు ♦ బాగమ్ములును మాని
వనితలు విసరుపా ♦ వడలు మాని

తే. గీ. జాఱుశిఖవీడ నరవిరి ♦ సరులు వాడ
బెట్టువగతోడ హృదయంబు ♦ కొట్టు కాడ
విరహ మొనఁగూడ ముత్యాల ♦ పేరులూడఁ
జనియె నాప్రోడ శృంగార ♦ వనముజాడ. 97

వ. ఇట్లు చని. 98

కం. చైత్రరథనందనాదిక
చిత్రమనోహృద్య మైన♦శృంగారవనిఁ
మిత్రులతో రాధాశుభ
గాత్రి న్మదిఁ దలఁచి గరుడ♦గమనుఁడు వల్కెన్. 99

సీ. ఎలనాగ నాచెంత ♦ కెంతేంత వచియించి
తనముద్దుచిలుకను ♦ బనిచెనొక్కొ
వచ్చి యిచ్చట నాదు♦వర్తమానము చూచి
పోయినశుక మేమి ♦ బొల్లెనొక్కొ
యేణాక్షి యది విని ♦ యీనినపులిఁబోలెఁ
బదరి భగ్గున మండి♦పడియెనొక్కొ
యది యొక్కనెపముగా ♦ నతివలు పగ చాటి
మించఁగా నేమి బో♦ధించిరొక్కొ
తే. గీ. తోయజాననమది కేమి ♦ దోఁచెనొక్కొ
దైవమేగతిఁ జేయంగఁ ♦ దలఁచెనొక్కొ
కాల శని యుండెనో జవ♦రాలిఁ బాసి
యేల వచ్చితి నాబుద్ధి ♦ కూలిపోను. 100

ఉ. కామిని చిల్క పోయి పలు♦క న్విని గుండె గభిలు మం చనఁ
మో మొకయింత చేసికొని ♦ మోవి వడంకఁగ మేను వాడఁగా
గామునికాఁకలం గుమిలి ♦ కంటికిఁ బుట్టెఁడు నీరు నించి తా
నే మని యెంచెనో మదిని ♦ నెంతతపించెనొ యేమి చేసెనో. 101

సీ. నినుఁ బాసి నిమిషంబు ♦ నిలువఁ జాల నటంచుఁ
గౌఁగింటఁ జేర్చుక ♦ గడియసేపు
నీవెంటనే వత్తు ♦ నేఁ దాళ లే నంచుఁ
గరములు పట్టుక ♦ గడియసేపు
ననుఁ బిల్వ బంపుము ♦ నాయాన నీ కంచుఁ
గన్నీరు నించుచు ♦ గడియసేపు

దానిమాయలఁ జిక్కి ♦ దయ వీడకు మటంచుఁ
గదిసి ఱొమ్మునవ్రాలి ♦ గడియసేపు

తే. గీ. గాఁగ వగచుచు గద్గద♦కంఠి యగుచుఁ
ప్రేమ మీఱంగ దీవెన ♦ వీడె మిచ్చి
పనుపఁజాలక పైనంబు ♦ పనిచినట్టి
యువిద నెడబాఁసి యిం దుండు♦టుచితమగునె. 102

సీ. చూతునా యొకసారి ♦ శుకవాణినెమ్మోము
కలువరాయనిఁ గాంచు ♦ కలఁక దీర
విందునా యొకసారి ♦ విరిబోణిపలుకుల
నలపికధ్వని విన్న♦యళుకు దీరఁ
జేర్తునా యొకసారి ♦ చెలిమేనితో మేను
పూపాన్పుపై నున్న♦తాప మాఱ
దొరకునా యొకసారి ♦ తెఱవచన్గవ యంటఁ
దమ్మిమొగ్గల నంటు♦తలఁకు దీరఁ

తే. గీ. గలుగునా యొక్కసారి చ♦క్కనిమిటారి
ముద్దుచెక్కిలి ప్రేమతో♦మూర్కొనంగ
గొనబుకప్రపుఁబలుకు మూ♦ర్కొన్నయట్టి
కాఁక దీరంగ నంతరం♦గము చెలంగ. 103

చ. లలననిజాంఘ్రిపద్మముల♦లత్తుక నామునికాళ్ల సోఁకఁగా
నిలిచి తమిం దొడ ల్తొడలు ♦ నీవియు నీవియు నాభి నాభియుఁ
వల నగుఱొమ్ము ఱొమ్ము జగి♦వాతెర వాతెర మోము మోమునుం
గలియఁగ నిండుకౌఁగిటను ♦ గ్రమ్మక నెమ్మిఁ జెలంగు టెన్నఁడో.

సీ. శృంగారయౌవన♦క్షీరాబ్ధినడుమను
దనరారుబంగారు♦తమ్మి యనఁగఁ
దళుకుమిం చన మించు♦తనుచంద్రరేఖలోఁ
జలిధవిల్లు[illegible]రంగ♦పద మనంగఁ

గలదు లే దనునట్టి ♦ కౌముదీవియయందుఁ
జూచినదిం కెన ♦ పూ వనంగ
నలు వొందునాభిపు ♦ న్నాగంబునను బుట్టి
ప్రవహించువిరితేనె ♦ వాఁక యనఁగఁ

తే. గీ. జొక్కి మరు లెక్కి మెత్తలఁ ♦ జుట్టి చూడ
నజుఁ డొనర్చినమోహన ♦ యంత్ర మనఁగ
మరులు గొలిపెడిదొరసాని ♦ మరునియిల్లు
కళలు గరఁగంగ ముద్దాడి ♦ కలియు టెపుడొ. 105

చ. పయనము పోయి వచ్చెడిరు ♦ వారపుముచ్చట లావలన్ మఱెం
తయు నినుఁ గూడుప్రోడలకుఁ ♦ దప్పక చెప్పుము నాదుమ్రోల నా
పయినము గానిసుద్ది యని ♦ పల్కి మటంచును మేన వ్రాలి హా!
దయ పగవారికైన నమి ♦ తంబుగఁ గా దనుచాన నెన్నుదున్. 106

చ. మొగ మొకయింత చేసికొని ♦ మోవి చలింపఁగ మేను సోలఁగా
జిగికనులందు నీ రొలుకఁ ♦ జిత్తజుగేహము చెమ్మగిల్ల నో
రఁగఁ దలవాకిట న్నిలిచి ♦ మ్రాన్పడి నే నిటు వచ్చువేళలన్
సొగసుగఁ జూచునాసుదతి ♦ చూపు దలంచిన నోర్వ శక్యమే. 107

సీ. శయనింప నొల్లదు ♦ శయ్యపై నైనను
వనజాక్షి నాయురం ♦ బుననె కాని
వసియింప నొల్లదు ♦ పసిడిగద్దియ నైన
ఘనవేణి నాయంక ♦ ముననె కాని
భుజియింప నొల్లదు ♦ పులిజున్ను నైనను
చెలువ నాకెమ్మోవి ♦ తేనె గాని
వినఁగ నొల్లదు రుద్ర ♦ వీణారవం బైనఁ
గలికి నాగళరవం ♦ బులనె కాని

తే. గీ. పిలువ నొల్లదు తనతోడి ♦ చెలుల నైనఁ
గన్నియలమిన్న ప్రేమతో ♦ నన్నె కాని

Kendram

యట్టిగుణరాశి నెడఁబాసి ♦ వట్టిగాసి
పొందఁ జేసె విధాత దు♦ర్బుద్ధిచేత. 108

సీ. మడుపులమార్పుల ♦ మక్కువ లొనరించి
తమలపుమార్పుల ♦ దయ ఘటించి
నెమ్మోముమార్పుల ♦ నెమ్మది సవరించి
వాతెరమార్పుల ♦ వలపు పెంచి
జిగితొడమార్పుల ♦ సొగ సెంతో తనరించి
కౌఁగిలిమార్పుల ♦ గనున ముంచి
తగుతలమార్పులఁ ♦ దమకంబు పుట్టించి
ప్రక్కమార్పులచేత ♦ భ్రమ ఘటించి

తే. గీ. పొలయలుక నించి వెంటనే ♦ బుజ్జగించి
కళలు గరఁగించి మనసార ♦ గారవించి
రతుల సొక్కించి నన్నేలు♦రమణి నెంచి
జాలిగొని చాల యీవేళ ♦ తాళఁజాల. 109

చ. కులుకుచుఁ గల్లమై నిలిచి ♦ గుబ్బ లశాడఁగఁ గొప్పు వీడఁగాఁ
దిలకము జాఱ రెప్ప లర♦తేలఁగ నూర్పులు మీఱ మారునిల్
జిలజిల మంచుఁ జెమ్మగిలఁ ♦ జెక్కులఁ జెమ్మట లూర హాయిగాఁ
దలపడి చేయుపుంరతిని ♦ ధ్యానము చేసెద నెప్పుడు న్మదిన్. 110

చ. వడఁకెడునుర్లు దొడల్ వదలు ♦ పావడ వాతెరకాటు చెమ్మటల
సడలినపెన్నెరుల్ కరఁగి ♦ జాఱినచాదిక చిట్లుగంధముల్
బెడిదపుటూర్పులుల్ కులుకు♦పెన్చనుగుబ్బలపచ్చిగోరులుం
దడబడుయానముల్ వలపు♦ తందరయుం దగ మారుసాదనల్
బడలి సుఖద్రవం బొలుకఁ ♦ బ్రక్కను నిల్చు చెలిం దలంచెదన్. 111

సీ. జంకించుచు నదల్చి ♦ సామి ర మ్మని పిల్చి
యెదు రానుకొని నిల్చు♦నుదుటు దనము

జిగిగుబ్బలను గ్రుమ్మి ♦ బిగికౌఁగిటను గ్రమ్మి
మనసారఁ దను వమ్మ ♦ మంచితనము
ఒడికట్టు సడలించి ♦ తొడ తొడఁ గదియించి
బెట్టుగాఁ దమి నించు ♦ దిట్టతనము
జిలుఁగుతిట్టులు దిట్టి ♦ యలిగి చెక్కిలి గొట్టి
వలపుముద్దులు వెట్టు ♦ పొలపుఁదనము

తే. గీ. మ్రొక్క మ్రొక్కించుకొనునట్టి ♦ చక్కఁదనము
పొగడి పొగడించుకొనునట్టి ♦ పోడితనము
దక్క దక్కించుకొనునట్టి ♦ దంటతనము
దానికే కాక కలదె యే ♦ చాన కైన. 112

ఉ. ఎందఱిఁజూడ నీవఱకు ♦ నెందఱితోఁ బుత ముచ్చటాడ నే
నెందఱికేళిఁ గూడి సుఖ ♦ మెంతయుఁ జెందను? దానియల్లచో
టందము పొందుచందమును ♦ నందునఁ జిందుసుఖద్రవంబు నే
చందనగంధియందుఁ గన ♦ సారెఁ దలంచిన దానికే తగున్. 113

చ. పొలయలు కాఱి నేఁ గలియ ♦ మోడ్చినకన్నులు విచ్చి చూచి బొ
మ్మలు ముడి వెట్టి జంకెనయు ♦ మందపుకోపము మోముదమ్మి నిం
పలర నదల్చి యోరి యద ♦ యా దయ మాలి విధాత మున్ను నా
తల నిటు వ్రాసె సద్దు మని ♦ తద్దయు మ్రాన్పడుకన్నె నెన్నెదన్. 114

చ. పలుమఱుఁ గూడి నేదురుసు ♦ పై సరము ల్గనుపించు వేళఁ గ
న్గలువలు విచ్చి చూచి యర ♦ గన్నిడి ముద్దులు గుల్క నవ్వి మేల్
భళి యవునయ్య యేలి తిది ♦ బాగదె హా విడ కంచు మెచ్చి నన్
బాలుపుగ దృష్టి దీసికొను ♦ ముద్దియముద్దు దలంప శక్యమే. 115

చ. కులుకుమెఱుంగుగబ్బిచను ♦ గుబ్బలు వెన్నున నాని యాత్మభూ
నిలయము తుంటి నంటఁ దొడ ♦ నిగ్గులు దిక్కులఁ బర్వ సీత్కృతుల్
గొలిపి చిటుక్కుమంచు జిగి ♦ గోటికొనం దల గ్రుక్కి సొక్కఁ జే
సలరులతాంగి నెన్న మరు ♦ లగ్గల మయ్యె నదేమి చెప్పెదున్. 116

సీ. అలమి కౌఁగిటఁ గ్రుచ్చి • యల్లందులకుఁ జొచ్చి
కాసెలోఁ జెయివేయు • కౌశలంబు
నబికి పెందొడ లెత్తి • యొడలు ఝుమ్మన హత్తి
హితవొప్ప నెదురొత్తు • లిచ్చువైపు
[1]తళుకు లేఁ గనఁ దగ్గి • తమి యుప్పతిల నొగ్గి
ధేనుకబంధంబు • నానుజాతి
చివచివఁ బైనెక్కు • రవళి హెచ్చఁగ నిక్కు
పుంభావ మొనరింపఁ • బూనుసొగసు
తే. గీ. తరువుఁ జుట్టినలతకూన • హరువు మీఱి
తనువు తనువునఁ బెనఁగొన • నసువు దేరి
వలపుతో నాగబంధంబు • సలుపుదారి
దానికే కాని మఱి దేని • కైనఁ గలదె. 117

చ. పొలఁతులఁ గూడనో రతుల • పోహణఁ జూడనో మేల్మి సేయనో
యలి గెడఁ బాయనో విరహ • మందనో కుందనో తెల్విఁ జెందనో
యిల తొలి నీవిరాళియును • నీవెత లీమితి లేనిబాళి నేఁ
గలను నెఱుంగ నేఁ డిదిగొ • కంటి నయో! తొగకంటికోసమై. 118

తే. గీ. మునుపు నిద్దుర లే దయ్యె • ముదిత నెనసి
వెనుక నిద్దుర లే దయ్యె • వెలఁదిఁ బాసి
యేమి చెప్పుదు మన్మథ • స్వామిమాయ
ముంచకయె ముంచె నొంచక • యొంచె నోర. 119

సీ. సొగసులపుట్టిల్లు • సొక్కుమందులదీవి
రాజసమ్ములటెంకి • రామచిలుక
నెరవన్నె బంగారు • విరవాదివిరితీఁగె
కుసుమాస్త్రుచే ధక్క • కుల్కులగని
మరునిశాస్త్రపుటీక • గురువుపీఠము పులి
గడిగినముత్తెంబు • కమలపాణి

1. తళుకు వె న్నవఁ దగ్గి. [మూ].

మదనసమ్మోహన♦మార్గణ మక్కల్కి
మరులుకొల్పుట కిమ్ము ♦ మంచిసొమ్ము
తే. గీ. తతసుగుణపేటి దివ్యసౌం♦దర్యవాటి
వనితలకు మేటి మాధుర్య♦వచనధాటి
భావజునిఘోటి ముద్దురా♦ధావధూటి
గాన మిల నేటివఱలోన ♦ దానిసాటి. 120

ఉ. మారునికేళిలోఁ జెఱఁగు ♦ మాసె నటంచును మాటు కేగ నే
సారెకుఁ బోకు నిల్వు మని ♦ జాఱుపయంటచెఱంగు పట్టినన్
మీఱినసిగ్గు నారజము ♦ మించినచూపులు చిన్నినవ్వు ల
వ్వారిగఁ గుల్కఁ కల్కి తల ♦ వంచిన దొక్కటి కోటి సేయదే. 121

ఉ. కన్నులఁ జెక్కుల న్మెడను ♦ గర్ణయుగమ్మునఁ గాముగీమునం
జన్నుల వీడె మెవ్వరిది ♦ చక్కెరబొమ్మ విచిత్ర మం చనన్
జిన్నిశిరంబు వంచి నును♦సిగ్గు ముదం బరనవ్వు మీఱఁ దాఁ
దిన్నఁగ మోముఁ జూచి నగి ♦ త్రిప్పి మఱెవ్వరి దన్న దెన్నెదన్. 122

సీ. కాంచనకాంచికా♦ఘనజఘనపరిభల్
హెచ్చఁగా నెదురొత్తు ♦ లిచ్చి యిచ్చి
రతనాలకుతికంటు ♦ రంగు లీనఁగ మీఱి
పారావతధ్వను ♦ ల్పలికి పలికి
ముంగరముత్యంబు ♦ ముద్దుగుల్కఁగఁ జేరి
యొసపరికెమ్మోవి ♦ యొసఁగి యొసఁగి
తారహారమ్ములు ♦ తీ రొందఁగఁ జెలంగి
గుబ్బలచే ఱొమ్ము ♦ గ్రుమ్మి గ్రుమ్మి
తే. గీ. సగము మొగిచినకనుఁగవ ♦ సగమునగవు
సగముసగ మగుపలుకులు ♦ సగము మఱపు
కెలివి సగమును దగ రతిఁ ♦ గలిసి యలసి
లోలలోచన నాయెద ♦ వ్రాలుటెపుటొ. 123

చ. నిదు రిఁకఁ జాలు లె మ్మనిన ♦ నే శయనింపఁగఁ గల్కి యల్కచేఁ
బదరుచు లేచి యవ్వలను ♦ బైఁటచెఱం గిడి పవ్వళింప నేఁ
బదముల వ్రాలఁ దన్నెనట ♦ బల్మిని నేఁ గలియంగ శయ్యపై
వదలినకీలుబొమ్మవలె ♦ వ్రాలిన దప్పటి దివ్వెడై తగన్. 124

సీ. ముద్దుపెట్టఁగవద్దు ♦ ముదిత! యెంగి లటన్న
మొనసి చెక్కిలి గొట్టి ♦ మోవినొక్కఁ
సుద్దిగా నున్నాను ♦ సుదతి! ముట్టకు మన్న
గబ్బిగుబ్బలఁ గ్రుమ్మి ♦ కౌఁగిలించు
నబల! పైఁ బడకు మ♦ర్యాద గా దన్నచోఁ
గదిసి పెన్నెరి పట్టి ♦ కదిమి తిట్టు
వ్రతము నేఁటికిఁ బ్రక్క ♦ నతివ! పండకు మన్నఁ
బైకొని కేళి కు♦పక్రమించు

తే. గీ. మేలు గనిమెచ్చు వాతెర ♦ గ్రోలనిచ్చు
ముద్దు గొనవచ్చు సుద్దులఁ♦బ్రొద్దుపుచ్చు
[1]రమ్య మగుగచ్చు లిడి పురు♦షాయితముల హెచ్చు
నట్టిచెలిపొందు గాంచ కే♦నెట్టు లుందు. 125

సీ. అంగజజ్వరతాప ♦ మాఱదు సఖిముఖ
పూర్ణచంద్రోదయం♦బుననె కాని
మదనవిదాహంబు ♦ మానదు ననబోఁణి
మోవిపంచామృతం♦బుననె కాని
స్మరదోష మాఱదు ♦ సతిసుగంధవసంత
కుసుమాకరంబు గై♦కొనినఁ గాని
మన్మథకార్యంబు ♦ మానదు జవరాలి
నిటలరాజమృగాంక♦నియతిఁ గాని

తే. గీ. తలఁప వలరాచభూతంబు ♦ దలఁగి పోదు
ఘనఘనకచాకచాంజనం♦బుననె కాని

1. రమ్యమగుగవచ్చు దా పురు♦షాయితముఁ కెచ్చు. [మూ].

రెట్లు వేగింతు నేరీతి నేసహింతు
నెవ్వరిని బంతుఁగాంతపోం దెపుడు గాంతు. 126

చ. మదనుని కేళిచే నెనసి మంచము డిగ్గి విలోలగాత్రి యై
పదరఁగఁ జూచి నేఁ గరము పట్టి పునారతి కెచ్చరించినన్
వదలిననీవితో శిరము వంచి నిరాదరహాస మొప్పఁగా
మదనునియిల్ తనుక్క మన మక్కువఁ బైకొనుకన్నె నెన్నెదన్.

సీ. అయ్యు వచ్చె నటంచుఁ దొయ్యలు లెక్కఁగింపఁ
బదరి టగ్గున లేచి యెదురుకొనును
చెలిమి నన్నిసుమంత సేపు చూడక యున్న
నావఁ ద్రావిసజోక నటవటిల్లు
నెడ నేది విన్ననా నుడి యెలుంగో యంచు
నెరిబొమ్మ నిక్క మై మఱచి వినును
పౌరుషరతి నేలి బడలితివో యని
వలిపెచెంగావిపావడను విసరు

తే. గీ. నేను సంతోషమున నున్న నెంతొ చెలఁగు
నింతనే విన్న నై యున్న వంతఁజెందు
నట్టిప్రియురాలి నెడఁబాసి నట్టితనకుఁ
జిన్నె లివి గావు ముందర నున్న వింక. 128

సీ. చుక్కలగమికాఁడు సూర్యుఁడై యుండునా
చెలిమోముతో మోముఁ జేర్చియున్న
విరులసరమ్ములు శరము లై యుండునా
మెలఁతకన్ సన్నల మెలఁగుచున్నఁ
జిలుకలపలుకులు ములుకు లై యుండునా
విరిబోణిమాటలు వినుచు నున్నఁ
జిగురాకుతల్పముల్ చిచ్చు లై యుండునా
చేడియపదసేవ సేయుచున్న

తే. గీ. మలయమారుత మెందైన ♦ మంట లౌనె
సరుహాక్షికి సురటిచే ♦ విసరుచున్న
మదిమదిని నేనె కొనినట్టి ♦ కొదవ లనక
సారె కీవేళఁ బరులను ♦ దూఱనేల. 129

సీ. కుచకుంభములమీఁద ♦ గోరంకుశం బాని
కటికుకటుక్కున ♦ నటికి పట్టి
కమ్మపుప్పొడిలోన ♦ దుమ్మరం బాడించి
చలువగొజ్జఁగినీటఁ ♦ జల్లు కొలిపి
మచ్చికమాటల ♦ మెచ్చుచు లాలించి
ననసెజ్జ సజ్జార ♦ మునను జేర్చి
మరులుకొల్పెడిసంకు ♦ మదతైల మెనయించి
తాంబూల మనుకబ ♦ ళంబు మేపి
తే. గీ. చివచివగ నెక్కి మర్మముల్ ♦ దవుల నొక్కి
దురుసుపై సరముల నెంతో ♦ దరముఁ జూపి
నెయ్య మలరార మబ్బుద ♦ ట్టెయ్య కున్న
మనసున హుషారు చెంద దా ♦ మరునిదంతి. 130

ఉ. ఎవ్వరికూటము ల్చెఱిచి ♦ యెవ్వరి ము న్నెడఁబాపినామొ నేఁ
డివ్విధ రవ్వ లంది యిపు ♦ డిద్దఱ మిద్దఱ మై వి దేశత
న్నొవ్వక నొచ్చి మోహ మను ♦ నూత మునింగి సుఖంబు లేక హా
జవ్వన మెల్లఁబో గడపి ♦ చా నట నే నిటఁ దల్లడిల్లఁగన్. 131

సీ. హృదయేశ నినుఁ బాసి ♦ యేఁ దాళఁజాలరా
జాములో వత్తువో ♦ జాగు లేక
జీవితేశ్వర పోయి ♦ నీ విందు రా మఱి
జాములు రెం డౌనొ ♦ సైచ లేను
పాణినాయక బదు ♦ ల్పలుక వ దేలరా
జాములు మూఁడౌనొ ♦ సాగి రాను

నామనోహర మల్లి ♦ ననుఁజేరి యేలఁగా
జాములు నాల్గానో ♦ సహజముగను

తే. గీ. అని బహుదినాలపై నాన ♦ కాడి గద్గ
దస్వరంబున నెదఁ జేరి ♦ తాను బనుప
రాలు కన్నీటియేఱుల ♦ లీల దాఁటి
వచ్చినప్పుడిఁ కేటి కీ♦వంత లకట. 132

సీ. పికిలిపిట్టలదారి ♦ బిగికౌఁగిళులఁ జేరి
పెదవులు గఱచుక ♦ పెనఁగి పెనఁగి
మల్లవల్లభులట్ల ♦ మరుసాదనలపట్ల
గల్లమ్ములకు వచ్చి ♦ కలిసి కలిసి
బిరు దొందుమాష్టీల♦కరణి నిర్వ్వారమును
జుఱుకుపై సరములఁ ♦ జూపి చూపి
మత్తేభములపీఁక ♦ మలయుచు నెడ మీఱ
తమకముల్ గిరిగొనఁ ♦ దాఁకి తాఁకి

తే. గీ. చెలఁగి బకదారులను హెచ్చి ♦ పలికి పలికి
కొదమచిలువలచెలువునఁ ♦ గదిసి కదిసి
సూనశరుపోర వెనుతీక ♦ నేను నారి
చేరి గడిదేరి సరిపోరి ♦ మీఱు టెపుడొ. 133

ఆ. వె. వాలుమీల నేలు ♦ వాలుఁగన్నులడాలు
సామసోము నోము ♦ మోముగోము
మాపు రేపు తూపు ♦ రూపు మాపును జూపు
కన్నె నెన్న నన్ను ♦ మిన్న సున్న. 134

సీ. కపురంపుదీవిని ♦ గఱుకుచెంగావిని
దాపిచే మోవిచేఁ ♦ బోవ నెంచి
కొలదేఁటిబారును ♦ దెలిరిక్కసారును
నారుచే గోరుచే ♦ దూఱు లెంచి

వికచాబ్జవనులను ♦ విమలాద్రిమణులను
గనులచేఁ జనులచే ♦ ఘన మడంచి
యద్దంపుఁజెక్కుల ♦ హాలరాజునిక్కులఁ
జెక్కుచే ముక్కుచేఁ ♦ జక్కడంచి

తే. గీ. మురు వలరుకొమ్మ వలపుల♦ముద్దుగుమ్మ
కమ్మసంపంగికొమ్మ బం♦గారుబొమ్మ
వలచుగొజ్జంగితెమ్మ మ♦ర్వంపురెమ్మ
నెపుడు గన నేర్తు నందాఁక ♦ నెట్టులోర్తు. 135

కం. నాగముల నేలుఁ గుచములు
నాగంబుల నేలు నడలు ♦ నాభిబిలము పు
న్నాగముల నేలు ననుచో
నాగాశ్రయు నేలు టరుదె ♦ నాతి దలంపన్. 136

తే. గీ. చానమోమందు మెల్ల లో♦చనమయంబు
కొమ్మ యొమ్మందు మెల్లను ♦ గుచమయంబు
కలికి వెన్నందు మెల్లను ♦ గటిమయంబు
గాన దానికి సాటి జ♦గానఁ గాన. 137

సీ. జలజాక్షిలావణ్య♦సరసి గా కున్నచోఁ
జనుదమ్మిమొగ్గలం ♦ దొనర నేల
ననబోణిశృంగార♦వనము గా కున్నచో
లలితోరుకదళిక ♦ లలర నేల
పల్లవాధర మోహ♦వల్లి గా కున్నచో
భ్రమరకశ్రీలచేఁ ♦ బ్రబల నేల
వెలఁది మన్మథునిచే ♦ విల్లు గా కున్నచో
జిగిచూపుతూపులు ♦ చెలఁగ నేల

తే. గీ. కలికి నెలరేక గా కున్నఁ ♦ గళలు గులికి
తారకాహృద్య మై చాలఁ ♦ దనర నేల

భామినీమణి నాతపః ♦ ఫలమె కాక
యున్నఁ దియ్యనిరుచుల మే ♦ లొండ నేల. 138

కం. అని వనరు వనరుహాక్షుని
గనికరమున నూఁది పలికె ♦ ఘనత యొకింతై
నను లేకను శ్రీదాముఁడు
చను వొప్పఁగ బావమఱఁది ♦ సరసము దోఁపన్. 139

కం. ననుఁ గనుఁగొను ననుఁ గనుఁగొను
మనుచును గోటానకోటు ♦ లంగన లుండన్
మునిగెదు రాధను దలఁచుచు
ఘనమోహరసాబ్ధిలోనఁ ♦ గమలదళాక్షా. 140

కం. మాయక్కకన్న రాధిక
యే యెక్కువ యైనచాన ♦ యొఱఁగింపు మదే
యీయమ నాయమ నెన్నఁగఁ
బ్రాయంబున రాజుబంటు♦వాసి దలంపన్. 141

ఆ. వె. వావి గాని వావి ♦ వయసునఁ గడుఁ బెద్ద
గుట్టు లేదు మిగుల ♦ గట్టువాయి
బుద్ధి గాదు మాను ♦ పెద్దాపె దంపు మం
కెనకుఁ జేటనంగ ♦ వినవె కృష్ణ. 142

ఉ. నా విని యల్క దొల్క యదు♦నాయకుఁ డిట్టనె బోంట్లజాతులన్
భావము మర్మకర్మములుఁ ♦ బ్రౌఢతనంబును తారతమ్యముల్
కోవిదకోటికే తెలిసి♦కోఁ దగు నంతియె కాని కానలన్
గోవులమేపుపల్లరపు♦గొల్లనికిం దెలియంగ శక్యమే. 143

సీ. తాఁ గన్నకూఁతురై ♦ తగునుడిపడఁతిని
బెనఁగిననలువ కే ♦ ఘనత దఱిగెఁ
దనగురుపత్ని యై ♦ తనరారుతారను
గదిసినరాజు కే ♦ కొదవ వచ్చెఁ

జెలియలివాని వై ♦ చెలు వొందువ్రుష నెంతొ
తొడరినయినను కే ♦ దోస మొదవె
మనుమరా లై నగం♦గను గూడి వెలసిన
మున్నీటిరాయఁ డే ♦ వన్నె దొరఁగె

తే. గీ. నెనసి మఱదండ్ర మరుకేళి ♦ నెనసినట్టి
వ్యాసునంతటిముని కేమి ♦ వాసి తగ్గె
వావి గా దంటె వొ రొర ♦ వార లెల్ల
నీవు నేర్చిననీతులు ♦ నేర రేమొ 144

తే. గీ. హరికి భూకాంత దా వావి ♦ నత్త గాదొ
అలపురారికి గంగ మే♦నత్త గాదొ
హరిహయున కహల్యాసతి ♦ యత్తగాదొ
వా రెఱుంగరొ నీపాటి♦వారుకారొ. 145

తే. గీ. రాముకంటెను జానకీ♦రామ పెద్ద
కాంతుకంటెను రేవతీ♦కాంత పెద్ద
రమణుకంటెను గేళినీ♦రమణి పెద్ద
పెద్ద దంటె వీవే పిన్న ♦ పెద్ద వొర. 146

తే. గీ. రామ గా దది సుగుణాభి♦రామ గాని
నారి గా దది మరువింటి♦నారి గాని
కొమ్మ గా దది సంపంగి♦కొమ్మ గాని
గుమ్మ గా దది ముద్దుల♦గుమ్మ గాని. 147

సీ. మగతేఁటిగఱులకు ♦ మగువముంగురులకు
నేనాటిస్నేహమో ♦ యెఱుఁగ రాదు
అలచందమామకుఁ ♦ జెలియనెమ్మోమున
కేమి దాంపత్యమో ♦ యెఱుఁగరాదు
కపురంపుతావికిఁ ♦ గలికికెమ్మోవికి
నేయానుకూల్యమో ♦ యెఱుఁగ రాదు

బంగారుగిండ్లకుఁ ♦ బడఁతిపాలిండ్లకు
నేయనుబంధమో ♦ యెఱుఁగ రాదు

తే. గీ. కళుకుమగమీలు చెలివాలుఁ♦గనులడాలు
కాంతిజిగిచూపు మరుచేతి♦కలువతూపు
వనితమైమించు తళతళ ♦ యనెడిమించు
నొక్కచోటనె పుట్టని ♦ దొకటె కొడవ. 148

ఉ. గంబుర మోవి మారుతుర♦గంబుర తియ్యనిపల్కు నీలనా
గంబుర వేణి చందురున♦గంబుర ఫాలతలంబు చారుపూ
గంబుర కంఠ మంబుజయు♦గంబుర కన్నులు దేవమత్తనా
గంబుర నెన్నడ ల్బురన♦గంబుర గుబ్బచనుల్ దలంపఁగన్. 149

కం. తారలు చక్కనిగోరులు
తారలు రదపఙ్క్తి పంచ♦దారలు పలుకుల్
తారలు చొక్కపుపిక్కలు
తారలఁ జెలి గెలుచు టరుదె ♦ తారుణ్యమునన్.

ఆ. వె. మబ్బుమబ్బు నడచు ♦ బిబ్బోకవతివేణి
వింటివింటి నడచు ♦ వెలఁది నడుము
కలువ గెలువఁ జూచుఁ ♦ గలకంఠి మైతావి
మించు మించ నెంచు ♦ మెలఁతమేను. 151

తే. గీ. తొడలె చాలును రంభలఁ♦దొడరి గెలువ
నుదురె చాలును శశిరేఖ♦నెదురుకొనఁగ
గోరె చాలును దారల♦దూఱుసేయఁ
జాన మెయి చాలు హేమాతి♦శయము నెంచ. 152

తే. గీ. ఇందుబింబాస్యచిఱునవ్వు ♦ నెంచి చూడఁ
జంద్రకిరణవిలాసంబు ♦ సహజ మయ్యె
నింతినునుగొప్పుకప్పున ♦ కెంచి చూడఁ
గాలమేఘంబు సరిసాటి ♦ గా దనంగ. 153

చ. చిగురులు పానకంబు సుధ ♦ జీనిరసావళి జుంటితేనియల్
పగడము ద్రాక్షలుం జెఱకు♦పాలును జాలును బంచదారయున్
మగువమెఱుంగుమోవిగతి ♦ మన్మథదాహభరంబు దీర్చ్చ నే
తగుసకలాంగకంబులకుఁ ♦ దద్దయు సౌఖ్యము లీయ నేర్చునే. 154

తే. గీ. తాఱుమాఱుగుణంబులు ♦ దీరఁ దేఱి
తారుమారుగుణంబుల ♦ పోరు మాఱు
మా అటంచని మాఱు వే♦మారునట్టి
నారియారకయారె వె♦య్యాఱు లీడె. 155

ఉ. గిరులును గిండ్లు గిన్నెలును ♦ గృష్ణకచాకుచపాళి క్రోడి రా
మఱియొక పేరు లేక చనె ♦ మక్కువ జక్కవపక్కు లుక్కు ద
క్కొరయికఁ జూపి జో డెడసి ♦ కుంది యమందరసానుభావతన్
హరువు దలిర్పకే కువల♦యాప్తునకే హిత వొంద వామెఁగా. 156

సీ. కుటిలత్వ మానారి♦కురులపాల్పునఁ జేరి
జనవరు లెన్నఁగా ♦ ఘనత కెక్కెఁ
గఠినత్వ మెన లేని♦కలికిగుబ్బల నాని
సారెకుఁ గొండంత♦పేరుఁ జెందె
మందత్వ మల వొంది ♦ మగువనెన్నడ నంది
యనుపమవిఖ్యాతి ♦ నతిశయిల్లెఁ
జంచలత్వ మెసంగి ♦ చెలికన్నుల నడంగి
కువలయానందతఁ ♦ గొమరు మిగిలె
తే. గీ. వెసఁ గృశత్వము చెలికౌను♦దెసనుదొట్టి
యిల ననంతయశఃస్ఫూర్తి ♦ నెసఁగె ననినఁ
జెలియ నయ్యుత్తమాంగిని♦గలిసినట్టి
పురుషుఁ డౌరౌర పురుషోత్త♦ముండు గాఁడె. 157

ఉ. దానిమెఱుంగుముంగురులు ♦ దానిముఖాబ్జవికాసవైఖరుల్
దానివిశాలనేత్రములు ♦ దానియొయారపుచూపుసంపదల్

దానియురోజగౌరవము ♦ దానికడానిహొళంగుమేనిడాల్
దానికళాకలాపములు ♦ దానిమృదూక్తులు దానికే తగున్. 158

ఉ. చక్కఁదనాల కేమి రుచి♦సంపద కేమి మెఱుంగు కేమి పెం
పెక్కుడె రాతిబొమ్మయెడ ♦ నెంతయు దానఁ బనేమి దానిపై
మక్కువ లెక్కుతక్కులును ♦ మాటలపిక్కులు సొక్కుమ్రొక్కు
దిక్కున నైనఁ గాని కల♦దే కళ దేఱఁగ నెంచి చూడఁగన్. 159

కం. అని పలికి కలికితనమున
వెనుదీయక చేరి పోరు♦వెడవింటిదొరన్
గని కినుక దొఱుక ననిరో
వనజాక్షుఁడు వాని వాని♦బలముల నెల్లన్. 160

సీ. కలువలచెలికాఁడ ♦ కానీర నీకాఁక
సుందరీమణిమోముఁ ♦ జూచుదాఁక
మలయమారుత యేల ♦ మలసెదు నీరాక
సుదతియూర్పులు మేన ♦ సోఁకుదాఁక
మదకీరమా యేల ♦ పదరెదు నీఁక
పద్మాక్షి ననుజూచి ♦ పలుకుదాఁక
నెమిలి యెందుకు వట్టి♦దుముకులు నీకేక
తొయ్యలినెరికురు ♦ ల్దువ్వుదాఁక
తే. గీ. పికమ నీకూఁక చెలిమాట ♦ వినెడుదాఁక
నంచ నీపోక సఖినడ ♦ ల్గాంచుదాఁక
తేఁటి నీజోక సతిచూపు ♦ నాటుదాఁక
మార నీథాక నన్నింతి ♦ చేరుదాఁక. 161

తే. గీ. ఇంతలోననె నను మీర ♦ లింత చేరి
బారుదీరుక బలుకారు♦బారు సేయు
నాన దాళదె మీమీఁద ♦ నాన రేపె
బొమ్మ గట్టెద చక్కెర♦బొమ్మఁ జేరి. 162

కం. అని కంతుఁ గంతుబలములఁ
దనచే నైనంత దూఱి ♦ తారి విరాళిం
గొనుశౌరి ముందు దోఁచక
వనితామణి సెన్ని సెజ్జ ♦ వ్రాలి వితాకై. 163

మాలిని ఉసు రని తల యూఁచున్ ♦ యోజన ల్చేసి చూచున్
గసరుచుఁ జెలి నవ్వున్ ♦ గప్పుమీసంబు దువ్వున్
విసువుచు విధి దూఱున్ ♦ వెఱ్ఱికో ర్కెల్లఁ గోరున్
గొసరుచు బయ లానున్ ♦ గుంది సర్వంబు మానున్. 164

కం. విను నెందుఁ జిటుకు మన్నను
గనుఁగొనుఁ గనులెఱ్ఱఁ జేయుఁ ♦ గలవర మందున్
గినుక గొను శిరము వంచును
వనితా ర మ్మనుచుఁ జీరు ♦ వసుధం జేరున్. 165

కం. హరి యిటుల విరులపాన్పున
విరహాగ్నిని నిగురుకాఁక ♦ వెతఁ గొని పొరలం
బరికించి సఖులు మిగులన్
వెఱఁ గందుచుఁ జెంతఁ జేరి ♦ వివర మెసంగన్. 166

చ. కనుఁగవఁ దమ్ములున్ సిరపు♦కప్రము మోవినిఁ గల్వఁ దారలన్
గొనబుచివుళ్లు గేలఁ జెలి♦గోరుల మొల్లల బంధుజీవపు
న్ననలు పదాబ్జయుగ్మమున ♦ నాభిని బొన్నలు మేన మర్వము
న్నినిచి సుగంధము ల్గొలిపి ♦ నెమ్మిని బూసురటీల వీచుచున్. 167

తే. గీ. సారెకు నొనర్చు శైత్యోప♦చారవిధుల
శ్రీనివాసుండు మెల్లన ♦ సేద దేఱె
ద్యుమణి యంతటఁ బొడసూపె ♦ నుదయగిరిని
బూర్వదిక్సతిపాపట♦బొ ట్టనంగ. 168

శా. శ్రీమద్గోపవధూమనోహరణ పుం♦జీభూతశృంగారరూ
పామేయాద్భుతసుందరాంగ జితపు♦ష్పాస్త్రాయుతా రుక్మిణీ

భామాద్యష్టమహిష్యుపావృత హర♦బ్రహ్మేమరేంద్రస్తుతా
జీమూతప్రకరోపమానకలిత♦శ్రీనీలవర్ణాన్వితా. 169

కం. అనుపమలావణ్యా వ్రజ
వనితాకుచమర్దనాది♦పాండిత్యకరా
తనుతేజఃస్ఫూర్తి జితా
తనుకోటిమహామహాశ్మ♦తసహస్రకరా. 170

మాలిని. కంజదళేక్షణ కౌరవశిక్షణ ♦ కార్యవిచక్షణ కాంతినిధీ
రంజితభాషణ రాక్షసభీషణ ♦ రత్నవిభూషణ రమ్యసుధీ
సంజయకారణ శత్రువిదారణ ♦ సాయకధారణ చారునిధీ
ప్రాంజలినారద పాలననీరద ♦ భాసురసారదయాజలధీ. 171

గ ద్య ము.

ఇది శ్రీచిన్నికృష్ణకరుణాకటాక్షవీక్షణక్షణప్రవర్ధమానానూనశృంగారరసప్ర
ధానసంగీత సాహిత్యభరతశాస్త్రాదివిద్యాపారంగత శ్రీమత్తిరుమల
తాతయాచార్యపాదారవిందమిళిందాయమానమానస-చోళ
సింహాసనాధ్యక్ష ప్రతాపసింహమహారాజ బహూ
కృతానేకచామీకరాంబరాభరణ ముత్యా
లుగర్భశుక్తిముక్తాయమానముద్దు
పళనిప్రణీతం బైన రాధికా
సాంత్వనం బనుశృంగార
ప్రబంధంబునందు
దృతీయా
శ్వాసము.

శ్రీరస్తు.

(ఇళాదేవీయ మనునామాంతరముగల)

# రాధికాసాంత్వనము.

## చతుర్థాశ్వాసము.

గీతాలసమానా
భోగీంద్రశయాన విహగ పుంగవయానా
వాగీశనుతాఖ్యానా
యోగీశ్వర చిన్నికృష్ణ యోగనిధానా. 1

తే. గీ. అవధరింపుము దేవ ది వ్యానుభావ
వ్యాసమునిసూతి జనకభూ వరునిఁ జూచి
చొక్కటపుజీనిచక్కెర యుక్కెరలకు
లెక్కయై మించునుడిచవు లెక్కఁ బలికె. 2

వ. అంత ననంతుండు దురంతకంతుసంతాపచింతాభరం బంతరంగంబున మఱుంగుపఱచుకొని కాల్యకరణీయంబు లాచరించి షడ్రససంపన్నం బయినయన్నం బొకయన్నుదలమిన్న వడ్డింప నారగించి గంధోదకంబుచే గండూషించి ప్రక్షాళితపాణిపాదుండై యాచమించి దివ్యాంబరాభరణగంధమాల్యాదుల ధరించి యత్తమామలకడ కేతెంచి నమస్కరించి వారిచే మన్ననలు గాంచి నేవచ్చి బహుదినంబులాయెం బోయిరావలయు నని

మండలించి కదళించినకౌతుకంబున నిళాదేవిం దోడ్కొనిర మ్మని తగువారల నియమించి బయలు మెరసి తన్ను వెంబడించి వచ్చు బంధుజనంబుల బహూకరించి పంచి కనకరథం బారోహించి మించినవేగంబునం జని చని మునిజన బృందావనం బగుబృందావనంబుఁ జేర నరుగుదెంచి రథంబు డిగ్గి నిజమందిరంబుఁ బ్రవేశించి యందు నందయశోదలగురించి నమస్కరించిన వారును గాఢాలింగనంబు లాచరించి దీవించిన ముదంబు వహించి యొక్కసంకేత స్థలంబున కేతెంచి శ్రీదామనామధేయునిచేఁ గురంగనయన తెఱంగు మఱుంగు లేక యాలించి దిటంబు చాలించి యిందు కేమిసేయువాఁడ నని యూహించి నేఁ బోయినం గాని రా నోప దని నిశ్చయించి యప్పగ లెల్ల నొక్కలాగున వేగించి యర్ధరాత్రంబునం బయలుదేరి తేట యై జగంబెల్ల నల్లిబిల్లిగా నల్లుకొని జాబిల్లి మొల్లమిగా వెల్లివిరిసినబొంఁదుమల్లియలనుల్ల సిల్లునింఁడుపంఁడువెన్నెలలు గాయ రాధికాసుందరాంగీమందిరాభిముఖుం డై చనుసమయంబున. 3

సీ. ఏడఁబోయెద విందు ♦ నాడి పొమ్మని పల్కు
నింతులపైఁ గన్ను ♦ లెఱ్ఱఁ బెట్టుఁ
బోనీము మముఁ గూడి ♦ పొ మ్మని యరికట్టు
చిన్నికన్నెలఁ బెడ♦చేతఁ గొట్టు
నేఁ గూడ వచ్చెద ♦ నిలు నిలు మని చేరు
చంచలాక్షుల నద♦లించి నెట్టు
నామీఁదియాన యిం♦దాఁక ర మ్మని పిల్చు
భామినీమణుల నే♦మేమొ తిట్టు

తే. గీ. విఱిగె నిఁక నేల పోవద్దు ♦ వీడె మరులు
మాను మని లోకు లిటువంటి♦మాట లాడఁ
దడ వృపశ్రుతు లని చాల ♦ తత్తరించు
రాధపై బాళి గొని యదు♦రాజమాళి. 4

తే. గీ. ఇటులఁ జనుదెంచుహరిరాక ♦ యెఱిఁగి చిలుక
చెప్ప విని రాధ తనయొద్ది♦చెలులఁబిలిచి

శౌరి యిట వచ్చె నని వింటి♦మీర లతని
విడక నిల్పుఁడు మోమోట♦మిడకయుండె. 5

చ. అనిన మహాప్రసాద మని ♦ యాచెలు లందఱు నేవితాన నై
నను శకటారిసంగతి గ♦నం గలిగెం గద నేఁటి కంచు నె
మ్మనముల విఱ్ఱవీఁగుచును ♦ మారునిగంధగజంబులట్ల వీఁ
కను జనుదెంచి వాకి లరి♦కట్టుక నిల్చిరి ధీరచిత్తలై. 6

తే. గీ. రమణిపై శౌరి యంతవి♦రాళి గొనుచు
నేమిటిని నైనఁ జూడక ♦ యేది వినక
నెవ్వి యూహింపకయ వచ్చి ♦ యెప్పటట్ల
రాధయిల్ చేరఁ జననొక్క ♦ రామవలికె. 7

సీ. ఘనత నడ్డము లేక ♦ చనియె దెవ్వఁడ వీవు
స్వాంత మాపసిగాపు♦సామిఁ గానె
స్వామి లైతిరి చాలుఁ ♦ జా లవ్వలికిఁ బొండు
నీవు హా మ్మనుదువా ♦ నీతిఁదప్పి
నేను గా కెవ్వరు ♦ నీ కిటఁ బని యేమి
పని లేక రా నేల ♦ వత్తు నిటకు
నాపను లిఁక నేల ♦ నానాఁడె పోయెఁ బో
యత్త కల్లునకు నెం ♦ దైనఁ బోనె

తే. గీ. రాత్రి చేరాన నున్నావు♦రా మురారి
పగలు చేరము లాయెనో ♦ పద్మగంధి
యిట్టియత్యుక్తు లేదిట్ట ♦ గట్టిచేసె
చెలి మనల నేలుదొరసాని♦శిక్ష గాదె. 8

సీ. చెల్లనిమాటాడి ♦ చెల్లించుకొంటివి
నేర్చి నేరక యంటి ♦ నోర్చికొనుము
విడు మింక నీతీయ♦బెల్లిమాటల నెల్లఁ
దీ పైన నిటు లాన ♦ తీయ నేల

పద్మాక్షి విన్న దె♦ప్పర మౌను గడ కేగు
మేలిక యల్గిన ♦ నెవరు దిక్కు
చని యేలి కగునిఖా♦సతిఁ జేర్చుకొని యేలు
మిళ యెవ్వ రే నెవ్వ ♦ రెంచి చూడ

తే. గీ. మొదట నెన్నాళ్ళనుండి యీ♦ములుచఁదనము
బోటిపదసేవ చేసిన♦నాఁటనుండి
కొంటెవగ లేలఁ జెందనో♦గోపబాల
కొంటె నీకింత యీయనా ♦ కోమలాంగి. 9

తే. గీ. అంటుపడి వచ్చినావు మ ♦ మ్మంట కేగి
శౌరి మాసంబళములు త♦త్సఖుల కొసఁగు
మంటుపడలే దటంచు మి♦మ్మంటి యిపుడు
బాస లెల్లను జేసెద ♦ భాసురాంగి. 10

సీ. కనుదోయి మం పేమి ♦ గనుము నిద్దుర లేదు
రాధపై బాళిచే ♦ రాత్రి యెల్ల
గోటిచీరు లి దేమి ♦ కోరి విభ్రాంతిచే
నారి నారయఁ బొద ♦ ల్దూరఁ జీరెఁ
బలుగాటు లివి యేమి ♦ చెలి నెడఁబాపిన
కమలజుపై నొడు ♦ గరువఁ దవిలె
జడవేటు లివి యేమి ♦ సరసిజాక్షిని జేరు
మనిజోటిగొని మీఁటె ♦ మనసిజుండు

తే. గీ. కుటిలకచ నేల కీగంధ ♦ మెటులఁ జిటిలె
మేటివిరహాగ్ని పైకొన ♦ బీఁట లెత్తెఁ
బసిఁడిదుప్పటిఁ బస పేమి ♦ పద్మనాభ
వినవె పచ్చనివలువవాఁ ♦ డనుట నన్ను. 11

సీ. పామును బట్టెదఁ ♦ బా మేమి చేయుఁ బో
మ్మహిగర్వదమనుండ ♦ వైననిన్నుఁ

జిచ్చులోపలఁ జొత్తుఁ ♦ జి చ్చేమి చేయుఁ బొ
మ్మతిదవానలభోక్త ♦ వైననిన్ను
సురల దాఁపెద సురల్ ♦ నెరపుదు రేమి పొ
మ్మాత్రివిక్రమమూర్తి ♦ వైననిన్ను
నేనానఁ బెట్టెద ♦ నా నేమి సేయుఁ బొ
మ్మాదిసర్వజ్ఞుండ ♦ వైన నిన్ను

తే. గీ. సత్యములు పొత్తుగుడుచునా ♦ సన్నుతాంగి
భళిర సత్యము లాసలై ♦ వచ్చు నీకు
నైన రాధపదాబ్జంబు ♦ లంటి వత్తు
నంటుకొను మిళపాదంబు ♦ లచటి కేగి. 12

తే. గీ. అనుసఖీమణివాక్యమ్ము ♦ లాలకించి
బలిమికలుములజులుములు ♦ బలియఁ జూరవ
చేసి చూచెద ననుచు నాఁ ♦ శ్రీధరుండు
తీవి చెలగంగలోఁ జొచ్చి ♦ పోవఁ గాంచి. 13

సీ. ఓనీరదాలక ♦ యోచంద్రబింబాస్య
యోమీనలోచన ♦ యోసునాస
యోచంద్రికాహాస ♦ యోమధురాధర
యోమంజులాలాప ♦ యోసుదంత
యోకంబుకంధర ♦ యోపీనవక్షోజ
యోవారిరుహపాణి ♦ యోసుమధ్య
యోయూరుజితరంభ ♦ యోతూణనిభజంఘ
యోపల్లవసమాంఘ్రి ♦ యోసుయాన

తే. గీ. గచ్చు లిడి వెన్న ముచ్చదె ♦ చొచ్చి వచ్చె
లెందు లెండని శౌరిపై ♦ లేమ లెల్ల
మొనసి పైఁటలు బిగఁగట్టి ♦ ముందు కెక్కి
మరునిమూలబలంబనా ♦ నురువడించి. 14

సీ. విడు విడు మని డాసి ♦ కడ కన్ను లెఱ్ఱఁజేసి
వెలికమ్మతమ్ముల ♦ విసరె నొకతె
తను వొకించుక పొంచి ♦ తమి యుప్పతిల వంచి
సంపంగి ననలచే♦జవిరె నొకతె
ఝు మ్మటంచు నదల్చి ♦ జాడ కడ్డము నిల్చి
విరజాజివిరు లెత్తి ♦ విసరె నొకతె
గగ్గోలుగా నార్చి ♦ కడు దురంబు దనర్చి
జిగినల్లగలువలఁ ♦ జిదిమె నొకతె

తే. గీ. చలువపన్నీరు మైనిండఁ ♦ జల్లె నొకతె
యొప్పపుప్పొడి తెప్పున ♦ గుప్పె నొకతె
యురగశాయిని రానీక ♦ యొడ్డు చూపి
యానుఁ డని రాధ పై దళం ♦ బనుపఁ జెలఁగి. 15

చ. చెలిచెలు లిట్లు చేరి తనుఁ♦జెందినయుల్లము లుల్లసిల్లఁగా
బలుచనుగుబ్బపోటులను ♦ వాల్జడవేటుల గోటిమీటులన్
గలిబిలి చేసి రవ్వ లిడఁ♦గాఁ గని శ్రీహరి యీబెపోటులం
గలగనిగంధసింధుర మ♦నంగఁ దొలంగక నిల్చి యి ట్లనున్. 16

తే. గీ. సుదతి యిసుమంత కడగంటఁ ♦ జూచినంత
యింతరంతులు చేతురా ♦ యింతులార
అలుక దీరఁగ దొరసాని♦కమరఁ బలికి
చెలిమి యొనరించి సుకృతంబుఁ ♦ జెందుఁ డనిన. 17

సీ. చెలిమి యొనర్పఁగా ♦ వలదెయీని న్నంచు
వెస నుల్కి కెమ్మోవి ♦ విఱిచె నొకతె
యీబుద్ధి యానాఁడె ♦ యెందుఁబోయె నటంచు
విడనాడి చేతులు♦విచ్చె నొకతె
యెవ్వారి నెంచక♦యిఁక మెలంగుదు వంచుఁ
గలికిలేనవు ముల్కఁ♦గులికె నొకతె

మముఁజూచి నేఁడైన ♦ మాట లాడితి వంచు
వాలుఁగన్నులు దేల ♦ వైచె నొకతె

తే. గీ. సెట్టికొకకాల మొదవిన ♦ సేవకునకుఁ
గలుగు నొకకాల మంచును ♦ గళలు మూల
రాలఁగమ్మలు చెక్కులఁ ♦ దూలియాడ
నూచకాచక మటి తల ♦ యూఁచె నొకతె. 18

కం. వనిత లిటు లగడు సలుపఁగఁ
గని యిప్పుడు వీరివలనఁ ♦ గార్యము గనఁ బో
మని తెలిసి రాధ వినఁగాఁ
దనరఁగ హరి పలికెఁ దలఁపు ♦ వల పైఁ బర్వన్. 19

కం. రమ్మా మరువపురెమ్మా
గుమ్మా వెలలేనిసొమ్మ ♦ గొజ్జఁగితెమ్మా
కమ్మానుకొన్న సంపఁగి
కొమ్మా దయచేసి మనవి ♦ కొమ్మా కొమ్మా. 20

శా. నిలువర మంతగాఁ గలిగె ♦ నేని నను బిలుపించి నీదుహా
స్గలుకుమిటారిగుబ్బచను ♦ గుట్టలఁ గ్రుమ్మి యదల్చి పల్కి చే
వలవడఁ జెక్కుగొట్టి యక ♦ టా జడ కొద్దిని మీట కొప్పు డీ
చెలియల కొప్పగించి యిటు ♦ సేయఁగఁ జెల్లును రాధికామణీ. 21

మ. అదుగో మారుడు పొంచెనే చెటకుడి ♦ [1]ల్లాలాయు మై వంచెనే
యెదపైఁ దూపులు నించెనే యళిబలం ♦ బెంతో విజృంభించెనే
మదకీరార్భటి మించెనే పవనుసా ♦ మర్థ్యంబు రెట్టించెనే
సుదతీ ని న్నిటు వంచనే సలుపు మం ♦ చుం ధాత నిర్మించెనే. 22

చ. చెలి నినుఁ బాసి నెవ్వగలఁ ♦ జెందుచు నిద్దుర మాని ధైర్యముం
దెలిపెడివారు లేక పర ♦ దేశివలెం బవళించి యొంటిగా
నలుగురియాడికల్ వినుచు ♦ నావిధి నిట్లు తపింప నీదుపె
ద్దలసుకృతానికైన వని ♦ తా దయ సేయఁగ రాదె నాపయిన్. 23

1. ల్లాయ త్తము న్నేసెనే. [మూ].

చ. హరిహరి రామరామ యిటు ♦ లారడి సేతురె దోసకారి హా
కరఁగినదోసపం డినుప♦కట్లకుఁ దాళునె చాలు చాలు నా
సరినెరజాణ లాగడము ♦ సల్పఁగ మారునిపోరఁ దారి నీ
చిరదయ నేలవే యనుచుఁ ♦ జేరితి నే నిపు డంగనామణీ. 24

చ. ననుఁ గరుణించవే పిలువ ♦ నంపవె కౌఁగిట గారవించవే
ఘనత ఘటించవే చెలిమి ♦ గాంచవె నాపలు కాదరించవే
నెనరు గణించవే ముదము ♦ నించవె యెంచవె యేల నాపయిం
గినుక [1]నడంపవే తెలియ ♦ కే నిను వేడెద రాధికామణీ. 25

ఉ. చక్కనిదాన వంచు రతి♦సార మెఱింగినదాన వంచు నా
యక్కఱ దీర్తు వంచు నను ♦ హాయిగఁ గౌఁగిటఁ జేర్తు వంచు నే
నిక్కము నమ్మి వచ్చునెడ ♦ నీవిపు డీమటుమాయలాంఢ్రచే
నక్కట యొప్పగించి యిటు ♦ లారడి సేతురె రాధికామణీ. 26

కం. అని యీవాహనము విస
ర్జనమును లే కున్నఁజూచి ♦ శౌరి శుకంబే
పెనవెట్టిన దీపని యని
యనియెం జెలిచిలుక నెంచి ♦ యమృతము లొలుకన్.

కం. చిలుకా నీకును నాపై
నలుకా పలు కాదరించి ♦ యమృతము లొలుకం
బలుకుచు ముద్దులు చిలుకుచుఁ
గులుకుచు నిటు రమ్ము ప్రేమ ♦ గొనకొని నాపై. 28

చ. అన విని చిల్క యుల్కిపడి ♦ యాహరి చీరఁగ నూరకుండుటల్
దనకును మేర గా దనుచుఁ ♦ దద్దయు రాధకుఁ దెల్పి ఘల్లుఘ
ల్లని నునుమువ్వ లందియలు ♦ నంఘ్రుల మ్రోయఁగ రెక్క లార్చుచుం
గొనబుజవాదివాసనలు ♦ గుప్పున వీవఁగ వచ్చి యచ్చటన్. 29

సీ. నెరివెండ్రుకలవాని ♦ నిగలొందుతొగవిందు
వగఁ జెందుముద్దునె♦మ్మొగమువాని

1. జవింపఁగాఁ దెలియ. [మూ].

సొగసుచూపులవాని ♦ మగరాలజిగి రాలఁ
దగునాల మొసఁగుదం♦తములవాని
నిమదచేతులవాని ♦ నొడికంబునిడికంబు
నుడికంబు గొనుకంఠ ♦ మొనరువానిఁ
గలికిపేరెదవాని ♦ వలమబ్బు బలుపుబ్బు
వెలిద్రొబ్బువలపుమై ♦ సొలపువాని

తే. గీ. శ్రీకరాంగదకౌస్తుభ♦శిఖిశిఖండ
మంజుమంజీరకర్ణికా♦మణికిరీట
కనకపటహారచాకచ♦క్యములవానిఁ
గృష్ణదేవునిఁ గని నవ్వి ♦ కీర మనియె. 30

కం. గోపాలసామిగారా
కాపుర మేపురము చాల♦కాలమున కహో
మీపాదయుగము గంటిమి
చాపల్యము పేరె నున్న♦శాంతము దీరెన్. 31

కం. అని పలుకుచిలుక నటు పోఁ
గని కరమునఁ జేరఁ దీసి ♦ కనికర మొప్పం
గని కరము దువ్వి ముద్దిడి
చనవున హరి పలికెఁ గండ♦చక్కెర లొలుకన్. 32

కం. శుకవాగమృతాబ్ధీందుని
శుకవాహనజనకు నన్నుఁ ♦ జులకన సేయక
శుకమా తగ దూరక వా
శుకవాణికిఁ దెలుపు కరుణఁ ♦ జూడు మటంచున్. 33

వ. అనిన విని శుకం బి ట్లనియె. 34

సీ. ననుఁగాదు పొ మ్మని ♦ నాతిఁ జేరినవాని
నే నెట్లు పిలుతు నో ♦ నెలఁతలార
నాపేరు నావగ ♦ నాతి కిచ్చినవాని
వెలా మెట్లు చూతు నో ♦ ముదితలార

బాస లెన్నో చేసి ♦ పద్దు దప్పినవాని
పలు కెట్లు విందు నో ♦ పణఁతులార
సరివారిలో నన్నుఁ ♦ జౌక చేసినవాని
చెలి మెట్లు చేతు నో ♦ చెలియలార

తే. గీ. యనుచు నిన్నెంచుఁ జెలులపై ♦ నట్టెనెయ్యు
వోయమండెడునగ్నియొ ♦ కో యనంగఁ
బ్రిజ్వరిలి వేటుపడుపాము ♦ పగిదిఁ జీరు
తరుణి నేదారి నినుఁగూర్తు ♦ దానవారి. 35

తే. గీ. తెలియఁగాఁ జెప్ప మనియెదు ♦ తెలిసి తెలిసి
యందు కేమాయె నే నందు ♦ కనఁగలేదు
దెలిపి మునువలె నీకఁ గూర్ప ♦ నలవి యగునె
తారి తేఱని నారి నే ♦ దారి నైన. 36

చ. అనుచు నిరాశగాఁ బలుకు ♦ నాచిలుకం గని దువ్వి యిచ్చ మే
లొనరఁగ ముద్దు వెట్టి విను ♦ మోశుకవంశపయోధిచంద్రమా
కనుఁగొన నేరిచే ఘటన ♦ గా దిది నీ కగు నెట్టు లైన నీ
పని యొనఁగూడఁగాఁ దెలియఁ ♦ బల్కుము నాగతు లన్ని కల్కితోన్.

సీ. పడఁతి! యల్లునిఁ గొంచె ♦ పఱచుట యత్తకు
న్యాయంబు దప్పిన ♦ నడత యనుము
వనిత! న న్నింతటి ♦ వానిఁగాఁ బెంచిన
నీ వెఱుంగవె నాదు ♦ భావ మనుము
నెలఁత! నానేరంబు ♦ నీవె యోర్చక యున్న
నీక నోర్చి యేలువా ♦ రెవ్వ రనుము
చెలి! నీకు నామీఁద ♦ నలుక దోఁచిన దెల్ల
పరఁగ నేఁ జేసిన ♦ పాప మనుము

తే. గీ. తరుణి మున్ను నీయధరామృ ♦ తంబు నాను
బలిమి నిన్నాళ్లు ప్రాణముల్ ♦ నిలిచె ననుము

ఉవిద ననువంటిమగవాని ♦ నవల నీవు
నెనరున గడించుకొన నేర ♦ వనుము చిలుక. 38

చ. ఎలమిని మత్తనూజుని వ♦హించుక ముందుకుఁ దేవె యాత్మయే
కలుగును బుత్త్రుఁ డై యటులఁ ♦ గావున నాతఁడె నేను నీకు న
ట్టు లయినను న్నను న్మనుపు♦టొప్పను నామన వెట్లు దెల్పెదో
నెలఁతకుఁ బాపపుణ్యములు ♦ నీచెయి నున్నవి రాజకీరమా. 39

కం. బలుపక్షపాత ముడుగుము
ఫలభంగము లిడఁగఁ బోకు ♦ ప్రాణము గావన్
గలవేళఁ దెల్పినా నో
చిలుకా దయచేసి చూపు ♦ చిలుకలకొలికిన్. 40

చ. అన విని చిల్క నావలన ♦ నారడిమాటలు పుట్టఁ బోవు నే
వనితకుఁ దేటగాఁ దెలియఁ ♦ బల్కెద దైవము తోడు గావలెన్
వనజదళాక్షి న న్నెఱుఁగ♦వా యని లోపలి కేగి కల్కితోఁ
దన కగుకొన్ని కార్యములు ♦ తా నయి యేకతఁ జెప్పి యందఱున్
విన వినతాంగిఁ జూచి యనె ♦ వేమరు నామరుఘోటి నవ్వుచున్. 41

ఉ. వాసవనీలనీలకచ♦భారము మున్గదియించి యేను నీ
దాసుఁడ నంచుఁ జేరుముర♦దానవవైరినిఁ బిల్వఁగావలెన్
బోసరి పొమ్ము పొ మ్మనినఁ ♦ బో ననుచున్ మెడఁబట్టి సూకఁగా
నాసను జూరు పట్టుకొని♦సట్టులఁ బోక పెనంగి యాడెడిన్. 42

కం. అన విని వనిత గిరుక్కున
ఘనమణితాటంకరుచులు ♦ గన నటు మోమై
[1]విన న ట్లుండిన మరలం
జని శౌరిని జేరి మిగుల♦సంభ్రమ మొదవన్. 43

చ. ఇదె సమయంబు ర మ్మనిన♦నింతుల నెంతొ తొలంగఁ ద్రోయుచుం
బదిల మెసంగ లోనఁ జని ♦ పావలసద్దులు గండపెండెపున్

1. నను చూచిచిలుక వేగమె. [మూ].

రొదల నడంచుకొంచు మది♦లో భయసంభ్రమముల్ చెలంగఁగా
మదనుని గన్నమన్నదొర ♦ మౌనముతోడుతఁ బోవ ముందటన్.

సీ. నునుపచ్చరాకట్టు♦పనిగీముల గడంగి
రవ మేది యుంచు పా♦రావతముల
మగరాలఁదగుగూళ్ల ♦ మరగి తలల్ వంచి
పలుకు లాడక కూర్కు♦చిలుకగముల
జిలుఁగుకెంపులయంత్ర♦ములమేఁత లంటక
చాల సోలుచుఁ దూలు♦శారికలను
బటికంపుజగతుల ♦ నటనముల్ చాలించి
సారె వేసారు మ♦యూరములను

తే. గీ. బాలశశిరేఖకు ముడుంగు♦పద్మినులను
వల్లకీవేణుమురజాది♦వాదనముల
జోలిమాలినచెలియలఁ ♦ జూచి చూచి
తెఱవకోపము వానిచేఁ ♦ దెలిసికొనుచు. 45

ఉ. ఏ మని పల్కునో చెలియ ♦ యేవహి నుండునొ యెట్టు లెంచునో
యే మని పల్కఁగా వలెనొ ♦ యే నపు డే మన నేమివచ్చునో
కాముఁడు తోడు గావలయుఁ ♦ గల్కికి మాకును జర్చ లేక మున్
బ్రేమలఁ గూడఁ గల్గునొ య♦టే యని నెమ్మదిఁ జింత సేయుచున్.

ఉ. గోపవతంసుఁ డీపగిదిఁ ♦ గొంకి తొలంగుచుఁ బోయి రాధికా
గోపిగృహంబుఁ జేరునెడ ♦ గుండియ భగ్గన మెల్ల మెల్లఁగా
లోపలి కేగి యచ్చట స♦రోజరిపూపలవేదిశయ్యపైఁ
గోపము గొన్న యాకుసుమ♦కోమలిని గని మేను ఝల్లనన్. 47

చ. పదములదండ నుండి భయ♦భక్తు లెసంగఁగఁ జుట్టి కెందొగల్
పొదలెడువీవనన్ జలువ ♦ పుట్టఁగ వీవఁగ దానఁ జానకున్
మదిని దురాపకోపశిఖ ♦ మట్టుక మీఱ మురారి ధీరుఁడై
మృదుమధురోక్తులన్ బలికె ♦ మీనవిలోచన నెన్ని తిన్నఁగన్ 48

చ. జలకము లాడ వేమి నను♦చల్వలు గట్ట వ దేమి మోమునం
దిలకము దిద్ద వేమి జిగి ♦ దేరెడిసొమ్ములు పెట్ట వేమి మైఁ
గలప మలంద వేమి వగ♦గా విరిజాజులు పూన వేమి నా
వలనను దప్పు లేమి మగు♦వా వివరింపు మెఱుంగ వేఁడెదన్. 49

సీ. అలసూర్యబింబ మై ♦ యలరునీనెమ్మొగం
బలసూర్యబింబ మై ♦ యలర నేల
మారుశరంబు లై ♦ మీఱునీచూపులు
మారుశరంబు లై ♦ మీఱ నేల
ప్రబలదుర్గంబు లై ♦ ప్రబలునీగుబ్బలు
ప్రబలదుర్గంబు లై ♦ ప్రబల నేల
యరిదిబంగార మై ♦ యమరునీమైజిగి
యరిదిబంగార మై ♦ యమర నేల
తే. గీ. చూడఁ గూడనినీరూపు♦చూడ కెసఁగె
నేటి కేటికి నెరయంగ ♦ నెరుక పడఁగ
నింతయలుకకుఁ గారణం ♦ బిది యటంచు
మందలింపుము నాయాన ♦ మందయాన. 50

సీ. మన కెన్నఁడును రాని♦మాన మిప్పుడు పూని
మాటాడ వేటికే ♦ మధురవాణి
నీకు నాకును గాని ♦ నేరంబు మది నాని
మనసియ్య వేటికే ♦ మధుపవేణి
యరమరికలు పూని ♦ యానేస్తములు మాని
మొగ మేల చూపవే ♦ చిగురుబోణి
నిన్ను నమ్మినవాని ♦ న న్నెక్కడను లేని
యగ డేల చేసెదే ♦ యబ్జపాణి
తే. గీ. మారుఁ డడె కానితన మూని ♦ పోరెఁ బోని
నీదు పుణ్యాని కేని నే♦నేరనేని

గాని మఱి దాని కేమి నీ♦పైనఁ గాని
కరుణఁజూడఁగ రాదె యో♦మరునితూణి. 51

కం. పెంచినదానవు దానిఁ గ
దించినదానవును నీవె ♦ తెగి మమ్మటకుం
బంచినదానవు నీవే
మంచిది మఱి నీవె యలుగ ♦ మర్యాదటవే. 52

ఉ. నేరము లున్న నోర్చి నను ♦ నిబ్బరపుంజనుదోయిఁ జేర్చి బల్
కూరిమి మోవి నొక్కుచును ♦ గుల్కుచుఁ బైకొని వేడ్కఁ బావురా
దారిగఁ బల్కుచుం జిలుత♦తాఁకుల నూకులఁ బైసరంబులన్
సారెకుఁ గూడి నామనసు ♦ చల్లఁగఁ జేయవె మున్ను కోమలీ. 53

సీ. సకియ నీకీల్జడ ♦ సరి వచ్చె నని కదా
మించి కాళియుని మ♦ర్దించు టెల్ల
నింతి నీబొమ్మల ♦ కెన వచ్చె నని కదా
విడక కంసునివిల్లు ♦ విఱుచు టెల్లఁ
దెఱవ నీచనులకు ♦ సరి వచ్చె నని కదా
గిరివరంబును బెల్ల♦గించు టెల్ల
సతి నీనితంబంబు♦జత వచ్చె నని కదా
మున్ను బండిని గూలఁ ♦ దన్ను టెల్ల
తే. గీ. వనిత నీయానమున కెన ♦ యనుచుఁ గాదె
కువలయాపీడమును బట్టి ♦ కొట్టు టెల్ల
నట్టినను న్యాయమా యిట్టి♦రట్టు సేయ
నరయు మది లోన నీవైన ♦ హంసయాన. 54

చ. చెలిమిని జిన్ననాఁడె నను ♦ జేరఁగఁ దీసి విరాళి గొల్పి నీ
పలచనిమోవిచక్కెరల♦పానక మానఁగ నిచ్చి నిండుకోఁ
గిలి నిడి చొక్కఁ జేసి మరు♦కేళుల రా పొనరించి యిట్టు లీ
వల వలదన్నఁ బోవుదునె ♦ వాదుకుఁ దీయక రాధికామణీ. 55

సీ. మన కిద్దఱికి మున్ను ♦ మఱుఁగుగా నడిచిన
మరునిముచ్చట లన్ని ♦ మఱచినావె
వదలితి చీర నా♦యెదుటనే బిత్తల
ననఁ జూడఁ బో కని ♦ నగితి వీవె
చెంబు పట్టుకొని చే♦సినపను ల్మఱచితి
చిన్నవాఁ డంటివి ♦ చింత యేమి
పంగుగా నీతొడ♦పయి నన్ను నెక్కించి
నాకు నుబ్బస మెత్త ♦ నవ్వి తీవె
భ్రాంతి నాకను లెఱ్ఱఁ ♦ బాఱుట గని నీవు
నిట్టూర్పు లిచ్చితి ♦ వట్టె యపుడు
తే. గీ. తిరిగి నీవేల బొల్లెమే ♦ స్థిరము పఱచి
చెప్పరానివి మఱి కొన్ని ♦ చేసి తీవె
మనకు జరిగినచేష్టలు ♦ మఱచినావె
అమ్మతోఁ జెప్పఁబోకు మ♦టంటి వీవె
మరులు కొల్పినదాన వే♦ముగువ నన్ను
నహహా! యిప్పుడు విడుచుట♦న్యాయమటవె. 56

చ. ఒకపరి నీకడ న్నిలిచి ♦ యుండినఁ జాలదె యొక్కసారి నీ
సొగసుమిటారపుంబయటఁ ♦ సోఁకినఁ జాలదె యొక్క తేప నీ
పగడపుమోవిపానకము ♦ పానము చేసినఁ జాలదే తపం
బొగి ఫలియించె నంచు మది ♦ నుందుఁ గదే జగదేకసుందరీ. 57

మ. అదిరా వింతవిధం బ దార తమకం ♦ బాయంద మింకొక్క మా
అది బా గాయె నటంచుఁ గ[illegible] మొ[illegible]చి నీ ♦ వర్ధోక్తులన్ మెచ్చఁగా
మది నుప్పొంగుచుఁ బ్రక్కమార్పులను బ్రే♦మన్ మోహము న్మించ ని
న్మదనానందరసాబ్ధిఁ దేల్చెదను గొ♦మ్మా సమ్మతింపం గదే. 58

సీ. అందె నై తే కదా ♦ యరవిందముఖి నేను
జేరి నీపదసేవఁ ♦ జేయుచుందుఁ

జీర నైతే కదా ♦ చెలియరో నీఘన
జఘనోరుసౌందర్య♦సరణిఁ గందు
రైక నైతే కదా ♦ రమణి నీసిబ్బెంపు
మెఱుఁగుచన్గుబ్బల♦మేల్మిఁ గందు
ముంగ రైతే కదా ♦ మోహనాంగిరో నీదు
పొలపుటూర్పులగాలి ♦ సోఁకి యుందు

తే. గీ. నహహ విత గాఁగ మీనకూ♦ర్మాదిరూప
ములను దాల్చితి వెట్టి నై ♦ ముద్దుగుమ్మ
తొల్లి యాచింత యొక్కింత ♦ తోఁచదాయె
గతము లగుకార్యములకిప్డు ♦ కలఁగనేల. 59

చ. చెలిమి యొనర్పవే మనవి ♦ చేకొనవే మొగ మెత్తి చూడవే
పలుకవె చేర రావె ననుఁ ♦ బ్రక్కను జేర్పవె యాదరింపవే
వలపు గణింపవే మరుది♦వాణము నంటెద సమ్మతింపవే
నిలువ తరంబు గాదు కరు♦ణింపవె నన్నిఁక భామినీమణీ. 60

చ. పొలఁతిరో నీవు పంప నటు ♦ పోవుటమాత్రమె కాని దానిపైఁ
జెలిమి యొనర్ప లే దనుచుఁ ♦ జెల్వగుకీల్జడచిల్వఁ బట్టి మే
లలర నితంబభూమితల ♦ మంటి ముఖద్విజరాజు ముట్టి నా
నిలకడ లెల్లఁ దెల్లమిగ ♦ నీయధరామృత మాని తెల్పెదన్. 61

కం. ఇంతీ పూఁబోఁణులమేల్
బంతీ సేమంతివిరిరు♦వారపుబంతీ
కంతునిపట్టపుదంతీ
పంతమె నాతోడ నీకు ♦ వలపుల దొంతీ. 62

కం. అని యెంత వేఁడుకొన్నను
జన వియ్యనిచెలిని జూచి ♦ సారసనాభుం
డనియె మది దిటము దెచ్చుక
వినయము నునుకినుక వలపు ♦ పెనఁగొని తొలుకన్.

ఉ. మారుఁడు చూడ నావరకు♦మారుఁడు బావమటంది రాజు నా
పేరిటివాఁడు మాధవుఁడు ♦ పేర్మిని బ్రాణపదంబు గాలి నర్క
పీ రిఁక నేమి సేయుదుకొ ♦ వేమటుఁ జూచెద నీదుకోస మ
వ్వారిగ వారె బాము లిడి ♦ ప్రాణము దీసిన నిచ్చెదం జెలీ. 64

చ. నెలఁతరొ నిన్ను నమ్మెదునె ♦ నీదుకురుల్ కుటిలమ్ము లాయెఁ జూ
పులు చపలమ్ము లాయెఁ గను♦బొమ్మలు వక్రము లాయెఁ గబ్బిగు
బ్బలు కఠినమ్ము లాయె మఱి ♦ భావము కర్కశ మాయె నాపయిం
గలుగుట యెట్లు నీకు దయ ♦ కన్గొనవే మది నంగనామణీ. 65

కం. చిగురువిలుకానిశరములు
తగ వెన్నునఁ దూరి నేను ♦ దల్లడపడఁగా
సొగసారి యింత యోర్తురె
నగిసం దగుపాటి గాక ♦ నాళీకముఖీ. 66

సీ. వలచి పాయుట పగ♦వారికైనను గాదు
[1]మునుపుగా నన్నది ♦ మనమె కాదొ
కవఁ బాసి బ్రతికిన♦కాంతలఁ గాంతుల
నటు మెచ్చునిది మన ♦ మానొ కాదొ
మనకూటమికి నాడు♦కొనెడువారలకన్నుఁ
బొడిచినరీతిని ♦ నడువ లేదొ
యుదయాస్తమయములు ♦ మదిలోనఁ దలఁపక
గడియకు పలుమాఱు ♦ కలియ లేదొ
తే. గీ. యిప్పటియుఋణానుబంధంబు ♦ లిట్టు లుండె
నైన నేమాయె నే మైన ♦ నైనఁ గాని
సుఖముగా నున్న నెపుడైనఁ♦జూడవచ్చుఁ
బోయి వచ్చెద సెలవిమ్ము♦పువ్వుఁబోఁడి. 67

చ. అనఁ గుబుసంబు నూడ్చినమ♦హోభుజగాంగన నా ముసుంగు తె
ప్పనఁ బెనవేసి లేచి ముడి♦బొమ్మ లెసంగఁ గటంబు లుబ్బఁగాఁ

1. మహిలోన నన్నది. [మూ].

గనుదోఁగ లెట్టివార ముఖ♦కంజము జేవురు దోఁపఁ జెమ్మటల్
కనఁబడఁ గావిమో వదరఁ ♦ గామిని పల్కె దురాపకోప యై. 68

ఉ. ఎవ్వరు పిల్చి రిచ్చటికి ♦ నెందుకు వచ్చితి వేమి కార్య మే
నెవ్వతె నీ వెవండ విఁక ♦ నెవ్వరి కెవ్వరు దేని కేది మీ
జవ్వని విన్న రవ్వ లిడుఁ ♦ జా ల్తడ వాయెను వచ్చి లేచి పో
నవ్వెద రెల్లవారలును ♦ నన్నును నిన్నును గోపశేఖరా. 69

చ. నిలుకడ సున్న తాల్మి నహి ♦ నేస్తము దబ్బర మాట పద్దులే
వలపు హుళిక్కి యాన లుసి ♦ వావులు పైపయిమేల్మి నీదునీ
తులు మెలమెచ్చు లాదరణ ♦ దూఱు దయ ల్సట నమ్మ వచ్చునే
యిల మగవారిఁ దన్మహిమ ♦ లెన్నఁగ శక్యమె యందులన్ హరీ.

చ. కపటులు క్రూరచిత్తులు స్వ♦కార్యపరుల్ కరుణావివర్జితుల్
చపలు లసత్యభాషణు లి♦ల న్మగవారలు వారిలోనఁ గొం
చపు నెరతుంటవింటివగ♦సామివి దేవర నీకు నాపయిం
గృప మఱి యేటికి న్గలుగుఁ ♦ గృష్ణ హరీ నవనీతచోరకా. 71

చ. మలఁకలమాట లిందు బహు♦మానము లచ్చట గచ్చు లిచ్చటన్
దలఁపులు దానిపైని బలు♦తప్పులు నాపయి నేస్త మాడఁ బే
రలుక మ ట్రీడఁ గూర్మివగ·♦ లక్కడ నిక్కడఁ ఠక్కు లద్దిరా
తెలియఁగ వచ్చె నీనడత ♦ తెల్లముగా విటలోకనాయకా. 72

చ. వలపులతిట్లు కొట్లు రతి♦పద్దులు నచ్చినచోట ముద్దులుం
గలుగఁగఁ బోదు నాయెడనె ♦ కాని మఱెక్కడ నంచు నుంటి చాల్
నలుగురిపట్ల నీ కిదియె ♦ నైజ మటంచు నెఱుంగ నైతి హా
నలువశిరంబు ముట్టినను ♦ నల్లనివానిని నమ్మ వచ్చునే. 73

ఉ. ఏమని చేరెనో చెలిమి ♦ యింతి రవంతయుఁ జింత సేయకే
వేమఱు నీదుపాలఁ బడి ♦ వేఁడి పెనంగిననాఁటనుండియున్
బాములె కాని సౌఖ్య మొక♦పాటిగ నైన నెఱుంగ నైతి రా
రామునిఁ బొందురామక్రియ ♦ రామునిసోదరుఁ డౌదు వన్నిటన్. 74

ఉ. అప్పటిరాధ వేఱె మఱి ♦ యప్పటికృష్ణుఁడు వేఱె చూడ నే
డిప్పటిరాధ వేఱె కన ♦ నిప్పటికృష్ణుఁడు వేఱె యింక నే
లప్పటిమాట లానడత ♦ లాతగు లాకొఱ లేనికూటముల్
ముప్పునజవ్వనంపుసుఖ♦ముల్ దలపోసిన నేమి శ్రీహరీ. 75

ఉ. అప్పుడు మల్లి నామనసు♦క్కై నటు లాడుచుఁ జేరి కన్నులం
గప్పక బాస లిచ్చి దయ ♦ కన్పడ నీవె విరాళి గొల్పఁగాఁ
దప్పక నీవె నే ననుచుఁ ♦ దద్దయు నమ్మితి నాఁడునాఁడె నీ
గప్పయెలుంగుచిల్వ వని ♦ కాంతుఁడ నే నెఱుఁగంగ నైతి రా. 76

చ. తొలుతను జీమకుట్టునొకొ ♦ దోమలు గుట్టునొ యంచుఁ జూచి నే
నెలమిగ నెత్తి పెంచి నిను ♦ నింతటివానిగఁ జేయు టెల్ల నీ
చెలియల కొప్పగించి వెతఁ ♦ జెందనొ కూడి సుఖంబు లందనో
వలనుగఁ దెల్పు మీ వయిన ♦ వైనము గాఁగ మురాసురాంతకా.

కం. విషకంధరునెచ్చెలి వై
విషకుచచనుబాలు గ్రోలి ♦ విషనిధిలోనర్క
విషధరుపైఁ దగునీదగు
విషమగుణం బేల పోవు ♦ విషరుహనయనా. 78

సీ. ధర బెస్తనేస్తంబు ♦ తొరసాలెపద్దులు
వెలయాలికూరిమి ♦ విటులనియమ
మగసాలెనిజమును ♦ జగలోభియీవియుఁ
గలుబొమ్మలింతగి ♦ కాకితెలుపు
కోమటిసత్యంబు ♦ గొల్లనిరసికత
కాముకజనులజ్జ ♦ ఖలునికరుణ
చోరస్వదేశంబు ♦ జూదరిధర్మంబు
తగవరిమోమోట ♦ మలసునిరతి

తే. గీ. గగనకుసుమంబు గొడ్రాలు♦కన్నబిడ్డ
శశివిషాణంబు దుర్బీజ♦జాతుఘనత

పంచమశుచిత్వ మల్లుని♦మంచితనము
గలదె నిన్ననఁ బని యేమి ♦ కలికిక్రృష్ణ. 79

తే. గీ. వాతె రానుచుఁ జెలిఁగూడు♦వారు లేరొ
ప్రక్క బాయక సతి నేలు♦వారు లేరొ
వనిత నైక్యము గొని పొర్లు♦వారు లేరొ
వారు నీదారి మెడఁగట్టు ♦ కోరు గాని. 80

సీ. గోముఖవ్యాఘ్రి మై ♦ గుదిగొనుమాయత్త
వదినగారికి మాఱు ♦ పలుక రాదు
మగఁ డైతె యేవేళ ♦ మండుచు నుండును
మామగా రంతకు ♦ మంట్లమారి
పెదబావగా రైతె ♦ బెబ్బులివలె దూఱుఁ
బినబావ చేకత్తి ♦ పెట్టఁ డవల
నిరుగుపొరుగువార♦లే యమదూతలు
తోడికోడలి కెదు ♦ రాడఁ గూడ

తే. గీ. దన్నదమ్ములు గన మేఁక♦వన్నెపులులు
సొరిది నిందత్రికనుగట్టి ♦ సున్నఁబెట్టి
నేను నినుఁ జేర నీవందు ♦ దానిఁగోర
బ్రతుకు బాగాయె ధూర్త గో♦పాలరాయ. 81

కం. అల్లందు కందుకొని నీ
బెల్లింపులఁ బడినమొదలు ♦ పెనుబాములకే
యి ల్లయితి నరసి చూడఁగ
గొల్లనితోఁ బొందుచెలికిఁ ♦ గొదవే కొదవల్. 82

కం. మును నిన్నుఁ గోరి చేరిన
దనుజాంగనముక్కు పోయె ♦ ధర నని తెలియక్
విని కని వలచితి నను-చో
నిను దూఱఁగ నేల నన్ను ♦ నే ననక హరీ. 83

సీ. మును మున్ను కొన్నాళ్ళు ♦ మన మున్నయద్భుతం
బదివిప్పి చెప్పఁగా ♦ నలవి గాదు
తవిలి కొన్నిదినంబు ♦ లవల నభేద మై
మెలఁగితి మెడ లేని♦మేల్మి యెసఁగ
నంతట నీవు నే ♦ నని కొన్నివారమ్ము
లమరితి మిద్దఱ ♦ మగుచు వెలసి
యిప్పుడు ముగుర మై♦యీనలుగురిలోన
విను కాఁపురము మూఁడు♦విధము లాయె

తే. గీ. నేమిటిసుఖంబు లిఁకమీఁద ♦ నేటిబ్రతుకు
లేటివఱదలఁ బోయె నీ♦మాట లెల్ల
నూర కిటు రవ్వ లిడి సరి♦వారు నవ్వ
వసుధపైఁ దారి నే నుండ ♦ వలెనె శౌరి. 84

సీ. ఎన లేనిప్రేమ నీ ♦ వెపుడు వత్తువో యంచుఁ
దలవాకి లిల్లుగా ♦ నిలిచి యుంటి
రమణ నవ్వుచు నీవు ♦ రాఁ జూతునే యంచుఁ
బడఁతుల శకునంబు ♦ లడుగుచుంటి
ములు సోఁక కీవు రా ♦ వలెఁ జేర నన్నంచుఁ
గులదేవతల నెల్లఁ ♦ గోరుకొంటి
నేరీతి నైన నీ ♦ విటు రాక పోవంచు
నిలువనిప్రాణముల్ ♦ నిలుపుకొంటి

తే. గీ. మరునివెడవింటిపాల్పడి ♦ యెరుక గంటి
నిపుడు నిను గంటి నీమాట ♦ లెల్ల వింటి
విడుము మీఁకఁ దొంటిపోకలు ♦ నడుపవంటి
దంటయిుళయింటి కేపొమ్ము ♦ తమ్మికంటి. 85

సీ. నీదుముద్దులగుమ్మ ♦ నీమోవి నొక్కితే
కటకటా నామది ♦ కంద నేల

నీప్రాణనాయిక ♦ నీచెక్కు గీటితే
కనలి నామది చుఱు ♦ క్కనఁగ నేల
నీదుచక్కరబొమ్మ ♦ ని న్నెంచ కాడితే
పొగిలి నామది చిన్న♦వోవ నేల
నీదుపట్టపుదేవి ♦ నిను చాల నెనసితే
యుడుగక నామేను ♦ బడల నేల

తే. గీ. నీదుదొరసానిచనులచే ♦ నీయురంబు
నొగులఁ గ్రుమ్మిన నామది ♦ నొవ్వ నేల
దానిసొమ్ముల కెవ్వతెఁ ♦ దలఁచి చూడ
వలపు పగవారి కై నను ♦ వలదు కృష్ణ. 86

తే. గీ. మున్ను జత గూడి వెంటనే ♦ నిన్ను వీడి
ప్రాణములు చేర నిన్నాళ్లు ♦ పట్టె నార
మరల నినుఁ బొంది పోయిన ♦ మరులు చెంది
జాలిఁ బడఁజాల నందగో♦పాలబాల. 87

కం. ఈనాఁటివఱకుఁ గానని
యీనాయత మెల్లఁ గంటి ♦ నీనానినుఁ దా
నీనం గాచియు నిళకే
యీ నాయెను నింక నాస ♦ లేల మురారీ. 88

సీ. కావేటికాల్వలై ♦ కడుఁ బొఱుకన్నీరు
వారక తుడిచెడు♦వారు లేక
విరహాగ్నిశిఖలచే ♦ వేగుచుఁ బొరలాడ
నూరడిల్లుమ యను♦వారు లేక
దిగులుచే నిల లేక ♦ తెగువ నేఁ జేయుచో
వల దని పలికెడు♦వారు లేక
మరుకోల లెద నాటి ♦ నెరకొట్టు కాడఁగా
భయపడ వ ద్దను♦వారు లేక

తే. గీ. కలఁగి మోహాబ్ధిలో మున్గి ♦ గాలిసోఁక
గట్టు గానక యుంటినే ♦ గాసిపడెడి
నాఁటికే లేనిమఱి నీవు ♦ నేఁటి కేల
చాల తడ వాయె లెమ్ము గో♦పాలరాయ. 89

కం. మానమె ధనముం గేహము
మానమె సర్వంబు చూడ ♦ మానవతులకున్
మానము పోయిన వెనుకం
బ్రాణముతో నుండ వలెనె ♦ పద్మదళాక్షా. 90

తే. గీ. అన్నియిటు లాడఁ గాంచి ము♦రాసురారి
రమణి దాసరితప్పు దం♦డమునఁ దీరుఁ
దీరుమాన మటంచని ♦ తెఱవపాద
పద్మముల వ్రాలె నళి తమ్మి ♦ వ్రాలినటుల. 91

కం. కని మంజీరము ఘల్లన
వనజజరుద్రాదివిబుధ♦వరసేవ్యం బై
తనరినహరిశిర మచ్చో
వనజేక్షణ ద్రోచె వామ♦పాదముచేతన్. 92

కం. లేచి యదూత్తముఁ డనుఁ జేఁ
జాచియ నాజన్మ మిపుడు ♦ సఫలం బాయెన్
నీచిన్నిపదము నొచ్చెనొ
నాచికురభరంబు దాఁకి ♦ నాళీకముఖీ. 93

చ. నెలఁతరొ యాలకించు తొడ♦నిగ్గు తళు క్కనఁ జీర జాఱఁగాఁ
గులుకుమెఱుంగుగబ్బిచను♦గుబ్బలు పొంగఁ బసిండియందియల్
ఘులుఘులుఘు ల్లనం జరణ♦కంజములన్ గొని తన్నినంగ మై
ఝులుఝులుఝు ల్లనం బులక♦జాలము లెత్తె న దేమి తెల్పుదున్. 94

సీ. చేతులమెఱుపుల♦చెన్ను లెం తైనను
ఒడలఁ జెందిననిగ్గు♦నడుము మేలు

గబ్బిగుబ్బలపెంపు♦కలుము లెంతైనను
బిఱుఁదులనెరిమిన♦పెంపు మేలు
కనుబొమపైఁదగు♦ఘనఫాల మెంతైన
నునుబొత్తికఁమపుకం♦దువలు మేలు
పలికెడుపెదవులఁ ♦ గలయొఱు పెంతైనఁ
బలుకనియలచోటి♦పొలుపు మేలు
తే. గీ. పైకి నెగిరినచీరయె ♦ యాకసంబు
మిగుల నాలోనిద్రవమె పో ♦ గగనగంగ
యారనూఁగారురేకయే ♦ కారుమొగులు
వనిత యాలింగనసుఖంబె ♦ వర్ష ఫలము. 95

చ. చులకనఁ జేసి నన్ వలపు ♦ చూఱలు వుచ్చిన వీడ నాడినం
బలికినఁ బల్కకుండినను ♦ బాలను ముంచిన నీట ముంచినం
జెలి మిఁకఁ జాలు పొమ్మనినఁ ♦ జేరఁగఁ బిల్చినఁ బిల్వ కుండినన్
భళిభళి యాను గా దనినఁ ♦ బాయుదునా నిను రాధికామణీ. 96

వ. అనిన విని. 97

కం వనజాక్ష [illegible] చేయఁగ
[illegible] యంత చాలు ♦ మానముకన్నన్
[illegible] మేమి ఘనముగు
[illegible] వలపు కోప ♦ మదనము గాఁగన్. 98

ఉ. అందపుపైఁటకొంగు [illegible] నిడి శౌరి చూడ నా
యుందునిభాస్య యొడ్చె [illegible] ♦ [illegible] కలస్వన మొప్ప వెక్కుచున్
సందగుగబ్బిగుబ్బలను ♦ [illegible]తన్న యనాంబుపూరముల్
మందగమేరుశైలముల ♦ [illegible]టికిఁ బొఱుఝురంబులో యనన్. 99

చ. చెలి యటు లేడ్వఁ జూచి హరి ♦ చేరి పదంబులు పట్టి కూర్మిచే
మెలఁతరో యేడ్వనేల నిను ♦ మించినవాఁడనె కోప మంతఁగాఁ
గలిగిన నన్నుఁ జేయఁ గల♦కార్యము లన్నియుఁ జేసికొమ్ము నే
తలఁపఁగ నీదుసొమ్మనుచుఁ ♦ దా బలిమిం గొని కౌఁగిలించినన్. 100

ఉ. అంతఁ బడంతి మై మఱచె ♦ నంబుజనాభుఁడు మోవి యాని నీ
మంతిని చెక్కు నొక్క హరి ♦ మర్మము లంటె మిటారి ముద్దిడెన్
కాంతుఁడు గోట మీటెఁ జెలి ♦ కన్గొని వెన్నుఁడు నీవి విప్పె నా
కంతునిదంతి తారసిలెఁ ♦ గమ్మవజీరునిపోరుకున్ వడిన్. 101

వ. ఇట్లనంగసంగరోత్సాహతరంగితాంతరంగులై రాధామాధవు లొక్కరొక్కరి చక్కనినెమ్మొనికమ్మనెత్తావుల సొమ్మసిల్లుచు ముమ్మరం బగుమోహంబుల నెమ్మదింజెంది రందు నందు సోదరీరత్నం బవాంతరలజ్జాభరంబునుంగొన మందరధరుం డమందానందంబున నందం బగుచెందొగల విందుచందంబును డిందుపఱచుసుందరమందస్మితవదనారవిందంబునం గ్రందుకొని ముద్దువెట్టినం బెట్ట నీయక నిద్దంపుటద్దంబున కుద్దియై తద్దయు నొప్పు ముద్దుచెక్కుల నొక్కిన నొక్కనీయక కప్పుగాఁ గప్పుకప్పులం గుప్పుగొప్ప నెరికొప్పునిమిరిన నిమర నీయక చొక్కంపు కెంపుసొంపుసంపాదించు తావి చెంగావిమోవి యానిన నాన నీయక కట్టాణిముత్తియంబులతీఁగెమోడికట్టు పనులఁ గనుపట్టుకెంబట్టురెకకుం బట్టుచాలక మట్టుమీఱి గుట్టు బయటఁ బెట్టుగబ్బిసిబ్బెపుటుబ్బుగుబ్బచనుగుబ్బలం బట్టినం బట్ట నీయక రంగుబంగరు దిం టెనవిరి వెంటనంటుతుంటవింటిదంటయింటి నంటిన నంటనీక మించుమించన మించుక్రొమ్మించు మెయిదీఁగె కౌఁగిటఁ గదియించినం గదియించనీయక దాపురంబులు వెట్టుచు నలయించిన నలయించువిలుగొన్నమన్నెదొరం గన్న న్నయాయన్నులతలమిన్న నొంటికళ లంటి సొక్కించి వితాళించి చివచివ లొదవఁ జివుకు చివుకునం బైకెక్కి నిక్కి చక్కెరమోవి నక్కజంబుగఁ జుక్క లేరుపడఁ జుఱుకుకన నొక్కి మక్కువ నెక్కొనం జెక్కిలి గొట్టి మదదంతిపై మంతుకెక్కుమావంతుటెక్కున సొక్కు దక్క గిలుకలచప్పర కొళ్ళమంచపుహాళహాళలును వెలిపక్కరెక్క దూదిమెత్తలో నత్తమిల్లుకీచు బుఱ్ఱలకూఁతలును సురతశ్రీమంబుల నెదల గమగమవలచుగోరజవాదిప్రోది నెత్తావులు ఘుమ్మఘు మ్మనం గ్రమ్మ బిసబిసవిస రెడిసూసపరిసురటిపిట్టల రెట్టచప్పుడులును బకదారులమొఱ్ఱితలును సారసకోకిలములకివకివలును గుఱ్ఱిక్కతిఱ్ఱిప్పక కొక్కోకశాస్త్రమ్ముం బ్రసంగించుకలికిచిలుకలకలకలంబు

లం గప్పినపరవశమ్ములం దప్పినమరుసామువరుస లెత్తి యిచ్చుగోరవంకల మెలుఁగులును నిచ్చలపుముచ్చటలం బెచ్చుపెరుఁగ మెచ్చు లిచ్చురాయం చలవళావళులును గళరవమ్ములును మంజుమంజీరఝుళంఝుళధ్వనులును విడకువిడువకుతడఁబడకుమెడమిడక విడివడి తొడఁబడ నదుమదుము మనునుచుపులును ఘనజఘనసంఘట్టనా చటచటాత్కారంబులు తోరంబులై మీాసరంబు లగుపై సరంబు లెత్త నాబిత్తరి తత్తరిలక హత్తుకొని తళుకుతళుకు మనుచిలుకతేజీవజీరుహజారంబునం దమి చిలుక నెదురొత్తు లిచ్చుచు సాటి లేనిమేటిగోటిపోటులం జొత్తిల్లు కొత్తనెత్తురుల మత్తిల్లుబిత్తరపుగుత్తంపు చనుగుత్తు లెద నొత్తి యిరుఁగేలు సాచి కంబుధరుగళంబును గాఁగిలించి మోము మోమునఁ జేర్చి తన్మధురాధరసుధారసధారలం గ్రోలి తియ్యని రుచులం దేలె నిట్లిరువురు నొడలడరఁ దొడరిదుడుకు లదరింపులు భ్రూవిభంగంబులను చిఱునన్న లుద్దవిడిపద్దులగ్గలికెతాఁకునూకులువీఁకమీఱ బాహాబాహిం గచాకచిం బెనంగుచుఁ జెంగట నెసంగుభర్మనిర్మిత చిత్రరత్నరత్నమాలికాయంత్రపాంచాలికాహస్తవిన్యస్త మల్లరంగసముల్లసితమల్లవల్లభుల దండివెనుదండివిడక న్యస్తసువర్ణవర్ణనీయసుగంధబంధురసుమతాళవృంతోద్ధూతవాతప్రవర్ధితాగురుధూపధూమస్తోమంబు లెగిరి నిగనిగ మనుజిగిమొగులనఁ గప్పుకొని యన్యోన్యానలాలోకనోత్సాహమోహంబుల నించుక యపనయింపఁ బునఃపరస్పరదర్శనోద్యోగవేగంబులం బుట్టి బెట్టునిట్టూర్పుగాడ్పులం గొట్టువడి యెట్టకేలకుం దెట్టగిలి నెట్టన మొగంబులు చూచుకొని తడవెడసి గొబ్బఁ బడినజక్కవపక్కులమక్కువ లంది యిం పొందం బొందు చౌశీతిబంధప్రతిబింబంబుల ముకురంబులం గని సంకుచితమందహాసంబుల నిరవొందుచుఁ బెనంగుసమయంబున. 102

కం. హత్తుకొని యున్నవిధములఁ
దత్తరపడ ననఁగి పెనఁగి ♦ తనివారక యా
బిత్తరి పైకొనె హరిపై
మత్తేభముమీాఁద నెక్కు ♦ మావంతుఁ డనన్. 103

సీ. మరుగుహారముఁ బోలె ♦ గిఱికొన్న నెరికురు
　　　ల్గ్రిమ్మిమ్మున్ద్రోఁచుచీఁ♦కటులు గాఁగ
జలజల మని రాలు ♦ సన్నజాజులచాలు
　　　చీలి వ్రాలెమురిక్క♦చాలు గాఁగఁ
జిఱుకమ్మచెమ్మట ♦ ల్నెరిఁ దోఁచుఫాలంబు
　　　రేఱేనిచిన్నారి♦రేక గాఁగఁ
గరఁగి జాఱినసిస్తు♦కస్తూరితిలకంబు
　　　క్రందుగాఁ జెలు వందు♦కందు గాఁగఁ

తే. గీ. వలపుచిఱునవ్వు లలతివె♦న్నెలలు గాఁగ
నాశలను బెంచి కానని♦యంద మూని
కృష్ణపక్షరీతి నా♦కృష్ణవేణి
కృష్ణదేవునిపై నుండి ♦ కేళి సలిపె. 104

సీ. చెంపు గోరించిన♦దండిగాఁ బైనుండి
　　　కుఱుచసన్నలఁ బడుఁ ♦ గొంతసేపు
గాలి చకరిముఁ జుట్టు♦కరణిని దిరుగుల్ల
　　　వింతగాఁ దిరుగును ♦ గొంతసేపు
పసిడిజంత్రపుబొమ్మ♦పగిది విన్నాణముల్
　　　కులుకుచు నటియించుఁ ♦ గొంతసేపు
తుద నాడుబొంగరం ♦ బిది నాఁగఁ గసి దీఱఁ
　　　గంతుశివం బాడుఁ ♦ గొంతసేపు

తే. గీ. అభినయము పట్టు మని చెక్కు ♦ నమరిఁ గొట్టు
ముద మొదవఁ దిట్టు ముద్దుపై ♦ ముద్దు వెట్టు
మర్మములఁ గొట్టు మెలమెల ♦ మబ్బు దట్టు
బాల హరిపైని బుంభావ♦కేళి వేళ. 105

ఉ. సరసిజగంధి యీపగిది ♦ శౌరిని గూఁటక కౌఁగిలింపఁగా
గిఱికొని ముత్యపుఁ సరులు ♦ కెంపులదండలు ఝల్లు ఝల్లనన్

బెరుగుచు రాలె ము న్మరుఁడు ♦ పేర్చినమల్లియతూపుగుంపు త
ద్గురుశిఖివిస్ఫులింగములఁ ♦ గూడుక రాలినలీల దోఁపఁగ౯ 106

వ. అట్టియెడనున మదనజనకుం డామదవతిం జూచి యిట్టు లనియె.

సీ. వలుదగుబ్బలగోరు♦వంక లేదవి రాధ
యవి నీ వెఱుంగుదు ♦ వంబుజాక్ష
చక్కెరకెమ్మోవి ♦ నొక్కు లేదవి రాధ
యవి నీ వెఱుంగుదు ♦ వమరవంద్య
మిసిమిటొప్పలఁ దమ్మ♦రసము లేదవి రాధ
యవి నీ వెఱుంగుదు ♦ వాదిదేవ
తగువెన్నుసరిపెన♦దండ లేదవి రాధ
యవి నీ వెఱుంగుదు ♦ వతనుజనక
తే. గీ. యనుచు నిరువురు గడిదేరి ♦ హావుసుమీఱి
యాని సరిపోరికెమ్మోవు ♦ లానఁజేరి
తమిఁ జెలఁగఁ జీరి యలకేర♦జములఁదారి
[1]కోరి మరుబారి నలసిరి ♦ కొమరు మీఱి.

సీ. రమ్యబృందావనా♦రామసీమలయందు
[2]నతులితగోవర్ధ♦నాద్రియందు
సత్ప్రభోజ్జ్వలరత్న♦సౌధాగ్రములయందుఁ
దరణిజాసైకత♦స్థలములందుఁ
బారిజాతలతాంత♦పర్యంకములయందు
బహుచిత్రకేళికా♦గృహములందు

1. కూడి మరుకేళిసలిపిరి ♦ కోప మారి. [మూ].
2. స్వచ్ఛోదకాపూర్ణ♦సరసు లందు. [మూ].

మారుతకలితవా♦నీరకుంజములందు
భీమనదీతీర♦భూములందు

తే. గీ. సరసభాండీరవటతరు♦చ్ఛాయలందుఁ
జారుతరచంద్రచంద్రికా♦పూరమందు
దేవదేవుండు రాధికా♦దేవితోడఁ
గూడి విహరించె మదిలోని♦కోర్కె లలర. 109

తే. గీ. సంపదలు గల్గురాధికా♦సాంత్వనంబు
చదివినను విన్నఁ గైకొన్నఁ♦జదువుచున్న
వారి కవ్వారిగా నల♦వార వారి
జాక్షుఁ డొసఁగును గోరిక ♦ లధికదయను. 110

శా. శ్రీలక్ష్మీముఖపద్మషట్పద తను♦శ్రీశిక్షితనీలాంబుదా
లీలామానుషవిగ్రహా ప్రమదలే♦లీహాసశయ్యాస్పదా
కాళిందీతట కేళికోవిద మహా♦కంసాదిదుష్టాత్మదా
కాళీయోరగరత్నరంజితపదా ♦ కౌంతేయధైర్యప్రదా. 111

కం. సారగదాధార సదా
చార సదాతనువినూత్న♦చారుతరోద్య
న్మారజితాకారయుతా
ధీరనుతాపారచరిత♦ధిక్కృతదురితా. 112

మత్త. నాగపాలక నాగదాలక ♦ నాగఫాలకవాహనా
వాగధీశ్వర వాగపీశ్వర ♦ వాగసశ్వరగాహనా
యోగచారణ యోగధారణ ♦ యోగకారణ సాహనా
భోగశోషణ భోగిసేవణ ♦ భోగిభూషణమోహనా. 113

గద్యము.

ఇది శ్రీచిన్నికృష్ణకరుణాకటాక్షవీక్షణక్షణప్రవర్ధమానానూనశృంగారరసప్రధానసంగీతసాహిత్యభరతశాస్త్రాదివిద్యాపారంగత శ్రీమత్తిరుమల తాతయాచార్యపాదారవిందమిళిందాయమానమానసచోళ సింహాసనాధ్యక్ష ప్రతాపసింహమహారాజ బహూకృతానేకచామీకరాంబరాభరణ ముత్యాలుగర్భశుక్తిముక్తాయమానముద్దుపళనిప్రణీతం బైన రాధికాసాంత్వనం బనుశృంగారప్రబంధంబునందు సర్వంబును జతుర్థాశ్వాసము.

తే. గీ. కృష్ణదేవునియాజ్ఞ నీ ♦ కృతిని ముద్దు
పళని యనువేశ్య రచియించె ♦ లలితపణితి
అధికశృంగారకావ్య మై ♦ యలరియుంట
దీని ము న్ముందుఁ బ్రకటింపఁ ♦ బూనినాఁడ.

ఇట్లు,
కోసూరు గురునాథమూర్తి,
స్థాపకుఁడు,
శృంగార కావ్య గ్రంథమండలి.

24040

# తప్పొప్పులు

—:o:—

| పుట | బంతి. | తప్పు. | ఒప్పు |
|---|---|---|---|
| 12 | 27 | కరున | కర్జున |
| 13 | 13 | ల్గీను | ల్వీను |
| 55 | 3 | జిగిగంద | జిగిచంద |
| 105 | 27 | చెప్పుఁగో | చెప్పుదో |
| 136 | 21 | లిగింతగి | గిలిగింత |
| 144 | 12 | పక్షు | పక్షము |